ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 5
జిల్లా వార్తలు
ఆదివారం 24, మార్చి 2024



కమిషనర్‌కు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

అధికారపార్టీకి కొందరు ప్రభుత్వ ఉద్యోగులు జీహుజూర్ అంటున్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పట్టించుకుంటున్న పరిస్థితి లేకుండా పోయింది. ప్రచారంలో పాల్గొనడమే కాకుండా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ప్రధానంగా వలంటీర్లు రెచ్చిపోతున్నారు. పార్టీ నాయకులతో కలిసి పర్యటించరాదని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను లెక్కచేయడం లేదు. నిబంధనలు తమకు వర్తించవన్నట్లుగా అధికారపార్టీ కార్యక్రమాల్లో మునిగి తేలుతున్నారు. తాజాగా అక్కడక్కడా అధికారులు చర్యలు తీసుకుంటుండటంతో వారు రూటుమార్చారు. తమకు పోస్టులు అవసరం లేదంటూ రాజీనామా చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండ ఉందన్న ధీమాతో వారు అలా ప్రవర్తిస్తున్నారని తెలుస్తోంది.

- వైసీపీ నాయకుల కొత్త ఎత్తుగడ
- ఏడుగురు వలంటీర్ల రాజీనామా
- జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న తొలగింపులు
- అయినా వెనక్కి తగ్గని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు
- ఒంగోలు మేయర్ తాయిలాలపై తూతూమంత్రపు చర్యలు
- ఏడుగురికే నోటీసులు.. అధికారులపై విమర్శల వెల్లువ

ఉల్లంఘనలు

వీరు మారరంతే!

- కొండను తవ్వి ఎలుకను పట్టారు..!
- నిబంధనలు అతిక్రమించిన మేయర్‌పై చర్యలేవి?
- సచివాలయ సెక్రటరీలకు బహుమతులపై ఈసీ సీరియస్
- 700 మందికిగాను ఏడుగురికే నోటీసులా?

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 23 : అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికల కమిషన్ ఆదేశాలను సైతం ధిక్కరించి మేయర్ గంగాడ సుజాత చేసిన పనికి ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన సచివాలయ సెక్రటరీలు బలయ్యారు. ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన విషయం విదితమే. అయితే అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఈ ఎన్నికల్లో గెలుపు కోసం వైసీపీ నేతలు బహుమతులు ఎరగా చూపి ఇబ్బడిముబ్బడిగా పంచేశారు. ఒంగోలు నగరపరిధిలో 70 సచివాలయాలు ఉండగా, ఒక్కో సచివాలయంలో సగటున పదిమంది సెక్రటరీలు పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులైన వారిని సమావేశం పేరుతో మేయర్ ఇంటికి పిలిపించుకుని వైసీపీ కోసం పనిచేయాలని ఆదేశించారు. అనంతరం ఇటీవల ఇళ్లపట్టాల పంపిణీలో కష్టపడి పనిచేశారు.. అంటూ గిఫ్టులు ఇచ్చి మరీ పంపారు. అయితే అప్పటికే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ కథనాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దీనిపై ఎన్నికల కమిషన్ సీరియస్ కావడంతోపాటు జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న కలెక్టర్‌కు పలు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మొత్తంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశించినప్పటికీ అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకుండా కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు.

మిగిలిన వారిపై చర్యలేవి ?

సుమారు 700 మంది సెక్రటరీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. అయితే వారిలో అధికారులకు ఏడుగురు మాత్రమే బాధ్యులుగా కనిపించడంపై ప్రజలు ఆశ్చర్యంవ్యక్తం చేస్తున్నారు. అందులో ఒకరు రెడ్డి సామాజికవర్గానికి చెందిన సెక్రటరీ ఉండగా, మిగిలిన ఆరుగురు ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన వారే. ప్రత్యేకించి కార్పొరేషన్ అధికారుల ఆదేశాలు లేకుండా కనీసం ఇంటిపన్ను పేరు కూడా మార్చని సెక్రటరీలు సొంతంగా మేయర్ ఇంటికెళ్లి బహుమతులు తెచ్చుకునే సాహసం చేయరని ప్రజల నుంచి వినిపిస్తున్న మాట. అయితే కార్పొరేషన్ అధికారులు కేవలం ఏడుగురుపైనే చర్యలు తీసుకుంటుండగా, అసలు నిబంధనలు ఉల్లంఘించి మరీ ఇంటికి పిలిపించుకున్న మేయర్ గంగాడ సుజాత విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనకూడదని చెబుతున్న ఈసీ ప్రజాప్రతినిధులపైనా కొరడా ఝుళిపించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే మొక్కుబడి చర్యలతో ముగించకుండా పూర్తిస్థాయిలో విచారణ చేసి అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ అనిల్‌కుమార్

మార్కాపురం రూరల్, మార్చి 23 : ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వైసీపీ అభ్యర్థులతో కలిసి వలంటీర్లు ప్రచారం చేస్తుండడంతో ఎన్నికల కమిషన్ కన్నెర్ర చేస్తోంది. వారిని విధుల నుంచి తొలగిస్తోంది. దీంతో ఎలాగైనా ఎన్నికలలో వారితో ప్రచారం చేయించాలనే ఆలోచనతో వైసీపీ నాయకులు కొత్త ఎత్తులు వేస్తున్నారు. వలంటీర్లతో రాజీనామా చేయిస్తున్నారు. అందులో భాగంగానే మార్కాపురంలో పనిచేస్తున్న ఏడుగురు వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. ఆ పత్రాలను మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కు కార్యాలయంలో అందజేశారు. తామంతా 'జగనన్న కోసం పనిచేసేందుకు రాజీనామా చేస్తున్నాం' అని ప్రకటించారు. వలంటీర్లుగా రాజీనామా చేసిన వారిలో పట్టణంలోని ఏడవ సచివాలయంలో పనిచేస్తున్న రాచకొండ రమణయ్య, ఎనిమిదో సచివాలయంలో పనిచేస్తున్న షేక్ రఫి, ఎం.రామిరెడ్డి, కేలం శివారెడ్డి, షేక్ ఇబ్రహీం, తొమ్మిదో సచివాలయంలో పనిచేస్తున్న బిలాల్ మసీద్, దుద్దుకూరి లక్ష్మీనారాయణ ఉన్నారు.

ప్రచారంలో పాల్గొన్న టెక్నికల్ అసిస్టెంట్‌పై వేటు

మార్కాపురం పట్టణం కంభంరోడ్డులోని 25వ వార్డులో వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు నిర్వహించిన ప్రచార సభలో పాల్గొన్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ కుందురు అనిల్‌కు మార్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లుగా ఫొటోలు, వీడియోలు ఉన్న వివరాలను జిల్లాస్థాయి అధికారులకు, ఎన్నికల ప్రవర్తన నియామావళి అధికారులకు స్థానికులు పంపించారు. దీంతో వారి ఆదేశాల ప్రకారం అనిల్‌కుమార్‌రెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

ఇద్దరు వలంటీర్లు విధుల నుంచి తొలగింపు

తర్లుపాడు : మండలంలోని తాడివారిపల్లెలో వైసీపీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు ఆవుల మంద వెంకటేశ్వర్లు, జమ్ముల బాబును విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఎవరైనా వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఎమ్మెల్యే అన్నా రాంబాబుపై కేసు

పట్టణంలోని కంభం కూడలిలో నూతనంగా ప్రభుత్వం నిర్మిస్తున్న షాదీఖానా స్లాబు పనుల ప్రారంభం కార్యక్రమంలో ఈనెల 17న పాల్గొన్న ఎమ్మెల్యే అన్నా రాంబాబుపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదైంది. నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఫొటోలు, వీడియోల ద్వారా వివరాలను సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా పరిశీలించారు. ఆయన ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు.

సందట్లో సడేమియా!

- రూ.10 కోట్ల విలువైన బండిదారి స్వాహా
- యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- ప్రహరీలు కడుతున్న కొందరు
- చోద్యంచూస్తున్న రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులు



బండిదారిలో సాగుతున్న అక్రమ నిర్మాణాలు (ఇన్‌సెట్‌లో) ఆక్రమణదారుడు నిర్మిస్తున్న గృహం

దర్శి, మార్చి 23 : దర్శిలో కోట్లాది రూపాయల విలువచేసే బండిదారి స్థలం పూర్తిగా స్వాహా అవుతోంది. ఆ స్థలంలో యథేచ్ఛగా గృహాలు, ఇతర నిర్మాణాలను అక్రమంగా సాగిస్తున్నారు. కొంతమంది ప్రహరీగోడలను నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులు తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. ఆక్రమణదారుల వద్ద లక్షలాది రూపాయలు ముడుపులు తీసుకొని వారికి సహకరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దర్శి - కురిచేడు రోడ్డులో 247, 248, 266 సర్వేనెంబర్లలో సుమారు పది ఎకరాల బండిదారి భూమి ఉంది. దర్శి నుంచి పడమర వైపున ఉన్న పొలాలకు వెళ్లేందుకు వీలుగా ఇతర అవసరాలను దృష్టిలో పెట్టుకొని సుమారు 120 అడుగుల వెడల్పులో కిలోమీటర్ దూరం బండిదారి కోసం స్థలాన్ని వదిలారు. గత కొంతకాలంగా ఆ స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. దర్శి పట్టణానికి సమీపంలో ఉండటంతో భారీగా విలువ పెరిగింది. దీంతో ముందుగానే ఒక కళాశాల యాజమాన్యం ఎకరానికి పైగా స్థలాన్ని ఆక్రమించి ప్రహరీగోడను నిర్మించుకొని కళాశాలలో కలుపుకుంది. అందులో షెడ్లను కూడా వేసి వినియోగించుకుంటున్నారు. బండి దారికి ఇరువైపులా ఉన్న రైతులు కొంతమంది మరికొంత స్థలాన్ని ఆక్రమించి తమ పొలంలో కలుపుకున్నారు. ఇలా ఆక్రమణలతో గతంలోనే సగానికిపైగా కనుమరుగైంది.

వైసీపీ పాలనలో ఆక్రమణల జోరు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బండిదారిలో ఆక్రమణలు మరింత పెరిగాయి. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఐదు ఎకరాల బండిదారి భూమిలో అనేక మంది పాగా వేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. కొంతమంది ఇళ్లను నిర్మిస్తుండగా, మరికొందరు ఆక్రమించిన స్థలం చుట్టూ ప్రహరీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రస్తుతం అక్కడ ఎకరం రూ.2కోట్లకు పైగా ధర పలుకుతోంది. ఈ లెక్కన రూ.10కోట్ల విలువైన బండిదారి స్థలం కొద్ది కాలంలోనే ఆక్రమణకు గురైంది. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాల్సిన నగర పంచాయతీ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదు. ఆక్రమణదారుల వద్ద ముడుపులు తీసుకొని వారికి సహకరిస్తూ ఇరుశాఖల అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పటిష్ట చర్యలు తీసుకొని బండిదారిని కాపాడాలని కోరుతున్నారు.

రేషన్.. రూటు మార్చేన్..

- అక్రమ వ్యాపారంతో రూ. కోట్ల సంపాదన
- బియ్యం రవాణాకు కేంద్రంగా ఒంగోలు
- సొంత వాహనాలు కొనుగోలు చేసి తరలింపు
- బహిరంగంగా తీసుకెళ్తున్నా పట్టించుకోని యంత్రాంగం

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 23 : రేషన్ బియ్యాన్ని ఎప్పటికప్పుడు కొత్త ఎత్తుగడలతో అక్రమార్కులు రాత్రికి రాత్రే తరలిస్తున్నారు. ఒంగోలు కేంద్రంగా మిల్లులను అద్దెకు తీసుకొని వాటి ద్వారానే బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి లక్షలు సంపాదిస్తున్నారు. ఐదారు నెలల క్రితం జిల్లావ్యాప్తంగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బియ్యం అక్రమ నిల్వలపై దాడులు చేయడంతో కొంత మేర వ్యాపారం తగ్గించారు. అయితే ఇటీవల కొత్త పద్ధతులు మొదలుపెట్టారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు ఇప్పుడు మరింత రెచ్చిపోతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుండటంతో బహిరంగంగానే బియ్యాన్ని సేకరించి నిల్వలు పెడుతున్నారు. ఇందుకు అధికారపార్టీ నాయకుల అండదండలు భారీగా ఉన్నాయి. వారితో ఉన్న సాన్నిహిత్యాన్ని అడ్డం పెట్టుకుని రేషన్ బియ్యం కొనుగోలు నుంచి ఇతర ప్రాంతాలకు తరలించే వరకు అనుసరిస్తున్న విధానాలు ఎవరికి తెలియనీయడం లేదు.

డీలర్ వద్ద కిలో రూ.22కు కొనుగోలు

రేషన్ డీలర్ల వద్ద కిలో రూ.22కు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు నేరుగా మిల్లుకు తరలించి అక్కడ కిలో రూ.32కు విక్రయిస్తున్నారు. ఆ మిల్లులో గోతాలు మార్చి రాత్రికి రాత్రే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అందుకోసం కొంతమంది సొంతంగానే లారీలను ఏర్పాటు చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 1వతేదీ నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులకు రేషన్ పంపిణీ ప్రక్రియ జరుగుతుంది. అయితే ఈ 15రోజుల్లోనే భారీ ఎత్తున అక్రమంగా రేషన్ బియ్యం తరలిపోతున్నా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టించు కోవడం లేదు. ఈ అక్రమ వ్యాపారం కోసం కొంతమంది లారీలే కొనుగోలు చేశారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒంగోలు నగరంలో ఈ అక్రమ వ్యాపారం చేస్తున్న అధికార పార్టీకి చెందిన నేతలు సుమారు డజను మందికి పైగా ఉన్నారు. వీరందరూ ప్రాంతాల వారీగా ఎంపిక చేసుకొని డీలర్ల వద్ద నుంచి బియ్యం కొనుగోలు చేసి తమ మిల్లులకు తరలించి అక్కడి నుంచి లారీల్లో తరలిస్తున్నారు.



తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం...

రేషన్ వ్యాపారంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుండటతో ఇష్టారీతిన డీలర్ల వద్ద నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి కోట్లు సంపాదిస్తున్నారు. అందుకు కొంతమంది అధికారులు, అధికారపార్టీ నాయకుల సహకారం ఉండటంతో ఈవ్యాపారం 'మూడు పువ్వులు ఆరు కాయలు'గా విరాజిల్లుతోంది. జిల్లాలో 1,392 రేషన్ షాపుల పరిధిలో 6.60లక్షల కార్డులు ఉండగా అందుకోసం 10,444 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ప్రస్తుతం కార్డుదారులకు బియ్యాన్ని ఉచితంగా ఇస్తున్నారు. అక్రమార్కులు ముందుగానే రేషన్ డీలర్లతో ఒప్పందం చేసుకొని బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. కార్డుదారుల నుంచి ఎండీయూ ఆపరేటర్ల ద్వారా కిలో రూ.10కి కొనుగోలు చేసి అక్రమార్కులకు కిలో రూ.22 వరకు విక్రయిస్తున్నారు. అలా కిలోకు రూ.10కిపైగా డీలర్లకు ఆదాయం వస్తుండగా అక్రమ బియ్యం వ్యాపారులు అంతకు రెట్టింపు ధరకు విక్రయిస్తూ కోట్లు గడిస్తున్నారు.

వైసీపీ బొట్టు బిళ్లలమ్మా!



ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి భార్య ఇంటింటి ప్రచారంలో మహిళలకు పంపిణీ

గిద్దలూరు టౌన్, మార్చి 23 : వైసీపీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులు, వారి అనుచరులు ప్రచారంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. శనివారం పట్టణంలోని 18, 19 వార్డులలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి భార్య కల్పనారెడ్డి, ఎమ్మెల్యే సోదరితోపాటు మహిళలు, పలువురు వైసీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి మద్దతు పలకాలంటూ కరపత్రాలను అందజేశారు. వైసీపీ నేతల బొమ్మలతో ఉన్న బొట్టు బిళ్లలు పంపిణీ చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఇలా చేయడంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్

పొదిలి, మార్చి 23 : మార్కాపురం వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు తనయుడు కృష్ణచైతన్య శనివారం సాయంత్రం లక్కిశెట్టిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో 1వ సచివాలయం వలంటీర్ కుంచాల నాగరాజు పాల్గొని తన స్వామిభక్తిని చాటుకున్నారు. ఎన్నికల్లో వలంటీర్లు పాల్గొనవద్దని స్పష్టమైన ఆదేశాలున్నా నాగరాజు ధిక్కరించడం గమనార్హం.



లక్కిశెట్టిపాలెంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ నాగరాజు

కబ్జాదారుకు మేం ఓట్లేయం!

- కనిగిరిలో వైసీపీ అభ్యర్థికి చేదు అనుభవం

కనిగిరి, మార్చి 23 : కనిగిరిలోని నాలుగు పక్కలా పేదలు, దళితులు, బలహీనులకు చెందిన భూములను ఆక్రమించి, రాజకీయ నేతగా ఎదిగిన కబ్జాదారుకు మేము ఓట్లేయాలా..? అని ప్రజలు ప్రశ్నించడంతో వైసీపీ నేతలు షాక్‌కు గురయ్యారు. గురువారం రాత్రి కనిగిరి పట్టణంలో ప్రచారం చేస్తున్న వైసీపీ నేతలకు చేదు అనుభవం ఎదురవడం హాట్‌టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. కనిగిరిలో మూడు రోజులుగా వైసీపీ అభ్యర్థి ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలోని ప్రధాన సామాజికవర్గానికి చెందిన ప్రజలు నివసించే ప్రాంతానికి ఆయన వెళ్లారు. ఆయా వీధుల్లోకి వెళ్లిన వైసీపీ అభ్యర్థి తనను గెలిపించాలని కోరడంతో ప్రధాన సామాజికవర్గానికి చెందిన మహిళలు పెద్దఎత్తున తిరగబడ్డారు. తమ బంధువులకు చెందిన భూములను వారికి తెలియకుండానే ఆక్రమించి ప్లాట్లుగా వేసి అమ్ముకున్నారని నిలదీశారు. 'మీకు దిక్కున్న చోట చెప్పుకోండి.. లేదంటే ఇచ్చింది తీసుకోండి' అని అన్యాయంగా మాట్లాడిన నీకా మేము ఓట్లేయాలి అంటూ మండిపడినట్లు తెలిసింది. స్థానికులు నిలదీస్తుండగా ప్రచారానికి వెళ్లిన అభ్యర్థి, అతని పక్కనున్న వైసీపీ నేతలు సమాధానాలు దాటవేశారు. అయితే తాము కబ్జాదారులకు ఓట్లు వేయమని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

'పది' పరీక్షలకు 99శాతం మంది హాజరు

ఒంగోలు (విద్య), మార్చి 23 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ (పీఎస్) పరీక్షకు 99శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 29,356 మంది హాజరు కావాల్సి ఉండగా 29,103 మంది రాశారు. 253 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 1,112మందికిగాను 515 మంది హాజరు కాగా 597 మంది గైర్హాజరయ్యారు. కేవలం 46.31శాతం మంది మాత్రమే రాశారు. 75 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు ఎంఆర్.ప్రసన్నకుమార్ ఐదు కేంద్రాలను సందర్శించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 92 కేంద్రాలను తనిఖీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో డి.సుభద్ర తెలిపారు.

టోకెన్ కష్టాలు

- రాక రాక వచ్చిన ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసుకొనేందుకు ఇబ్బందులు
- గత నెలలో జమ అయినా ఒక్కపైసా తీసుకోలేని దుస్థితి
- కొత్త విధానంతో ఇబ్బందికరం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23 : కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థికసంఘం నిధులను డ్రా చేసుకునేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికే పంచాయతీల్లో చిల్లిగవ్వ లేక కునారిల్లుతున్న సమయంలో రాక రాక వచ్చిన నిధులను కూడా సకాలంలో తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కేంద్రప్రభుత్వం గత నెలలో సుమారు రూ.35కోట్ల ఆర్థికసంఘం నిధులను నేరుగా జిల్లాలోని పంచాయతీ అకౌంట్లకు జమచేసింది. అయితే ఆ నిధులను డ్రా చేసుకునేందుకు కొత్తగా టోకెన్ సిస్టం ఏర్పాటు చేశారు. సాధారణంగా పంచాయతీ నిధులను తీసుకునేందుకు పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లకు టోకెన్ (కంప్యూటర్ సిగ్నేచర్) విధానం ఉండటంతోపాటు ఎంపీడీవో కూడా ఇవ్వాల్సి ఉంది. అయితే ఆ సమయంలో జిల్లావ్యాప్తంగా ఎంపీడీవోల బదిలీలు కావడంతో టోకెన్ రాలేదు. నెల్లూరు, గుంటూరు జిల్లాల నుంచి అధికారులు వచ్చి బాధ్యతలు స్వీకరించిన పక్షంరోజుల తర్వాత వారికి టోకెన్ వచ్చింది. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఎన్ఐసీ ద్వారా ఆ ప్రక్రియను ఈనెల 15వతేదీలోపు పూర్తిచేశారు. ఆయా మండలాల్లో ఆర్థికసంఘం నిధులను డ్రా చేసుకునేందుకు మండల స్థాయిలో టోకెన్ పూర్తయిన తర్వాత జిల్లా పరిషత్ సీఈవో టోకెన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సమయంలోనే సీఈవోను కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ప్రస్తుతం ఇన్‌చార్జి సీఈవోను నియమించినా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించలేదు. దాని కారణంగా ప్రస్తుతం ఇన్‌చార్జి సీఈవోకు టోకెన్ లేదు. దీని కారణంగా గ్రామ పంచాయతీల్లో నిధులు ఉన్నా డ్రా చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే గ్రామపంచాయతీల్లో ముందస్తుగా పెట్టుబడులు పెట్టి చేసిన పలురకాల పనుల బిల్లుల మంజూరుకు అవకాశం వచ్చినా ప్రస్తుత పరిస్థితుల కారణంగా డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో సర్పంచ్‌లలో ఆందోళన నెలకొంది. నిధులను డ్రా చేసుకునేందుకు ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాతే అవకాశం ఉండటంతో అప్పటి వరకు పంచాయతీల్లో ఏదైనా అత్యవసర పనులు చేపట్టాలన్నా డబ్బులు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్థికసంఘం నిధులను డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పించాలని పాలకవర్గాలు కోరుతున్నాయి.





అనుమతులు లేకుండా

బ్యారన్ల నిర్మాణం!

సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి పలువురు ఫిర్యాదు • పనులు ఆపేందుకు ససేమిరా అన్న రైతు
గోడకు అంటించిన నోటీసు సైతం అధికార పార్టీ అండతో చించివేత
పోలీసులకు ఫిర్యాదు చేసిన పంచాయతీ కార్యదర్శి • సర్పంచ్ ఫిర్యాదు కావాలన్న ఎస్సై
ఆమె వృద్ధురాలు కావడంతో స్టేషన్‌కు వెళ్లిన కుమారుడు • అతడిని దుర్భాషలాడిన పోలీసు అధికారి




బ్యారన్ గోడకు నోటీస్ అంటిస్తున్న పంచాయతీ కార్యదర్శి, నిర్మాణంలో ఉన్న మూడు పొగాకు బ్యారన్లు

టంగుటూరు, మార్చి 23 : పొగాకు బోర్డు అనుమతులు లేవు. పంచాయతీ తీర్మానం అన్న మాటే లేదు. అయినా గ్రామం నడిబొడ్డున చుట్టుపక్కల వారు అభ్యంతరం చెప్పినా మూడు బ్యారన్ల నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అధికార పార్టీ అండదండలతో మండలంలోని కాకుటూరివారిపాలెం గ్రామ నడిబొడ్డున ఒక రైతు బరితెగించి పనులు కొనసాగిస్తున్నారు. నిర్మాణాలకు అడ్డుగా ఉందని పదేళ్ల నాడు పంచాయతీ వారు వేసిన గానుగ చెట్టును కొట్టివేశారు. పంచాయతీ కాలువను పూడ్చారు. ఈచర్యలకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ చుట్టుపక్కల గ్రామాల జనం సర్పంచ్ కొమ్మినేని రమణమ్మకు, అప్పటి పంచాయతీ కార్యదర్శి బాషాకు ఫిర్యాదు చేశారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి సర్పంచ్‌తో చర్చించి పనులు నిలిపివేయించారు. ఈనేపథ్యంలో మంత్రి సురేష్ అండదండలతో స్థానిక వైసీపీ నాయకులు ఎంపీడీవోపై ఒత్తిడి తెచ్చి బాషాను ఈనెల 14న ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించారు. అదేరోజు నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. బాషాను తప్పించిన రోజే ఆలకూరపాడు పంచాయతీ కార్యదర్శి సాంబయ్యను కాకుటూరివారిపాలెం ఇన్‌చార్జిగా నియమించారు. ఈనెల 15న గ్రామాన్ని సందర్శించిన సాంబయ్య స్థానికుల ఒత్తిడితో ఈ విషయాన్ని బ్యారన్ రైతుకు తెలియజేసి పనులు నిలిపివేయాలని కోరారు. అందుకు ఆ రైతు ససేమిరా అన్నారు. దీంతో ఈనెల 21న నిర్మాణాల ప్రవేశంలోని గోడకు నోటీసు అంటించారు. దాన్ని చించివేసిన రైతు యథావిధిగా పనులు కొనసాగిస్తున్నారు. దీంతో సాంబయ్య బ్యారన్ల నిర్మాణ రైతుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సర్పంచ్ ఫిర్యాదు కావాలని కోరడంతో ఏడు పదుల వయసులో ఉన్న సర్పంచ్ రమణమ్మకు నిత్యం సహాయకారిగా ఉండే ఆమె తనయుడు వెంకట్రావు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు.

సర్పంచ్ తనయుడిపై కస్సుబుస్సు

సర్పంచ్ తరఫున ఫిర్యాదును ఆమె తనయుడు వెంకట్రావు ఎస్సై ఎ.నాగేశ్వరరావుకు ఇవ్వబోగా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఫిర్యాదు ఇవ్వడానికి నీవెవడివి. నీకేం సంబంధం. సర్పంచ్‌ను రమ్మను' అంటూ దుర్భాషలాడాడు. వెంకట్రావు చెప్పే విషయాన్ని వినడానికి ఇష్టపడని ఎస్సై.. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ ఆదేశించించాడు. దీంతో తీవ్ర అవమాన భారంతో వెంకట్రావు ఇంటి దారి పట్టారు. ఆమరుసటి రోజైన ఈనెల 22న ఎస్సై పంచాయతీ కార్యదర్శిని స్టేషన్‌కు పిలిపించి ఆయన ఇచ్చిన ఫిర్యాదును తిరిగి ఇచ్చి పంపారు. అదేసమయంలో బ్యారన్ల నిర్మాణాలు మాత్రం జోరుగా కొనసాగుతున్నాయి.

బ్యారన్ల నిర్మాణాలకు అనుమతులు లేవు..

కాకుటూరివారిపాలెంలో కొత్తగా నిర్మిస్తున్న మూడు బారన్లకు బోర్డు నుంచి ఎలాంటి అనుమతులు లేవని టంగుటూరు పొగాకు వేలం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. అయితే సంబంధిత రైతు వచ్చి తనను కలిశారని, వెల్లంపల్లి వద్ద లైసెన్స్‌లు కొనుగోలు చేసినట్లు చెప్పారన్నారు. అందుకు సంబంధించి మాకు ఎలాంటి పత్రాలు కూడా ఇవ్వలేదన్నారు. దీంతో ఆ రైతుకు తాము నోటీసు కూడా ఇచ్చామని తెలిపారు.

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు

• కలెక్టర్ దినేష్‌కుమార్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాడ్స్ భద్రపర్చిన సీల్స్‌ను తనిఖీ చేశారు. కంట్రోలు యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. అక్కడ అమర్చిన సీసీకెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాడ్స్ గోడౌన్‌ను పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు నివేదికను పంపనున్నట్లు తెలిపారు. ఒకేసారి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నందున అవసరమైన వీవీప్యాడ్లు, కంట్రోలు యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డీఎస్.క్రాంతికుమార్, కాలేషాబేగ్, రసూల్, ఎస్‌డీ.హనీఫ్, డి.యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీహరి

సంతనూతలపాడు, మార్చి 23: ఓటుహక్కుకు అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ఇందుకోసం యువత ముందుండాలని తహసీల్దార్ ఎం.శ్రీహరి తెలిపారు. శనివారం మైనంపాడులో డైట్‌కళాశాలలో స్వీప్ ప్రోగ్రాంలో భాగంగా ఓటు వినియోగంపై ఓటర్లకు ఎలా అవగాహన కల్పించాలనే దానిపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. నూరు శాతం పోలింగ్ జరిగేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఈవో సుబ్బారావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలపరిధిలోని సంతనూతలపాడు, ఎమ్.వేములపాడు గ్రామాల్లో ఎస్సై దేవకుమార్ ఓటర్లకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాలని, ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.231

సంతనూతలపాడు, మార్చి 23: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శనివారం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.231 పలికింది. చీమకుర్తి నుంచి వేలానికి 965 పొగాకు బేళ్లు రాగా 786 బేళ్లు అమ్ముడయ్యాయి. 147 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.231లు పలకగా, కనిష్ఠ ధర రూ.220, అలాగే సరాసరి ధర రూ.229.08 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాద వ్యతిరేకతే నిజమైన దేశభక్తి



కాగడాలతో ర్యాలీ చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 23: సామ్రాజ్యవాద వ్యతిరేకతే నిజమైన దేశభక్తి అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పేర్కొన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభను శనివారం ఒంగోలులో చర్చిసెంటర్‌నందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని సంపదను దోచుకునేందుకు బడా పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాద దేశాలు కలిసి దండయాత్ర చేస్తున్నాయని, వీటికి వ్యతిరేకంగా పోరాడటమే నిజమైన దేశభక్తి అన్నారు. స్వాతంత్ర్యపోరాటంలో తమ విలువైన ప్రాణాలను తృణపాయంగా అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాగడాలతో నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అరుణోదయ జాలన్న, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నగర అధ్యక్షులు కోటయ్య, మహిళసంఘం నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) కార్యాలయంలో..

ఒంగోలులోని ఈమనిపాలెంలో గల సీపీఐ(ఎంఎల్) కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఏఐఎఫ్‌టీయూ నాయకులు విజయసారథి అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి ఎంఎస్.సాయి, రైతుకూలీ సంఘం కార్యదర్శి ఎస్.లలితకుమారి తదితరులు దేశం కోసం ప్రాణాలను అర్పించిన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లకు నివాళులర్పించారు.

ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో..

జాతీయ ఉద్యమ వీరులు షాహిత్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవుల వర్ధంతి సందర్భంగా శనివారం ఒంగోలులో ప్రజా సంఘాల ఐక్యవేదికఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కలెక్టరేట్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి చర్చి సెంటర్ వరకు కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎంల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు, కిసాన్‌సంయుక్త మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్, ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షులు డి.సుందరం, ఎమ్.జార్జి, కె.నరశింహ, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, మధు, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: భగత్‌సింగ్ వర్ధంతిని వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేజీ మస్తాన్, ఆర్.లక్ష్మి, వై.చంద్రశేఖర్, మల్లెల చిన్నపేతురు, వై.బుజ్జి, బడుగు నాగభూషణం పాల్గొన్నారు.



ఎమ్మెల్యే స్వామి, పూర్ణచంద్రరావుల సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు



గొడుగులపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న బీసీసెల్ శ్రేణులు

రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశంలోనే సాధ్యం

• ఎమ్మెల్యే స్వామి

పొన్నలూరు (కొండపి), మార్చి 23 : రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే స్వామి పేర్కొన్నారు. మండలంలోని బోగనంపాడు గ్రామ సీనియర్ నాయకుడు పొన్నగంటి రమణయ్య, గ్రామ మాజీ సర్పంచ్ భర్త ముళ్లమూరి వెంకటరావు వైసీపీని వీడి శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఒంగోలులోని టీడీపీ సీనియర్ నాయకుడు పూర్ణచంద్రరావు ఇంటివద్ద ఆయనతో పాటు, ఎమ్మెల్యే స్వామి సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఈసందర్భంగా స్వామి, పూర్ణచంద్రరావు మాట్లాడుతూ పార్టీలోకి వచ్చిన వారికి అండగా ఉంటామని హామీఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు తానికొండ మహేంద్ర, నాయకులు డబ్బుకొట్లు వెంకటేశ్వర్లు, పొన్నగంటి సుబ్బారావు, ముళ్లమూరి నితీష్‌చౌదరి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం



హైస్కూల్ సెంటర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న తెలుగుయువత కార్యదర్శి మస్తాన్

కొండపి: టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై కొండపిలోని ప్రధాన సెంటర్‌లలో తెలుగుయువత ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి దేవూరి మస్తాన్ ఆధ్వర్యంలో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పొదిలిరోడ్డు, జెండాచెట్టు సెంటర్, కామేపల్లి రోడ్డులోని దుకాణాలు, ఇళ్లకు వెళ్లి కరపత్రాలను అందజేసి పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

గొడుగులపాలెంలో..

కొండపి పంచాయతీ పరిధిలోని గొడుగులపాలెంలో బాబుష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీపై టీడీపీ బీసీసెల్ నాయకుడు మునగాల జాన్, బీసీసెల్ మండల నాయకుడు పి.రమేష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు సీఎం అయితే చేకూరే లబ్ధిని వివరించారు. కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి ఓటు వేసి మరోసారి గెలిపించాలని కోరారు.

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలి

• కలెక్టర్ దినేష్‌కుమార్




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23 : నామినేషన్ల ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులకు సమగ్ర అవగాహన అవసరమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. పార్లమెంట్‌తో పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు, ఏఆర్వోలకు శనివారం స్థానిక స్పందనహాలులో నిర్వహించిన వర్క్‌షాపులో కలెక్టర్ మాట్లాడారు. నామినేషన్ల ప్రక్రియలో అవసరమైన అధికారులతో ప్రత్యేకంగా డెమో నిర్వహించారు. నామినేషన్ల స్వీకరించే సమయంలో తప్పనిసరిగా ఎన్నికల మిషన్ నిర్దేశించిన చెక్‌లిస్టును అనుసరించాలని దిశానిర్దేశం చేశారు. అభ్యర్థుల ఫొటోలు గత మూడు నెలలోపు దిగినవిగా స్పష్టంగా కనిపిస్తూ ఉండాలన్నారు. బ్యాలెట్ పేపర్లపైన వారి పేరు ఏ విధంగా ఉండాలో, డిక్లరేషన్‌లో పొందుపర్చాలన్నారు. కేవలం ఎన్నికల ఖర్చుల నిమిత్తం తాజాగా తెరిచిన బ్యాంకు ఖాతా వివరాలను కూడా నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్లను ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల లోపు మాత్రమే స్వీకరించాల్సి ఉంటుందన్నారు. ప్రతిరోజు వచ్చిన నామినేషన్ల వివరాలను నోటీసు బోర్డులో స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. శుభముహర్తాలు, చివరిరోజు డెడ్ లైన్ లోపు నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు వచ్చినప్పుడు ఎలాంటి వివాదాలకు తావులేకుండా మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా భద్రపర్చుకోవడం కూడా కీలకమన్నారు. సువిధ పోర్టర్ ద్వారా కూడా నామినేషన్లు, అఫిడవిట్లు, ఎన్నికల ప్రచారానికి అనుమతులను అభ్యర్థులు కోరవచ్చని తెలిపారు. డమ్మి నామినేషన్‌పత్రాలను ఆర్వోలకు ఇచ్చి వాటిని నింపడం, తప్పులను గుర్తించడంపై వారి టీములకు ప్రత్యేక పరీక్షను కూడా నిర్వహించారు. అభ్యర్థులకు వరుస సంఖ్యలో బ్యాలెట్ బాక్సులో పేరును కేటాయించేందుకు అనుసరించాల్సిన విధానం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరాలను అనుసంధానం చేయడంపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రవర్తనా నియామావళిని అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ఇలాంటివి ఏమైనా జరిగితే క్షేత్రస్థాయిలో మహిళా పోలీసులు, వీఆర్వోలు తక్షణమే పై అధికారుల దృష్టికి తీసుకొని రావాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్వో శ్రీలతతో పాటు ఎన్నికలకు సంబంధిత నోడల్ అధికారులు ఉన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎన్నికల కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించారు.

మరో స్వాతంత్ర్య పోరాటానికి సన్నద్ధం కావాలి

• సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ రంగారావు



మాట్లాడుతున్న చుండూరి రంగారావు తదితరులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23: మరో స్వాతంత్ర్య పోరాటానికి భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల స్ఫూర్తితో సన్నద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన వర్ధంతి సభకు పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాజశేఖర్, ఏఐవైఎఫ్ నాయకులు లెనిన్, ఐద్వా నాయకురాలు కంకణాల రమాదేవిలు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముందుగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రంగారావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో దేశం నుంచి తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఢిల్లీలో సంవత్సరాల తరబడి రైతు ఉద్యమాన్ని నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ దేశంలోని సహజ సంపదను, కార్మిక శక్తిని, రైతన్నల శ్రమను కార్పొరేట్ శక్తులకు దోపిపెడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ నేటి యువతకు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చరిత్ర తెలిజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వల్లంరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చావలి సుధాకర్, బి.సుబ్బారావు, ఎస్‌డీ.సర్దార్, కొత్తకోట వెంకటేశ్వర్లు, పీవీఆర్.చౌదరి, దాసరి సుందరం, పి.నాగమనోహర్‌లోహియా, శ్రీరామ్ శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, వి.బాలకోటయ్య, ఎస్‌కే.బాబు, జయంతిబాబు, జార్జ్, జాలన్న, మహేష్, ఆర్.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించండి మహాప్రభో..

చీమకుర్తి, మార్చి 23: రెండునెలలుగా జీతాలు ఇవ్వకపోవటంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే తమ జీతాలు ఇప్పించాలంటూ చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాలు అడిగితే పన్నులు వసూలు చేసి చెల్లిస్తామంటున్నారనివాపపోయారు. పన్నులకు, తమ జీతాలకు ముడిపెట్టకుండా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని జీతాలు అందించాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పూసపాటి వెంకట్రావు, కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

అవీ..ఇవీ..

డీఎంహెచ్‌వోకు ఏడీగా ఉద్యోగోన్నతి



రాజ్యలక్ష్మి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మికి వైద్యశాఖ అడిషనల్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఆమె ఏప్రిల్ 30వతేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈనేపథ్యంలో రాజ్యలక్ష్మికి అడిషనల్ డైరెక్టర్(స్పెషల్) హోదా కల్పిస్తూ ఇక్కడే పనిచేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న డీఎంహెచ్‌వో పోస్టును అప్‌గ్రేడ్ చేసి ఇక్కడే కొనసాగే విధంగా వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఉత్తర్వులులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యశాఖ అడిషనల్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన రాజ్యలక్ష్మిని శనివారం పలువురు అభినందించారు.

ఘనంగా మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



బహుమతులను అందజేస్తున్న హరిబాబు

ఒంగోలు(విద్య), మార్చి 23: ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 40వ వార్షికోత్సవం శనివారం స్థానిక కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.కళ్యాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ బి.హరిబాబు మాట్లాడుతూ విద్యార్థినులు మానసిక వత్తిడికి గురికాకుండా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆభిలాషించారు. అనంతరం పలు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. జేకేసీ ద్వారా శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లకు అందజేశారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో న్యాక్ కో ఆర్డినేటర్ కుసుమకుమారి, అడిషనల్ కో ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరెడ్డి, విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

నాగులుప్పలపాడు మార్చి 23: అమ్మనబ్రోలులోని బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎ.శైలజప్రియదర్శిని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, మొత్తం 80 సీట్లు ఉన్నాయన్నారు. నాలుగో తరగతి పూర్తైన విద్యార్థులు ఈ నెల 31 లోగా దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 87126 25043 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలి : వీసీ



మొక్కను నాటుతున్న వీసీ అంజిరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23: ప్రస్తుత వాతావరణ మార్పులను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ ఉపకులపతి మారెడ్డి అంజిరెడ్డి కోరారు. ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం స్థానిక విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతమ్‌దేవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంజిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. రిజిస్ట్రార్ బి.హరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



వల్లూరులో కవాతు చేస్తున్న బలగాలు

టంగుటూరు, మార్చి 23: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కేంద్ర బలగాలు కవాతు చేశాయి. ఉదయం పోలీస్ స్టేషన్ పరిధిలోని యరజర్ల, కొణిజేడు, పొందూరు, ఎం.నిడమలూరు, మర్లపాడు, కందులూరులో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. సాయంత్రం వల్లూరు, సూరారెడ్డిపాలెం, మల్లవరప్పాడు, కారుమంచి, తూర్పునాయుడుపాలెం గ్రామాల్లో కవాతు చేశాయి. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ రంగనాథ్, ఎస్సై నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పొగాకు వేలంను పరిశీలించిన ఆర్‌ఎం



వేలం ప్రక్రియ పరిశీలిస్తున్న ఆర్‌ఎం లక్ష్మణరావు

టంగుటూరు, మార్చి 23: టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రాన్ని శనివారం బోర్డు ఆర్‌ఎం ఎం.లక్ష్మణరావు సందర్శించారు. వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. పొగాకు బేళ్లలో అన్యపదార్థాలు లేకుండా చూడాలన్నారు. శనివారం వేలం కేంద్రానికి 922 బేళ్లను అనుమతించారు. అందులో 880 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 42 బేళ్లను తిరస్కరించారు. అందులో ఆరు నోబిడ్, ఆరు బేళ్లు ఆర్‌ఆర్ అయ్యాయి. మొత్తం 20 కంపెనీల ప్రతినిధులు కొనుగోళ్లలో పాల్గొన్నారు. రైతులకు గరిష్ఠ ధర కిలోకు రూ.231, కనిష్ఠ ధర రూ.220 లభించింది. సరాసరి ధర కిలోకు రూ.228.41 దక్కింది.

అన్నదాన సంచార వాహనం ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

ఒంగోలు(కల్చరల్), మార్చి 23 : శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో స్థానిక సంతపేటలోని శివం నిత్యాన్నదాన క్షేత్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సంచార వాహనాన్ని పారిశ్రామికవేత్త మండువ మురళీకృష్ణ శనివారం ప్రారంభించారు. నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శివం శరణాలయంలో పేదలకు అన్నదానంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండవ సుబ్బారావు, షేక్ మహబూబ్, మండవ లావణ్య, కోసూరి శ్రీదేవి, వడ్డెంపూడి సుజాత, నూకతోటి శరత్‌బాబు, కొమ్మి రమణయ్య, అడుసుమల్లి వెంకట్రావు, రెడ్‌క్రాస్ నరసింహారావు, ఎన్.శ్రీనివాసరావు, సుబ్బు, మన్నం శేషయ్య, చిక్కాల కిరణ్‌కుమార్, శ్రీనివాస్, నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు 9మంది విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో హెచ్ఎం హనుమంతరావు

చీమకుర్తి, మార్చి 23: చీమకుర్తి మండలం మువ్వావారిపాలెం ప్రాథమిక పాఠశాల (హెచ్‌డబ్ల్యూ) విద్యార్థులు గురుకుల ప్రవేశపరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటారు. స్కూలుకు చెందిన 9మంది విద్యార్థులకు వివిధ గురుకుల పాఠశాలల్లో ఐదోతరగతి ప్రవేశానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక స్కూలులో జరిగిన కార్యక్రమంలో బక్కా చైతన్య, బక్కా నవ్య, బక్కా కళ్యాణి, బక్కా అఖిల్, బక్కా రుచిత, గజ్జా మురారి, ఇండ్ల చిన్నయ్య, బొక్కా నోవాహు, గజ్జా షైదీలిలను హెచ్ఎం మాదాల హనుమంతరావు అభినందించారు.

ఎస్ఎన్‌పాడు టికెట్‌ను మాదిగలకు కేటాయించాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23 : సంతనూతలపాడు అసెంబ్లీ టిక్కెట్‌ను మాదిగలకు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ లెబర్ బోర్డు సభ్యుడు, మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పెద్దిపోగు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఒంగోలులో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్ళ నుంచి ప్రజాసేవలో ఉన్నానని, ఇప్పుడున్న పరిస్థితుల్లో సంతనూతలపాడు నియోజకవర్గాన్ని మాదిగలకు కేటాయించే విధంగా వైసీపీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని కోరారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలో మాదిగలు అధికంగా ఉన్నందున తనకు అవకాశం కల్పించాలని కోరారు.



వృద్ధుడిపై ఎస్ఐ దాడిచేసిన సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

వృద్ధుడిపై ఎస్ఐ దాడి ఘటనపై డీఎస్పీ విచారణ

బల్లికురవ, మార్చి 23: బల్లికురవలో వృద్ధుడు హనుమంతరావుపై ఎస్ఐ నాగ శివారెడ్డి దాడి చేసిన సంఘటనపై బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ శనివారం రాత్రి విచా రణ చేపట్టారు. నాలుగు రోజుల క్రితం బల్లికురవలో బడ్డీ బంకులో ఉన్న వృద్ధుడు శానంపూడి హనుమంతరావుపై ఎస్ఐ దాడిచేసి మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు కేసు నమోదు చేశారు. ఈ దాడిలో అస్వస్థతకు గురైన వృద్ధుడు ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో చేరి అక్కడనుంచి ఎస్ఐ నాగశివారెడ్డిపై పోలీసు లకు ఫిర్యాదు చేశారు. తనను అకారణంగా కొట్టి తన వద్ద మద్యం సీసాలు లేక పోయినా, ఉన్నట్లు కేసు పెట్టారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఎన్నికల అధికారిని కలిసి గొట్టిపాటి ఫిర్యాదు

ఇదే విషయమై ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచా రణకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. దీంతో బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, సంతమాగులూరు సీఐ నరసింహారావులు శనివారం రా త్రి సంఘటన జరిగిన ప్రదేశం తోపాటు వృద్ధుడు నివాసం ఉంటున్న ఇంటి వద్ద విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధుడి మనుమరాలు దుర్గ విచారణకు వచ్చిన డీఎస్పీతో తాము టీడీపీ సానుభూతిపరులమని, తమపై కక్ష కట్టి తమ దుకాణంలో ఎస్ఐ తరచూ తనఖీలు చేస్తున్నారని చెప్పారు. ప్రయివేట్ వ్యక్తులను తీసుకువచ్చి తనిఖీ చేస్తున్నా రని తెలిపారు. తమ దుకాణంలో మద్యం దొరకలేదని చెప్పారు. తమ వద్ద ఉన్న సీసీ పుటేజ్‌ను కూడా పరిశీలించాలని కోరారు. వృద్ధుడు హనుమంతరావు మాట్లాడుతూ ఎస్ఐ అ కారణంగా కొట్టి జీపులో స్టేషన్‌కు తీసుకువెళ్లారని తెలిపారు. తాను ఎలాంటి మద్యం అమ్మకాలు చేపట్టలేదని, తనపై అక్రమంగా కేసు బనాయించారని డీఎస్పీతో తెలిపారు

ఆధ్యాత్మిక సిరి.. పృథులగిరి

శివకేశవుల ఆవాసమైన మహిమాన్వితక్షేత్రం

రుషులు నడయాడిని పుణ్యభూమి

అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలు

నేడు గరుడసేవ..

భారీగా తరలిరానున్న భక్తులు

రేపు స్వామివారి కల్యాణం

మర్రిపూడి, మార్చి 23 : రుషులు నడయాడిన పుణ్యభూమి పృథులగిరి. శివకేశవుల ఆవాసంగా విరాజిల్లుతున్న మహిమాన్విత క్షేత్రం. ఎత్తైన కొండలు, లోతైన లోయలు.. మధ్యలో వంకలు తిరిగిన సోపానాలు.. పక్షుల కిలకిల రావాలు.. సెలయేటి సవ్వడులతో ప్రకృతి అందానికి నిలయమైన పృథులగిరి ఆధ్యాత్మిక కేంద్రంగానూ భాసిల్లుతోంది. పృథులగిరిపై కొలువైన లక్ష్మీనరసింహుడు భక్తుల పాలిట కొంగుబంగారమై పూజలందుకుంటున్నాడు. ఈ క్షేత్రం ప్రస్తుతం బ్రహ్మోత్సవ శోభను సంతరించుకుంది. ఈనెల 19 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు అంగరంగ వైభంగా జరుగుతున్నాయి. ఆదివారం నిర్వహించే గరుడసేవ ఉత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. సోమవారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. 29వతేదీ వరకూ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి.



లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

ఆలయ చరిత్ర ఇదీ..

15వ శతాబ్దంలో పొదిలి ప్రాంతాన్ని సాలువ తెలుంగ రాయలు పరిపాలించారు. ఆయన లక్ష్మీనరసింహుడిపై అపారమైన భక్తిభావం కలిగి ఉండేవారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహ స్వామికి నైవేద్యం పెట్టనిదే ఆయన భుజించేవారు కాదు. నైవేద్యం పూర్తయిందన్న విషయాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేకంగా వేగులను నియమించుకున్నారు. స్వామికి నైవేద్యం సమర్పించారనే సమాచారాన్ని వారిద్వారా తెలుసుకున్న తరువాతే భోజనం చేసేవారు. స్వామివారు ఒకసారి తెలుంగ రాయలు భక్తిని పరీక్షించదలచి భీకరమైన పెనుగాలులతో ఎడతెరిపిలేని వర్షాన్ని సృష్టించారు. దీంతో స్వామివారికి నైవేద్యం పెట్టారన్న సమాచారం వేగులద్వారా వారం రోజులు అందలేదు. దీంతో తెలుంగరాయలు అన్న పానీయాలు ముట్టకుండా నీరసించి పోయారు. వెలుంగరాయల భక్తి విశ్వాసాలకు స్వామి మెచ్చి కలలో దర్శనమిచ్చారు. సమీపంలో ఉన్న కొండపైన తాను వెలుస్తున్నానని, అక్కడ ఆరె వృక్షం కింద వనమాలను ఉంచానని చెప్పారు. ఆప్రదేశంలో ఆలయాన్ని నిర్మించి తరించాలని కలలో కోరారు. మరుసటి రోజు మందిమార్బలంతో పృథులగిరిపైకి చేరుకున్న తెలుంగరాయలకు తిప్పమీద ఉన్న ఆరె వృక్షం కింద వనమాల కనిపించింది. దీంతో అక్కడ ఆలయ నిర్మాణాన్ని చేపట్టి స్వామి సేవలో తరించారు. అనంతరకాలంలో పెను భూకంపం కారణంగా ఆలయం ధ్వంసమైంది. అప్పట్లో కాటూరివారిపాలెంకు చెందిన కన మర్లపూడి వెంగన్నచౌదరి ఆలయాన్ని పునర్నించినట్లు తాళపత్ర గ్రంథాల ద్వారా తెలుస్తోంది. వెంకటగిరి రాజావారు ధూపదీప నైవేద్యాలకోసం 139 ఎకరాల భూమిని స్వామివారికి విరాళంగా అందజేశారు. నేటికీ ప్రతివారం చేసే తొలిపూజ వెంకటగిరి రాజావారి గోత్రనామాలతో జరుగుతుండటం విశేషం. మర్రిపూడి నుంచి కొండపైకి వెళ్లేందుకు శివరాజు ముద్దప్పా అనే భక్తుడు సోపానమార్గాన్ని ఏర్పాటు చేశారు.

ప్రకృతి పొదరిల్లు

పృథులగిరి ప్రకృతి అందాలకు పొదరిల్లు. చుట్టూ ఎత్తైన కొండలు, లోయలతో పచ్చని చెట్లు.. పక్షుల కిలకిల రావాలు.. జలజలపారే శలయేటి సవ్వడులతో కొండపై భాగం వికశించిన పుష్పంలా భక్తులకు, పర్యాటకులకు కనువిందు చేస్తోంది. కొండపైన లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి ఎదురుగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం ఉంది. శివకేశవులు ఒకే కొండపై వెలసిన పుణ్యధామంగా పృథులగిరి క్షేత్రం వెలుగొందుతోంది. దేవాలయం ఉత్తరం వైపున ఉన్న గుహలలో నేటికీ రాత్రివేళల్లో రుషులు పూజలు చేస్తారన్న ప్రచారం ఉంది.



క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి



లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

భక్తుల దాహార్తిని తీరుస్తున్న కోనేరులు

కొండపైన ఉన్న రెండు ప్రధాన కోనేరులు స్వామి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తుల దాహార్తితోపాటు వివిధ అన్నసత్రాల నిర్వహణకు అవసరమైన నీటి అవసరాలను తీరుస్తున్నాయి. జిల్లాలో కరువు విలయతాండవం చేసినప్పటికీ ఇక్కడి కోనేరుల్లో సమృద్ధిగా నీరు ఉండటం ప్రత్యేకత. ఇది స్వామి మహిమగా భక్తులు భావిస్తారు. కొండపైన దక్షిణం వైపు రెండు కిలోమీటర్ల దూరంలో కొండరాళ్ల మధ్య నీటి జాడలు కనిపిస్తాయి. మండు వేసవిలో సైతం భక్తుల దొనగా పేరొందిన ఈప్రాంతంలో చల్లటి తాగునీరు లభిస్తుంది.

గరుడసేవకు ఏర్పాట్లు పూర్తి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగే గరుడ సేవకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ పాలకవర్గం చైర్మన్ కుప్పం కొల్లారావు, కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో అన్నదానాలు చేపట్టనున్నారు. పొదిలి ఆర్టీసీ డిపో నుంచి కొండ వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పొదిలి, కొండపి సీఐలు మల్లికార్జునరావు, పాండురంగారావు, ఎస్ఐలు కోటయ్య, శివబసవరాజు ఆధ్వర్యంలో భారీ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

శింగరకొండలో వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభం

అద్దంకి, మార్చి 23: శింగరకొండ లక్ష్మీనరసింహ స్వామి, ప్రసన్నాంజంనేయస్వామి వార్ల 69వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీప స్థాపన, మండపారాధన జరిగింది. ధ్వజస్తంభ నిర్మాణదాత, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మేదరమెట్ల శంకరారెడ్డి, ఈవో సుభద్ర జీవధ్వజ పూజ, ఉష్ట్ర పతాక పూజ, ధ్వజారోహణ నిర్వహించారు. మేదరమెట్ల రాజశేఖరరెడ్డి, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు. భజన, మహిరావణ చరిత్ర తోలుబొమ్మలాట, కోలాట ప్రదర్శనం విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గజవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. ఏర్పాట్లను ఫెస్టివల్ ఆఫీసర్ తిమ్మనాయుడు, ఈవో సుభద్ర పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, బిందె తీర్థం, విశేష అభిషేకం జరగనున్నాయి. రుత్వికులచే మహన్యాస పూర్వక ఏకాదశ మన్యుసూక్త వారాభిషేక, సుందరకాండ పారాయణ, సూర్య నమస్కారాలు, సప్తశతి పారాయణ, పంచామృతాలు, దశ విధ ద్రవ్యాలచే విశేష అభిషేకం, విశేష అలంకరణ నిర్వహించనున్నారు. లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద పాలకమండలి చైర్మన్ నర్రావుల ఏడుకొండలు, ఈవో కోటిరెడ్డి ధ్వజస్తంభ పూజ, పతాక పూజలు నిర్వహించారు. ప్రధాన తిరుణాళ్ల సోమవారం జరగనుంది.



ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ధ్వజస్తంభం వద్ద ఉష్ట్ర పతాక పూజ, ధ్వజారోహణ చేస్తున్న మేదరమెట్ల శంకరారెడ్డి, ఈవో సుభద్ర

ట్రాఫిక్ మళ్లింపుపై ప్రత్యేక దృష్టి

అద్దంకి, మార్చి 23: శింగరకొండ 69వ వార్షిక తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ తెలిపారు. శింగరకొండ తిరుణాళ్ళ ట్రాఫిక్ మళ్లింపుపై శనివారం ఆయన పరిశీలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ ప్రభల నిర్వహకులతో చర్చించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇతరులను కించ పరిచేవిధంగా, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయరాదన్నారు. రాజకీయపార్టీల జెండాలు, గుర్తులు ప్రదర్శించరాదన్నారు. అసభ్యకరమైన నృత్య ప్రదర్శనలు నిర్వహించరాదని చెప్పారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతి భద్రతలకు భంగం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శింగరకొండ దేవాలయాల పరిసరాలు, ప్రవేశ మార్గాలు, ప్రభలు ఉంచే ప్రదేశాలను అడిషనల్ ఎస్పీ పరిశీలించారు. తిరునాళ్లకు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపునకు సంబంధించి పోలీస్ అధికారులతో చర్చించారు. తిరునాళ్లకు సుమారు 750 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. సోమవారం ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను మేదరమెట్ల నుంచి చిలకలూరిపేట మీదుగా నర్సరావుపేట వైపు, హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను సంతమాగులూరు అడ్డరోడ్డు నుంచి నర్సరావుపేట, చిలకలూరిపేట, మేదరమెట్ల మీదుగా మళ్లిస్తున్నట్లు చెప్పారు.

కడప వైపు నుంచి విజయవాడ వైపు వెళ్ళే వాహనాలు పొదిలి, ఒంగోలు మీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్



లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న నర్రావుల కొండలు, ఈవో కోటిరెడ్డి

కులంపేరుతో దూషించి దాడి చేసిన వ్యక్తిపై కేసు

తాళ్లూరు, మార్చి 23 : తనను ఉద్యోగం నుంచి ఎందుకు తీసి వేయించావని ప్రశ్నించినందుకు ఆగ్రహంతో నన్నే ప్రశ్నిస్తావా అంటూ కులంపేరుతో దూషించి దాడి చేసిన ఘటనపై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసుల కథనం మేరకు.. శివరాంపురం గ్రామానికి చెందిన కోండ్రు రాంబాబు తాళ్లూరు ప్రభుత్వ మద్యం షాపులో సేల్స్‌మన్‌గా పని చేస్తున్నారు.ఇదే దుకాణంలో చింతపాలెంకు చెందిన పోటు కోటేశ్వరరావు సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. మద్యం బాటిల్‌ను ధర కంటే అధికంగా డబ్బులు వసూలు చేసి తనకు ఇవ్వాలని సేల్స్‌మన్ రాంబాబుకు సూపర్‌వైజర్ కోటేశ్వరరావు చెప్పగా అంగీకరించక పోవడంతో అధికారులకు ఉన్నవీలేనివి చాడీలు చెప్పి 18వ తేదీ నుంచి ఉద్యోగం తీయించారు. ఈనెల 22వ తేదీన రాంబాబు తమగ్రామం నుంచి చీమకుర్తి వెళుతుండగా మార్గమధ్యంలో కోటేశ్వరరావు కన్పించారు. ఎదురుపడ్డ కోటేశ్వరరావును తనను ఎందుకు ఉద్యోగం నుంచి తీసి వేయించావని ప్రశ్నించడంతో తననే ప్రశ్నిస్తావా అంటూ ఆగ్రహంతో రాంబాబును కులంపేరుతో దూషించి రాళ్లతో కొట్టి గాయపరిచారు. తీవ్రగాయాలయిన రాంబాబును చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. బాధితుడు రాంబాబు ఇచ్చిన సమాచారాన్ని రిమ్స్ వైద్యులు తాళ్లూరు పోలీస్ స్టేషన్‌కు పంపగా ఎస్సై వైవీ రమణయ్య కులదూషణ కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

ఇంటి ఋణాలు

రేకుల ఇల్లు / పెంకుల ఇల్లు / స్లాబ్ ఇల్లు / వ్యవసాయ ఋణాలు / ఖాళీ స్థలాలకు / OTS పట్టాలు / కడుతున్న ఇల్లు / కట్టిన ఇల్లు / మొ॥ వాటికి తక్కువ వడ్డీకి ఇప్పించబడును. 18సం॥ సర్వీస్ ఇస్తున్నాం. సంప్ర॥ 9502466253

AJO-183708

స్థలం అమ్మబడును

చీరాల, రంగారెడ్డినగర్, రంగారెడ్డి గారి ఇంటి వెనుక 135.29చ.మీ, 40.9 X 36 కొలతలు కలిగిన స్థలం (దక్షిణం, పడమర రోడ్డు) అమ్మకం కలదు. సంప్రదించండి. నో బ్రోకర్స్, డైరెక్ట్ - Contact : 9491785306

AJO-183578

హౌసింగ్ లోన్స్

మార్టిగేజ్ లోన్, బిజినెస్ టేకోవర్, రేకుల షెడ్డు, పర్సనల్, సింగిల్ డాక్యుమెంట్స్‌పై లోన్స్ R.R. అసోసియేట్స్ లోన్స్ & కన్సల్టెన్సీ, ఒంగోలు, సెల్: 9491295153, 9440873153

AJO-183854

WANTED

ఒంగోలు లోని ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (PRO's) కావలెను. Age: 21-35 Yrs. అనుభవంను బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: సెల్: 87121 64111.

AJO-198

BUILDING FOR RENT / SALE

ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ ఎదురు, రామ్‌నగర్, 6వ లైను, N.R.K.M లాడ్జి ప్రక్కన, 5అంతస్తుల బిల్డింగ్ (40X80 RCC) కొలతలతో అద్దె / అమ్మకానికి కలదు. సెల్: 9866659049, 7013261494

AJO-151047

EDUCATION

Join by 25th BA Rs 5500, B.Com 6k B.Sc 10k, PG Arts 8K, yearly in Distance at PLNM Degree College, 9177408565, 9642656449, MBA 16k, MCA 20k Sem.

AJG-184906

అమ్మబడును

నెల్లూరు జిల్లా, కందుకూరు టౌన్‌లో రూ.30,000/-లు అద్దె వచ్చు ఇల్లు అమ్మబడును మరియు ఇంటి స్థలం గది రూ.25,000/-కు కలదు. నూతన బైపాస్ ప్రక్కన ప్లాట్లు, పొలము అమ్మబడును, కొనబడును. సంప్ర॥ 97042 50705

AJO-183696

రియల్ ఎస్టేట్

గుంటూరు సిటీకి అతి సమీపంలో లాం గ్రామం నందు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దగ్గర సువర్ణ కుటీర్ డెవలపర్స్ వారి 18వ CRDA అప్రూవుడ్ వెంచర్ చ.గ. 10,000 మాత్రమే. బ్యాంకు లోను, 20%+తో బై బ్యాక్ సౌకర్యం కలదు. సంప్ర॥ 88868 55355, 88863 55955

AJG-184754

రియల్ ఎస్టేట్

గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, రెడ్డిపాలెం, వెనిగండ్ల, అగతవరప్పాడు, పెదకాకాని, కొప్పురావూరు, నంబూరు, కంతేరు, కాజా మరెక్కడైనా ప్లాట్లు అ/కొ. సంప్ర॥ జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత. ఫోన్ : 73823 96677

AJG-700

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఎమ్మెల్యే స్వామికి మాతృవియోగం

ఫోన్‌లో చంద్రబాబు, పలువురు నేతల పరామర్శ

నేడు తూర్పునాయుడుపాలెంలో అంత్యక్రియలు



దోలా సుబ్బమ్మ (83)

కొండపి, మార్చి 23 : కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాతృమూర్తి డోలా సుబ్బమ్మ (83) శనివారం సాయంత్రం మరణించారు. నెలరోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వెంటిలేటర్‌పై వైద్యసాయం పొందుతున్న సుబ్బమ్మ వద్ద కుటుంబ సభ్యులు ఉంటున్నారు. ఎమ్మెల్యే స్వామి తరచూ వెళ్లి వస్తున్నారు. శనివారం సాయంత్రం సుబ్బమ్మ ఆరోగ్య పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు ఆదివారం స్వామి స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. సుబ్బమ్మకు ఐదుగురు సంతానం కాగా వారిలో ఇద్దరు ఆడ పిల్లలు, ముగ్గురు మగపిల్లలు. పెద్దకుమార్తె పద్మావతి అద్దంకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్నారు. రెండో కుమార్తె అనంతలక్ష్మి లెక్చరర్. మూడో సంతానం మురళీకృష్ణ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. నాల్గో సంతానమైన శ్రీధర్‌సత్యన్నారాయణస్వామి ఐవోబీ బ్యాంకు మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆఖరి కుమారుడైన డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కొండపి ఎమ్మెల్యేగా ఉన్నారు.

చంద్రబాబు పరామర్శ

ఎమ్మెల్యే స్వామి తల్లి మరణవార్తను తెలుసుకుని ఆయనకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఫోన్ చేసి పరామర్శించారు. అదేవిధంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పలువురు రాష్ట్రస్థాయి నాయకులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, పార్టీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు, పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యన్నారాయణ, మాజీ ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, పలువురు బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు స్వామిని పరామర్శించి సంతాపం తెలిపారు.



హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న ప్రసన్నకుమార్

ఓపెన్ పరీక్షలను సక్రమంగా నిర్వహించాలి

కనిగిరి, మార్చి 23 : ఓపెన్ పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని ఏపీ ప్రభుత్వ ప బ్లిక్ పరీక్షల పరిశీలకులు, ప బ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ అన్నా రు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన ఓపెన్ కాపీయింగ్ అనే కథనానికి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఓపెన్ పరీక్షా కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి విద్యార్థి హాల్ టికెట్‌లను పరిశీలించి లోపలకి పంపారు. దాదాపు గంటపాటు కనిగిరిలోని మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో జరిగే పరీక్షల నిర్వహణను ఆయన పరిశీలించారు. పరీక్షా హాలులో విద్యార్థులను తనిఖీ చేశారు. కాపీయింగ్‌కు పాల్పడకుండా బాధ్య తగా పరీక్షలను నిర్వహించాలని కేంద్రాల చీఫ్‌లను ఆయన ఆదేశించారు. ఏ మాత్రం కాపీయింగ్ జరిగినట్లు తెలిస్తే ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.



విజయవాడ ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం జరిగిన టీడీపీ ఎన్నికల వ్యూహం వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా అభ్యర్థులు గొట్టిపాటి రవికుమార్, దామచర్ల జనార్దన్, ఎంఎం కొండయ్య, బీఎన్ విజయకుమార్ తదితరులు

వేధిస్తున్న కూలీల కొరత

- ఊపందుకున్న మిర్చి కోతలు
- పెరిగిన పెట్టుబడులు
- ఆశాజనకంగా లేని ధరలతో రైతుల ఆందోళన

చీరాల, మార్చి 23: పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో మిరప కోతలు ఊపందుకున్నాయి. దీంతో కూలీల కొరత వెంటాడుతోందని రైతులు అంటున్నారు. ఎండల తీవ్రతతో మిరప కోతలు సక్రమంగా సాగటం లేదు. ఇక కళ్లాల్లో ఉన్న ఆరబెట్టిన మిరపను గ్రేడు చేసేందుకు మనుషులు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉంటే మిరప ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రోజువారీ కూలీలకు కూలి చెల్లించాలంటే చేతిలో తగినంత ఆర్థిక వెసులుబాటు లేక ముందస్తుగా వచ్చిన పంటను అయినకాడికి తెగనమ్ముకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి, మార్టూరు మండలాల పరిధిలోని మిరప సాగుదారులు మిరప ధర తగ్గటం పట్ల ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు నియంత్రిస్తున్నారని వాపోతున్నారు. కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉంచుదామంటే గిట్టుబాటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. దీంతో ప్రధానంగా కౌలుదారులు ఏ రోజుకారోజు కూలీలకు కూలి చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నారు. కొందరు వారాంతపు బట్వాడాకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. అయితే, ఏరోజుకారోజు డబ్బు ఇచ్చేవారికన్నా వారంతపు చెల్లింపు వారికి కొంత అధిక మొత్తం చెల్లించాల్సి వస్తుందంటున్నారు.



కళ్లంలో ఎండిన మిరపను గ్రేడు చేస్తున్న కూలీలు

ఇదిలాఉంటే స్థానికంగా కూలీలు సరిపడా దొరకని వారు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను పిలుచుకుంటున్నారు. దీంతో వారి రాకపోకలకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. ఈక్రమంలో కూలీలు కొంతమేర ఆగినా ప్రతిరోజు వాహనాల(ఆటో) బాడుగ చెల్లించాల్సిన పరిస్థితి. ఈ ఏడాది పెట్టుబడులు అంచనాలను మించి అవుతున్నాయని చెప్తున్నారు. ఈక్రమంలో గిట్టుబాటు ధర ఉంటే తప్ప నష్టాలు మూటగట్టుకేనే పరిస్థితేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీందర్

పర్చూరు, మార్చి 23: మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ర్యాలీలు, పార్టీ కార్యాలయాలు ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నేతలు, అధికారులతో ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన అంశాలు, జాగ్రత్తలు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలకనుగు ణంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన షె డ్యూలు తేదీ నుంచే కోడ్ అమల్లో ఉందని చెప్పారు. అనుమతులకు వివి ధ యాప్‌ల ద్వారా గానీ, ఆర్వో ఆఫీసు ద్వారా కాని 24 గంటల వ్యవధి లోనే అనుమతులు పొందవచ్చునని చెప్పారు. ప్రతి రాజకీయ పార్టీ ఎన్ని కల నియమావళిని విధిగా పాటించాలన్నారు. విధి నిర్వహణలో అధికారు లు సమన్వయంగా పనిచేయాలన్నారు. సమావేశంలో పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు, ఇంకొల్లు, చిన్నగంజాం తహసీల్దార్‌లుఆయా రాజకీయ పార్టీల నేతలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888

చీమకుర్తి : 96525 55752

చీరాల : 99859 21376

మార్కాపురం : 99859 21358

కందుకూరు : 97036 18697

కనిగిరి : 99854 11483

గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥

Asst-Cir-Manager. 9985411484

సొంతగూటికి చేరిన సుంకన్న

● టీడీపీ కండువా కప్పి ఆహ్వానించిన ముత్తుముల



సుంకన్నను టీడీపీలోనికి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 23 : గురువారం రాత్రి వైసీపీలో చేరిన కొంగళవీడు ఎంపీటీసీ సభ్యుడు పోలా సుంకన్న తిరిగి శుక్రవారం రాత్రి టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుంకన్న మాట్లాడుతూ సొంత పార్టీని పోగొట్టుకొని, కొందరి మాటలు నమ్మి వైసీపీలోకి వెళ్లానని తన తప్పు తెలుసుకొని తిరిగి టీడీపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన కొంగళవీడు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కూలీల ఆటోను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం



బోల్తాపడిన ఆటోవద్ద క్షతగాత్రులు

పొదిలి, మార్చి 23 : కూలీల ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే చీమకుర్తి మండలం బూదవాడ గ్రామానికి చెందిన కొంతమంది కూలీలు పొదిలి మండలం అన్నవరం గ్రామానికి కూలీపనులకు వచ్చారు. అయితే పనులు ముగించుకొని సాయంత్రం స్వగ్రామం బూదవాడ వెళుతున్నారు. ఈ క్రమంలో ఒంగోలు- పొదిలి ప్రధాన రహదారిలో అగ్రహారం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమదంలో ఆటో పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లి బోల్తాపడింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న జానకిరాములు, ఇంట్లూరి కోటమ్మ, నలగల్లు సుబ్బులు, గనిపినేని ఆదిలక్ష్మ అనే కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం ఒంగోలు తరలించినట్లు వైద్యులు తెలిపారు.

సీఏఏ అమలు యత్నాలను అడ్డుకోవాలి

గిద్దలూరు, మార్చి 23 : బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం సీఏఏ అమలు కోసం నిబంధనలు ప్రకటించడాన్ని సిపిఎం నాయకులు టి.ఆవులయ్య తప్పుబట్టారు. రాజ్యాంగ విరుద్ధమైన, దేశసమైక్యతకు ముప్పుగా ఉన్న సీఏఏను అమలుచేయాలని చూడడం దుర్మార్గమన్నారు. ముస్లిం మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని ప్రకటించిన సీఏఏ నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి తిలోదకాలు ఇస్తూ బీజేపీ ప్రభుత్వం తెచ్చిన ఈ నిరంకుశ చట్టాన్ని నిరసిస్తూ ఈ నెల 30న ఉదయం 10 గంటలకు ఒంగోలులో నిర్వహించనున్న ప్రదర్శనకు రాజ్యాంగ పరిరక్షణ కోసం పాటుపడే ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

● రూ.46,200 నగదు, 2 మోటార్ సైకిళ్లు స్వాధీనం

గిద్దలూరు టౌన్, మార్చి 23 : మండలంలోని త్రిపురాపురం గ్రామసమీపంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఇద్దరు జూదరును అపులోనికి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి రూ.46,200 నగదు, రెండు మోటారు సైకిళ్లను పోలీసులు సీజ్ చేశారు. సమాచారం రావడంతో గిద్దలూరు అర్బన్ సీఐ వీరసోమయ్య, రూరల్ సీఐ ప్రసాద్, ఎస్ఈబీ సీఐ కొండారెడ్డి సిబ్బందితో కలిసి మూకుమ్మడిగా దాడి చేశారు.

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు

● కలెక్టర్ దినేష్‌కుమార్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపా రు. స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాడ్స్ భద్రపర్చిన సీల్స్‌ను తనిఖీ చేశారు. కంట్రోలు యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. అక్కడ అమర్చిన సీ సీకెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాడ్స్ గోడౌన్‌ను పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు నివేదికను పంపనున్నట్లు తెలిపారు. ఒకేసారి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నందున అవసరమైన వీవీ ప్యాడ్లు, కంట్రోలు యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డీఎస్.క్రాంతికుమార్, కాలేషాబేగ్, రసూ ల్, ఎస్‌డీ.హనీఫ్, డి.యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు ఏడీగా ఉద్యోగోన్నతి



రాజ్యలక్ష్మి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మికి వైద్యశాఖ అడిషనల్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఆమె ఏప్రిల్ 30వతేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈనేపథ్యంలో రాజ్యలక్ష్మికి అడిషనల్ డైరెక్టర్(స్పెషల్) హోదా కల్పిస్తూ ఇక్కడే పనిచేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న డీఎంహెచ్‌వో పోస్టును అప్‌గ్రేడ్ చేసి ఇక్కడే కొనసాగే విధంగా వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యశాఖ అడిషనల్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన రాజ్యలక్ష్మిని శనివారం పలువురు అభినందించారు.

జీతాలు చెల్లించండి మహాప్రభో..



నిరసన తెలుపుతున్న కార్మికులు

చీమకుర్తి, మార్చి 23: రెండునెలలుగా జీతాలు ఇవ్వ కపోవటంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే తమ జీతాలు ఇప్పించాలంటూ చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ జీతాలు అడిగితే పన్నులు వసూలు చేసి చెల్లి స్తామంటున్నారనివాపపోయారు. పన్నులకు, తమ జీ తాలకు ముడిపెట్టకుండా ఉన్నతాధికారులు జోక్యం చేసు కొని జీతాలు అందించాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పూసపాటి వెంక ట్రావు, కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుకోసం ప్రజల ఎదురుచూపు

మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



టీడీపీలో చేరిన కార్యకర్తలు

మార్కాపురం రూరల్, మార్చి 23: రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని వేములకోట గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలోకి 100 కుటుంబాలు మాజీ సర్పంచ్ చాగంటి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చేరాయి. వార్డు మెంబర్లకు కర్రి నర్సిరెడ్డి, గోగు వెంకటేశ్వర్లు, జానపాటి సుబ్బయ్య, సున్నం కోటేసులతో పాటు 100 కుటుంబాల వైసీసీ నాయకులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ సర్పంచ్ చాగంటి సుబ్బారెడ్డి, వార్డు సభ్యులతో పాటు 100 కుటుంబాల వారికి పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. మార్కాపురం ప్రాంతం ప్రత్యేక జిల్లాగా ఏర్పడాలంటే టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యపడుతుందన్నారు. ఈ నమ్మకంతో చేరుతున్నట్లు తెలిపారు. జగన్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, వక్కలగడ్డ మల్లికార్జున, జవాజి రామానుజలరెడ్డి, తాళ్లపల్లి సత్యనారాయణ, వేములకోట టీడీపీ నాయకులు జంకె రమణారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం అజరామరం

కంభం, మార్చి 23 : అమరవీరుల త్యాగం అజరామరం అని, వారి దేశభక్తి అనిర్వచనీయమని ఎంఈవోలు బి.మాల్యాద్రి, కె.శార్వాణిలు పేర్కొన్నారు. శనివారం అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎంఈవో కార్యాలయంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరపాలన విముక్తి, దేశ స్వాతంత్య్రమే లక్ష్యంగా ప్రాణత్యాగం చేసిన భరతమాత ముద్దుబిడ్డలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లన్నారు. వారి త్యాగం భారతీయుల హృదయాల్లో నిలిచి ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త చిన్ని, పద్మావతి, ఉపాధ్యాయులు శివశంకర్, సీఆర్‌పీలు, ఎంఆర్‌పీలు పాల్గొన్నారు.



కంభంలో నివాళి అర్పిస్తున్న ఎంఈవోలు

భగత్‌సింగ్ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్ : భారత స్వాతంత్య్ర ఉద్యమంలో 23 సంవత్సరాలకే దేశం కోసం ప్రాణాలు అర్పించిన సర్దార్ భగత్‌సింగ్ ఆశయాలే స్ఫూర్తిగా పనిచేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక పూలసుబ్బయ్య భవన్‌లో భగత్‌సింగ్ 98వ వర్థంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి శనివారం పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్ రాజగురు సుఖ్‌దేవ్ నిజమైన దేశభక్తులన్నారు. నేటి పాలకవర్గాలు ఇలాంటి త్యాగధనుల జీవితాలను బోధనాంశాలుగా మార్చడానికి ప్రయత్నం చేయకుండా జాతీయవాదం పేరుతో యువతను, విద్యార్థులను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శిం చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అందె నాసరయ్య కాశీం, ప్రభాకర్ పాల్గొన్నారు.



భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న రవీంద్రనాథ్

అమరవీరులకు నివాళి

గిద్దలూరు : భరతమాతకు విముక్తి కలిగించే స్వాతంత్య్ర పోరాటం సలిపిన నాయకుల తెగువను ప్రజలు తెలుసుకుని వారి బాటలో నడవాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్థంతి సందర్భంగా బీజేపీ నాయకులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బీజేపీ జిల్లా అధికారప్రతినిధి డాక్టర్ జీవీ.నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు బి.వి.రామాంజనేయులు, పట్టణశాఖ అధ్యక్షులు ఉదయ్ శంకర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశ్చిమ ప్రాంత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

టీడీపీ పార్లమెంట్ నేత రాఘవరెడ్డి



జనసేన నాయకులతో రాఘవరెడ్డి

మార్కాపురం, మార్చి 23: ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని పశ్చిమ ప్రకాశంలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో శనివారం ఆయన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబడిన మార్కాపురం డివిజన్‌ను అభివృద్ధి చేయాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించినట్లు తెలిపారు. రానున్న టీడీపీ ప్రభుత్వంలో వెలిగొండ ప్రాజెక్టును నీళ్లివ్వనున్నట్లు తెలిపారు. భావితరాల కోసం కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, వెన్నా పోలిరెడ్డి, పఠాన్ హుస్సేన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేద్దాం- ఎరిక్షన్‌బాబును గెలిపిద్దాం

జిల్లాపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మన్నె రవీంద్ర



కార్యకర్తలతో మాట్లాడుతున్న మన్నె రవీంద్ర

పుల్లలచెరువు, మార్చి 23 : రానున్న ఎన్నికల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి తమపార్టీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబును గెలిపిద్దామని మాజీ జేడ్పీ ఉపాధ్యక్షుడు డాక్టరు మన్నె రవీంద్ర అన్నారు .శనివారం నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్య నాయకులు డాక్టరు రవీంద్రను కలిసి ఎన్నికల అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఐదు మండలాల్లో టీడీపీ గ్రాఫ్ పూర్తి పెరిగిందని అన్నారు. వైపాలెంలో ఎరిక్షన్‌బాబును అఖండ మేజార్టీతో గెలిపించి చంద్రబాబు నాయుడికి కానుకగా ఇవ్వడమే తన ధ్యేయం అని అన్నారు కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చేకూరి సుబ్బయ్య, మంత్రు నాయక్, నియోజకవర్గ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, గోళ్ల సుబ్బారావు, సత్యనారాయణ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రమణీయం చెన్నకేశవస్వామి శాంతికల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 23: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో స్వామివారికి శాంతికల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్య రంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్న కేశవస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

టీడీపీ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకు లు శ్రీపతి అప్పనాచార్యులు స్వామి మూలవిరాట్ విశిష్టత వివరించారు. ఆలయంలో శిల్పసంపద, అలనాటి రాజుల శాసనాలు వివరించారు. మాగుంట రాఘవ రెడ్డి స్వామి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున రావు, వెన్నా పోలిరెడ్డిలు ఉన్నారు.

తాగునీటి కష్టాలు తీరేదెన్నడో

● పాతాళానికి పడిపోయిన భూగర్భ జలాలు

● వేసవి గట్టెక్కడం కోసం పొదిలి వాసుల ఆందోళన

పొదిలి, మార్చి 23 : పట్టణంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవిలో ఎండలు ముదిరేకొద్దీ నీటి ఎద్దడి మరింత తీవ్రమయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పట్టణంలో భుగర్భజలాలు అడు గంటాయి. 500 అడుగుల నుంచి 700 అడుగుల లోతువరకు బోర్లు వేసినా, నీరు పడడంలేదు. ఉన్న ఒకటిఅర చేతిపంపులు కూడా ఒట్టి పోయాయి. దీంతో ఈ వేసవిలో దర్శి నుంచి పొదిలికి వచ్చే సాగర్‌నీటి వాటాను పెంచాలని ప్రజలు పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేకపోయింది. సుమారుగా 10 నుండి 15రోజులకు ఒకసారి మాత్రమే సాగర్‌నీరు వస్తోంది. ఎక్కువ రోజులు నీటిసరఫరా లేకపోవడంతో పైపుల్లో పాచి పట్టిన నీరు సరఫరా అవుతోందని ఆ నీటిని తాగి రోగాల బారిన పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వేసవిని అధిగమించడం కోసం అధికారులు ముందుగానే అప్రమత్తం కావాలని ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ట్యాంకర్ల ద్వారా పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరిగింది. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఏడాదికి ఒకరూల్ మారుస్తూ, ట్యాంకర్లు కుదించుకుంటూ వచ్చి చివరకు ట్యాంకర్ల సరఫరానే నిలిపి వేశారని ప్రజలు ఎద్దేవ చేస్తున్నారు. పట్టణంలో ఏడాది పొడవునా ఇదే సమస్య ఉంటుంది. గత ఏడాది పొదిలి విశ్వనాథపురం కూడలిలో నీటి సమస్య తీర్చాలంటూ గంటల తరబడి ప్రజలు రాస్తారోకో చేశారు. ఆ సమయంలో పోలీసులు జోక్యం చేసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించి సమస్య తీరుస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ తరువాత పట్టించుకున్న నాథుడే లేరని పలువురు విమర్శిస్తున్నారు. పట్టణంలో ప్రస్తుతం ఆరు ట్యాంకర్లతో రోజుకు 30 నుండి 35 ట్రిప్పులు వాడుక నీటిని సరఫరా చేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పరిశీలించి అవసరం అనుకుంటే ఉన్నతాధికారుల సూచనలు మేరకు మరికొన్ని పెంచుతామన్నారు. పట్టణంలో సుమారుగా 38 నుండి 40వేల వరకు జనాభా ఉంటారు. అయితే 30 సంవత్సరా లకుపైగా అప్పటి జనాభా ప్రతిపాదనలకు అనుకూలంగా ఒకరికి 40లీటర్ల నీరు అందే విధంగా ఎస్‌ఏపీ తాగునీటి పథకం ఏర్పాటు చేశారు. కానీ అప్పటి నుంచి ఇప్పటికే రెండు వంతుల జనాభా పెరిగిపోయింది. దానికి అనుకూలంగా నీటి సరఫరా చేసే విధంగా సామ ర్థ్యం పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటి కైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను తీర్చాలని ప్రజలు వేడుకుంటున్నారు.





రిక్షాపై తాగునీరు తెచ్చుకుంటున్న శివారు ప్రాంత ప్రజలు, నీటికోసం బండ్లపై ఇలా

అవీ..ఇవీ..

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

త్రిపురాంతకం, మార్చి 23: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన నియమ నిబంధనలపై మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులకు అవగాహనా కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఎంపీడీవో సాంబశివరావు, ఈవోపీఆర్‌డీ మురళీమోహన్, ఎస్సై సాంబశివయ్యలు మాట్లాడుతూ అనుమతి లేనిదే ర్యాలీలు, సభలు నిర్వహించకూడదన్నారు. నిబంధనలమేరకు ప్రతి ఒక్కరూ నడుచుకోవాల్సిందేనని ఐదుగురికి మించి గుంపులుగా ఉండకూడదని తెలిపారు. గ్రామాల్లో శాంతి భద్రతల విషయంతో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని అన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ, వైసీపీ, జనసేన, కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



రాయవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీఎం, డ్వాక్రా మహిళలు

మార్కాపురం రూరల్, మార్చి 23: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వైకేపీ ఏపీఎం రమేష్ బాబు అన్నారు. మండలంలోని రా యవరం గ్రామంలో ఓటు హక్కుపై గ్రామంలోని మహిళలకు అవగాహన, ర్యాలీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆ ప్రాంతంలో మహిళతో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు లలిత, అరుణ, స్వయం సహాయక సంఘ మహిళలు పాల్గొన్నారు.

31 లోపు పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ



పన్నులపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

పొదిలి, మార్చి 23 : పట్టణంలో ఇంటి పన్ను పెండిగ్‌లో ఉన్న వారు మార్చి 31లోగా ఇంటిపన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ పొందవచ్చని పొదిలి నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో పన్నుల బకాయిలు ఉన్న కొన్ని నివాసగృహ యజమానులను కలిసి పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిని చెల్లించాలని ఆయన కోరారు. ప్రజలతో మేమేకమై పన్నువసూలు చేసి పొదిలి నగరపంచాయతీ అభివృద్ధికి కొంతైన తోడ్పాటు అందించాలన్నారు. అందుకు ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా పన్నుచెల్లిస్తే రాయితీ పొందవచ్చాన్నారు. ముందుగా పట్టణంలోని బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు. కొంత సేపు విద్యార్థులతో మాట్లాడారు. వసతులు, మెనూపై ఆరాతీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని విద్యార్థులను అడిగారు.

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

గిద్దలూరు, మార్చి 23 : 2023-24 ఆర్థికసంవత్సరానికి బకాయి ఉన్న ఇంటి, ఖాళీ స్థలాలపై పన్నులను చెల్లించేందుకు వీలుగా ఆది, సోమవారాలలో ప్రత్యేక క్యాష్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదిలోగా ఏకమొత్తంలో పన్ను చెల్లిస్తే వడ్డీ మినహాయింపు పొందవచ్చని పేర్కొన్నారు. ఆదివారం, సోమవారం హోలి పండగు సందర్భంగా సెలవు అయినప్పటికీ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కౌంటర్ ఏర్పాటు చేసినందున పన్నులు చెల్లించాలన్నారు.

బీసీ కాలనీలో నీటిసమస్యను పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

పెద్ద దోర్నాల, మార్చి 23: మండలంలోని ఐనముక్కల గ్రామం బీసీ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా నీళ్లట్యాంకరు సక్రమంగా రావడం లేదన్నారు. దీంతో అవసరాలకు నీళ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలు కొద్దిసేపు స్తంభించాయి. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని మహిళలతో చర్చించారు. వెంటనే ట్యాంకరుతో నీటిని తెప్పించారు. ఇక మీదట ట్యాంకర్లు సక్రమంగా వస్తాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు. వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.



పక్షం రోజులకు ఒకసారి వచ్చే నీటి కోసం ప్రజల తిప్పలు



దద్దాలకు షాక్

ప్రచారంలో విక్టరీని చూపిన వృద్ధురాలు

పామూరు, మార్చి 23 : పామూరు పట్టణంలో వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్‌కు ఎన్నికల ప్రచారంలో శనివారం వింత అనుభవం ఎదురైంది. ఇంటింటి ప్రచారం చేస్తుండగా ఓ వృద్ధురాలికి కరపత్రం ఇస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరగా.. ఆమె టీడీపీ విక్టరీ గుర్తును చూపించడంతో దద్దాల అవాక్కయ్యారు. ఈ చిత్రం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.

ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శి నియామకం



దొనకొండ, మార్చి 23 : దొనకొండ మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఎంపీడీవో వసంతరావునాయక్ ఉత్తర్వుల మేరకు డేవిడ్ నియమితులై బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన కృష్ణమూర్తి పదోన్నతి పొంది ఇతర జిల్లాకు బదిలీపై వెళ్లారు. మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న డేవిడ్‌కు దొనకొండ ఇన్‌చార్జిగా కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

మురుగు కూపం..వరవ కట్ట కాలువ

- చెత్తాచెదారం, మాంసం వ్యర్థాలు
- దోమల బెడద, కంపుకొడుతున్న వైనం
- యథేచ్ఛగా ఆక్రమణ, అక్రమ కట్టడాలు

పామూరు, మార్చి 23 : పట్టణంలోని క్రొత్త చెరువుకు వర్షపు నీటిని సప్లయ్ చానల్ వరవ కట్ట కాలవలలో మురుగు కూపంలా మారాయ. చెత్తాచెదారాలు, వ్యర్థాలతో కాలువలు పేరుకుపోయి మురుగు కదలని పరిస్థితి ఏర్పడింది. వర్షాలు, వరదలు వచ్చినప్పుడు పామూరు పట్టణం మునకకు గురి కాకుండా పట్టణానికి పడమర వైపు నుంచి తూర్పు వైపునకు నీరు ప్రవహించేందుకు వీలుగా పామూరు కొత్త చెరువు నిర్మాణం చేపట్టి చెరువుకు సప్లయ్ చానల్‌గా వరవ కట్ట నిర్మాణం జరిగింది. అప్పట్లో తూర్పు కోడిగుడ్లపాడు ప్రాంతాల్లోని పంట పొలాల్లో కురిసిన వర్షపు నీరు, నేరుగా వరవ కట్ట కాలువ ద్వారా చెరువులోకి చేరి భూగర్భ జలాల తోపాటు చెరువులో నీరు పుష్కలంగా చేరేది. అప్పట్లో పట్టణ ప్రజలు చేరువులోగల బావుల నీటినే వాడేవారు. దాంతో ప్రభుత్వం కూడా రక్షిత మంచి నీటి పథకాలను చెరువుల వద్ద (ఓవర్‌హెడ్ ట్యాంకులు) నిర్మించి పట్టణ ప్రజలకు కుళాయిల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. నేడు కాక్రమేణా వరవ కట్ట కాలువ ఆక్రమణలతో కుంచించుకుపోయింది. వరవకట్ట కాలువలపై ఆక్రమణ దారులు పోటీలు పడి పక్కా కట్టడాలు నిర్మించుకొని ఇళ్లకు చెందిన వ్యర్థ నీటిని పైపుల ద్వారా సప్లయ్ చానల్‌కు వదులుతున్నారు. పట్టంలో వ్యాపారాలు చేసుకునేవా రు, మాంసం, చేపలు, కొబ్బరి బొండాలు, మద్యం తాగేసిన ఖాళీ సీసాలు గ్లాసులు, ఇతర వ్యర్థాలను సైతం వరవ కాలువల్లో వేయడంతో అది మురుగు కూపం లా మారింది. ఆ వ్యర్థాలపై పందులు గుంపులుగా చేరి చెల్లాచెదురు చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమం తా దుర్వాసన, దోమల బెడద పెరిగిపోయిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క వరవ కట్టపై యథేచ్ఛగా ఆక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారు. పైగా ఆ గృహాలకు విద్యుత్ కనెక్షన్‌లకు ధ్రువపత్రాలను ఇస్తుండడం గమనార్హం.



మురుగు కూపంలా మారిన చెరువు వంక కాలువ



చెరువు సప్లయ్ చానల్‌లో ఆకుపచ్చగా ఉన్న నీరు

రోగాలకు నిలయం

వరవ కట్ట కాలువలో మురుగు ముందుకు వెళ్లడం లేదు. వ్యర్థాలతో కాలువలు నిండిపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దీంతో పగలు, రాత్రి కునుకుపట్టే పరిస్థితి లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం 6 గంటలైతే దోమలు దాడి చేస్తున్నాయని చెప్తున్నారు. దీంతో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, విషజ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు తెలిపారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం

వరవ కట్ట కాలువలో చెత్త పేరుకుపోయి మురుగు కదలడం లేదు. దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడదతో ప్రజలు రోగాలబారిపడుతున్నారు. అయినా పంచాయతీ అధికారులకుగానీ, ఆరోగ్య సిబ్బందికి గానీ పట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కాలువను శుభ్రపరిచి, దోమల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు. మాంసం, చేపల వ్యర్థాలను కాలువలో వేస్తుండడంతో అవి కుళ్లి నీళ్లు కలుషితమవుతున్నాయని, ఆ నీరు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల ద్వారా కొళాయికు విడుదల చేస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. చెరువు సమీపంలో ఉన్న వాటర్‌ప్లాంట్ ద్వారా పట్టణ ప్రజలు దాహార్తి తీర్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మురుగుమయమైన వరవ కట్ట కాలువపై ఆక్రమణలను, చెత్తాచెదారాన్ని తొలగించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.



చెరువులోకి పైపుల ద్వారా వదులుతున్న వ్యర్థాలు



దాత ఇచ్చిన బల్లలపై కూర్చున్న పిల్లలు

పాఠశాలకు బల్లల బహూకరణ

ముండ్లమూరు, మార్చి 23 : ముండ్లమూరులోని క్రిస్టియన్ పాలెంలోని ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన తాతపూడి దేవదానం, గ్రేసమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు తాతపూడి థామస్ రూ.50వేల విలువైన ఏడు బల్లలను శనివారం ప్రధానోపాధ్యాయునికి బహూకరించారు. ఇటీవల పాఠశాలను సందర్శించిన థామస్ పిల్లలు కింద కూర్చోవడం చూసి తన తల్లిదండ్రుల పేరుతో అందజేశారు. గ్రామస్థులు, కాలనీ వాసులు థామస్‌కు అభినందనలు తెలిపారు.

కులంపేరుతో దూషించి దాడి చేసిన వ్యక్తిపై కేసు

తాళ్లూరు, మార్చి 23 : తనను ఉద్యోగం నుంచి ఎందుకు తీసి వేయించావని ప్రశ్నించినందుకు ఆగ్రహంతో నన్నే ప్రశ్నిస్తావా అంటూ కులంపేరుతో దూషించి దాడి చేసిన ఘటనపై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసుల కథనం మేరకు.. శివరాంపురం గ్రామానికి చెందిన కోండ్రు రాంబాబు తాళ్లూరు ప్రభుత్వ మద్యం షాపులో సేల్స్‌మన్‌గా పని చేస్తున్నారు. ఇదే దుకాణంలో చింతపాలెంకు చెందిన పోటు కోటేశ్వరరావు సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. మద్యం బాటిల్‌ను ధర కంటే అధికంగా డబ్బులు వసూలు చేసి తనకు ఇవ్వాలని సేల్స్‌మన్ రాంబాబుకు సూపర్‌వైజర్ కోటేశ్వరరావు చెప్పగా అంగీకరించక పోవడంతో అధికారులకు ఉన్నవీలేనివి చాడీలు చెప్పి 18వ తేదీ నుంచి ఉద్యోగం తీయించారు. ఈనెల 22వ తేదీన రాంబాబు తమ గ్రామం నుంచి చీమకుర్తి వెళుతుండగా మార్గమధ్యంలో కోటేశ్వరరావు కన్పించారు. ఎదురుపడ్డ కోటేశ్వరరావును తనను ఎందుకు ఉద్యోగం నుంచి తీసి వేయించావని ప్రశ్నించడంతో తననే ప్రశ్నిస్తావా అంటూ ఆగ్రహంతో రాంబాబును కులంపేరుతో దూషించి రాళ్లతో కొట్టి గాయపరిచారు. తీవ్రగాయాలయిన రాంబాబును చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. బాధితుడు రాంబాబు ఇచ్చిన సమాచారాన్ని రిమ్స్ వైద్యులు తాళ్లూరు పోలీస్ స్టేషన్‌కు పంపగా ఎస్సై వైవీ రమణయ్య కులదూషణ కేసు నమోదు చేశారు.

ఓపెన్ పరీక్షలను సక్రమంగా నిర్వహించాలి



హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న ప్రసన్నకుమార్

కనిగిరి, మార్చి 23 : ఓపెన్ పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని ఏపీ ప్రభుత్వ పబ్లిక్ పరీక్షల పరిశీలకులు, పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ అన్నారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన ఓపెన్ కాపీయింగ్ అనే కథనానికి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఓపెన్ పరీక్షా కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి విద్యార్థి హాల్ టికెట్‌లను పరిశీలించి లోపలకి పంపారు. దాదాపు గంటపాటు కనిగిరిలోని మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో జరిగే పరీక్షల నిర్వహణను ఆయన పరిశీలించారు. పరీక్షా హాలులో విద్యార్థులను తనిఖీ చేశారు. కాపీయింగ్‌కు పాల్పడకుండా బాధ్యతగా పరీక్షలను నిర్వహించాలని కేంద్రాల చీఫ్‌లను ఆయన ఆదేశించారు. ఏ మాత్రం కాపీయింగ్ జరిగినట్లు తెలిస్తే ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.



కంచర్లవారిపల్లిలో పోషకాహారంపై మాట్లాడుతున్న పార్వతి

తృణ ధాన్యాలతో ఆరోగ్యం..!

కనిగిరి, మార్చి 23: తృణ ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని కంచర్లవారిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు తృణ ధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను తినడంవల్ల కలిగే ఆరోగ్యాన్ని ఆమె వివరించారు. రక్తహీనత నుంచి కోలుకుంటారన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వాలని అవి మొదటి టీకావలే ఎంతో పనిచేస్తాయని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, శైలజ, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని మాచవరం సెక్టార్‌లోని చాకిరాల అంగన్వాడీ కేంద్రంలోని గర్భవతులకు, బాలింతలకు చిరుధాన్యాల వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. పోషకపక్వాడ్ పథకం ద్వారా గర్భవతులకు, బాలింతలకు, చిన్నారులకు కేంద్రాల్లో పౌష్టిక విలువలు కల్గిన ఆహారాన్ని అందించటం జరుగుతుందన్నారు. చిన్నారులకు తప్పనిసరిగా బాలామృతం విధిగా తినిపించాలని తల్లులకు తెలియచేశారు. ఈకార్యక్రమంలో అంగాన్వాడీ సూపర్వైజర్ మల్లేశ్వరి, పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్త దీపిక, ఏఎన్ఎం సౌజన్య, ఆశాకార్యకర్తలు వెంగమ్మ, నాగరత్తమ్మ, చిన్నారులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి



గ్రామస్థులతో మాట్లాడుతున్న దర్శి సీఐ షమీఉల్లా

తాళ్లూరు, మార్చి 23 : అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని దర్శి సీఐ షమీఉల్లా తెలిపారు. సమస్యాత్మకంగా ఉన్న తురకపాలెంలో శనివారం ఆయన ప్రజలతో మాట్లాడారు. ప్రతి ఓటరు నిర్భయంగా ఓటు వేయాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద గొడవలు చేయకుండా ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డబ్బుమద్యం వంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఇనుమడింప చేసేలా వ్యవహరించాలన్నారు. ఎక్కడైనా ఓటర్లను ప్రలోభ పెట్టే కార్యక్రమాలు సాగిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీ ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తే చర్యలు తప్పవన్నారు. ఎస్సై వైవీ రమణయ్య మాట్లాడుతూ గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని సూచించారు. గొడవల్లో తల దూర్చేవారిపై నిఘా ఉందన్నారు. గ్రామాల్లో కొత్తవ్యక్తులు, అనుమానితులు తిరిగితే చెప్పాలని సూచించారు.

ముండ్లమూరు : ఎన్నికల నిబంధనలకు భంగం కల్గిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ వీ ఆంజనేయులు అన్నారు. ఆయన శనివారం మండలంలోని బొప్పూడివారి పాలెం, ఈదర, భీమవరం గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనవసరంగా గొడవలను ప్రోత్సహిస్తే వారిపై చర్యలు ఉంటాయన్నారు. 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. మండలంలో రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎన్నికలు అయ్యేంత వరకు వారానికోసారి పోలీసు స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ నాయకుల విగ్రహాలకు, గ్రామాల్లో ఉన్న ఒక పార్టీకి చెందిన నాయకుడి విగ్రహం ఉంటే పూర్తిగా ముసుగులు వేయాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో సభలు, సమావేశాలు నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. ఏదైనా ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో ఇరు వర్గాలపై బైండోవర్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు ఏ వెంకటేశ్వరరెడ్డి, ఏ వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

సీఎస్‌పురంలో కేంద్ర బలగాల కవాతు

పామూరు, (సీఎస్‌పురం) మార్చి 23 : రాన్ను సార్వత్రిక ఎన్నిలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని సీఐ రామానాయక్ తెలిపారు. సీఎస్‌పురం బస్టాండు, శివాలయం వీధి, వడ్డెపాలెం, తహసీల్దార్ కా ర్యాలయరోడ్, డీజీపేట రోడ్, కెనరా బ్యాంక్ వీధిలో శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలని, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బీ ప్రేమ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

భవిష్యత్ బాగుండాలంటే టీడీపీకి ఓటెయ్యండి

- బాబు ష్యూరిటీ కార్యక్రమంలో నాయకులు



ఆకులవీధిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

కనిగిరి, మార్చి 23 : భావితరాల భవిష్యత్ బాగుపడాలంటే టీడీపీకి ఓటెయ్యాలని సీనియర్ నేత మాజీ వైస్‌చైర్మన్ వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి) అన్నారు. కనిగిరి పట్టణంలోని 16వ వార్డులో శనివారం రాత్రి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో కనిగిరి అభివృద్ధి జరిగిందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు అవస్థలు తప్ప అభివృద్ధి లేదన్నారు. వైసీపీ పాలనలో పేదల భూములన్నీ కబ్జాకు గురయ్యాయన్నారు. కొళాయి ద్వారా మంచినీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన నేతలు మాటతప్పారన్నారు. డాక్టర్ ఉగ్ర ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే తాగునీటి కొళాయిలు వేయిస్తారన్నారు. అలాగే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు కృషి చేస్తారని అన్నారు. ఎన్నికల్లో ప్రజాసేవకుడైన డాక్టర్ ఉగ్రను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మద్యం అమ్మకాలను నిలిపేస్తామని చెప్పిన జగన్‌రెడ్డి సొంత మద్యాన్ని తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారన్నారు. ఏపీని మద్యాంధ్రప్రదేశ్‌గా, అప్పుల ఆంధ్రగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రంగాలనూ నాశనం చేసిన జగన్‌రెడ్డిని ఇక శాశ్వతంగా ఇంటికి పంపించాలన్నారు. విజ్ఞత తో మీ ఓటును రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆలోచించే చంద్రబాబుకు వేయాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు, ఏడాది మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి మహిళకు ఏడాదికి రూ.15వేలు, చదువుకునే పిల్లలకు ఏడాదికి రూ.15వేలు అందజేస్తారన్నారు. ప్రతి పథకంలోనూ చంద్రబాబు మహిళలకు ప్రాధాన్యత ను ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో వైసీపీని సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసురెడ్డి, షేక్ ఫిరోజ్, చిలకపాటి లక్ష్మయ్య, షేక్ నజీముద్దీన్, బుల్లా బాలబాబు, గుడిపాటి ఖాదర్, తమ్మినేని వెంకటరెడ్డి, దింటకుర్తి సుబ్రమణ్యం తెలుగు మహిళలు కరణం అరుణ, మాజీ కౌన్సిలర్‌లు షేక్ వాజిదాబేగం, బొగ్గరపు శ్రీలత, దొరసాని, తులసి, స్వప్న, నారాయణమ్మ, వెంకటలక్ష్మమ్మ, ధనలక్ష్మీ, అమ్ములమ్మ, నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు.

చంద్రబాబు పథకాలతో మహిళలకు మేలు

పామూరు : వైసీపీ పాలనలో అన్ని విధాలా మోసపోయిన, ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన మహిళలకు చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో మేలు కలుగుతుందని టీడీపీ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు, వార్డు మెం బర్ ఉప్పలపాటి హరిబాబు తెలిపారు. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పువ్వాడి ఆదేశాల మేరకు పట్టణంలోని ఆకులవీధిలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నిత్యావసరాలు, గ్యాస్, బస్సు, కరెంట్ చార్జీలు ఎడాపెడా పెరిగాయన్నారు. అధికారంలోకి వస్తే అన్ని ధరలను తగ్గిస్తానని, పేదలపై భారాలు పడనీయనని పదేపదే ఎన్నికల్లో చెప్పిన జగన్‌రెడ్డి అన్ని ధరలను పెంచడంతో పాటు చివరకు పేదల నుంచి చెత్త పన్ను ముక్కుపిండి వసూలుచేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంతోపాటు పట్టణాలు, గ్రామాలను అభివృద్ధికి దూరం చేసి సర్వనాశనం చేశారన్నారు. ఓట్లు అడిగే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను, కనిగిరి నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని డాక్టర్ ఉగ్రను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బూత్ కమిటీ ఇన్‌చార్జిలు మెంటా నరసింహారావు, బండ్ల నారాయణ, సుంకే వెంకటస్వామి సుంకే మో హనరావు, రాంబాబు, ఈర్ల సత్యం, గద్దె అరవింద్, బండ్ల సురేష్, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

పీసీపల్లి : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని భట్టుపల్లి బూత్ ఇన్‌చార్జి మూలె పుల్లారెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి ఆ గ్రామంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. మండల నాయకులు, బుతూలెవల్ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.అనంతరం సూపర్‌సిక్స్ కరదీపికలను ప్రజలకు పంపిణీచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5సంవత్సరాల వైసీపీ పాలనలో చెప్పుకునేందుకు కూడా ఒక్క అభివృద్ధి పనిచేయలేదన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే సిమెంట్‌రోడ్లు, ప్రజలకు తాగునీరు అందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన అన్నారు. ప్రతిఒక్కరూ కనిగిరి ఎమ్మెల్యేగా ఉగ్ర నరసింహారెడ్డిని గెలిపించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో డబ్బుగొట్టు రవీంద్ర, ఊసా మాల్యాద్రి, బండి మాలకొండయ్య మాచర్ల, పిచ్చిరెడ్డి, సత్తిరెడ్డి, జోసెఫ్, ప్రసాద్, చిన బ్రహ్మయ్య చిన వెంకటేశ్వర్లు, శ్రీను, వేణు, వెంకటరత్త య్య మహేంద్రరెడ్డి, నానిబాబు, చినయోగయ్య ఉన్నారు.



ఆకులవీధిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు



భట్టుపల్లిలో పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుకు నివాళి



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పామూరు, మార్చి 23 : దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ఉరికంభం ఎక్కిన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు ప్రాణత్యాగం మరువలేనిదని సీపీఐ సీనియర్ నాయకులు ఆకుల మోహన్‌రావు తెలిపారు. వారి వర్ధంతి సంద్భంగా ఘనంగా నివాళులర్పించారు. భగత్‌సింగ్ స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని మోహన్‌రావు సూచించారు. భగత్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వడంతోపాటు వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి వజ్రాల సుబ్బారావు, మండల కార్యదర్శి కే ప్రభాకర్, దస్తావేజులేఖరి షేక్ రఫి, నాయకులు రఘునాథరెడ్డి, ప్రసాద్, నూరి బాబు, మహేష్ పాల్గొన్నారు.

సీఎస్‌పురం : మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడిన భగత్ సింగ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని సీపీఎం మండల కా ర్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. డీవైఎఫ్‌ఐ ఆధర్యంలో నారాయణస్వామి కాంప్లెక్స్‌లో భగత్‌సింగ్ వర్ధంతి సభను నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఈర్ల కొండయ్య, లక్ష్మయ్య కేవీపీఎస్ మండల కార్యదర్శి బీజే రత్నం, ఈర్ల మోహన్, వీరాంజనేయులు, గోపాల్, వేల్పుల శ్రీను, అంకమరావు పాల్గొన్నారు.

ముండ్లమూరు : నేటి యువత చెడు మార్గాల్లో పయనించకుండా స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్ అడుగు జాడల్లో నడవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య అన్నారు. ఆయన మండలంలోని పెద ఉల్లగల్లులో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం పోరాడి అతి చిన్న వయస్సులోనే ఉరికంభం ఎక్కారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు కల్యాణ్, షేక్ బాషా, నన్న, మోహిత్, అభీత్, నాగూరు, కిరణ్, అమీన్ బాషా ఉన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పిచ్చయ్య

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

ఇంటి ఋణాలు
రేకుల ఇల్లు / పెంకుల ఇల్లు / స్లాబ్ ఇల్లు / వ్యవసాయ ఋణాలు / ఖాళీ స్థలాలకు / OTS పట్టాలు / కడుతున్న ఇల్లు / కట్టిన ఇల్లు / మొ॥ వాటికి తక్కువ వడ్డీకి ఇప్పించబడును. 18సం॥ సర్వీస్ ఇస్తున్నాం. సంప్ర॥ 9502466253
AJO-183708

స్థలం అమ్మబడును
చీరాల, రంగారెడ్డినగర్, రంగారెడ్డి గారి ఇంటి వెనుక 135.29చ.మీ, 40.9 X 36 కొలతలు కలిగిన స్థలం (దక్షిణం, పడమర రోడ్డు) అమ్మకం కలదు. సంప్రదించండి. నో బ్రోకర్స్, డైరెక్ట్ - Contact : 9491785306
AJO-183578

హౌసింగ్ లోన్స్
మార్ట్‌గేజ్ లోన్, బిజినెస్ టేకోవర్, రేకుల షెడ్లు, పర్సనల్, సింగిల్ డాక్యుమెంట్స్‌పై లోన్స్ R.R. అసోసియేట్స్ లోన్స్ & కన్సల్టెన్సీ, ఒంగోలు, సెల్: 9491295153, 9440873153
AJO-183854

WANTED
ఒంగోలు లోని ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (PRO's) కావలెను. Age: 21-35 Yrs. అనుభవంను బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: సెల్: 87121 64111.
AJO-198

BUILDING FOR RENT / SALE
ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ ఎదురు, రామ్‌నగర్, 6వ లైను, N.R.K.M లాడ్జి ప్రక్కన, 5అంతస్తుల బిల్డింగ్ (40X80 RCC) కొలతలతో అద్దె / అమ్మకానికి కలదు. సెల్: 9866659049, 7013261494
AJO-151047

EDUCATION
Join by 25th BA Rs 5500, B.Com 6k B.Sc 10k, PG Arts 8K, yearly in Distance at PLNM Degree College, 9177408565, 9642656449, MBA 16k, MCA 20k Sem.
AJG-184906


అమ్మబడును
నెల్లూరు జిల్లా, కందుకూరు టౌన్‌లో రూ.30,000/-ల అద్దె వచ్చు ఇల్లు అమ్మబడును మరియు ఇంటి స్థలం గది రూ.25,000/-కు కలదు. నూతన బైపాస్ ప్రక్కన ప్లాట్లు, పొలము అమ్మబడును, కొనబడును. సంప్ర॥ 97042 50705
AJO-183696

రియల్ ఎస్టేట్
గుంటూరు సిటీకి అతి సమీపంలో లాం గ్రామం నందు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దగ్గర సువర్ణ కుటీర్ డెవలపర్స్ వారి 18వ CRDA అప్రూవ్డ్ వెంచర్ చ.గ 10,000 మాత్రమే. బ్యాంకు లోను, 20%+తో బై బ్యాక్ సౌకర్యం కలదు. సంప్ర॥ 88868 55355, 88863 55955
AJG-184754

రియల్ ఎస్టేట్
గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, రెడ్డిపాలెం, పెదగండ్ల, అగతవరప్పాడు, పెదకాకాని, కొప్పురావూరు, నంబూరు, కంతేరు, కాజా మరెక్కడైనా ప్లాట్లు అ/కొ. సంప్ర॥ జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత. ఫోన్ : 73823 96677
AJG-700

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥
ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358
ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥
Asst-Cir-Manager. 9985411484





ప్రస్తుత ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



రాయపాటి





కాసు బ్రహ్మానందరెడ్డి • రోశయ్య • జనార్ధనరెడ్డి

మొత్తం ఓట్లు:	17,12,829
పురుషుల ఓట్లు:	8,37,200
మహిళల ఓట్లు:	8,75,433
ఇతరుల ఓట్లు:	196



మోదుగుల



మద్ది సుదర్శనం



మేకపాటి



కోట సైదయ్య



కాసు కృష్ణారెడ్డి





2024 సార్వత్రిక ఎన్నికల సమరం సమీపిస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖారారయ్యారు. ఆయా పార్టీల ప్రచారాలు ఊపందుకున్నాయి. ఈ సారి షెడ్యూల్‌కు పోలింగ్‌కు మధ్య వ్యవధి 65 రోజులు వచ్చింది. అంటే సుమారు రెండు నెలలకు పైగా ప్రచారాలు నిర్వహిం చుకునే అవకాశం అభ్యర్థులకు వచ్చింది. అయితే ప్రచార ఖర్చులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అభ్యర్థులు, రాజకీయ పక్షాలు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాను గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా విభజిం చారు. దీంతో ఈ మూడు జిల్లాల పరిధిలో మూడు లోక్‌సభ, 20 అసెంబ్లీ నియోజక వర్గాలు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గాల వారీగా చరిత్రను పాఠకులకు అందించే ప్రయత్నమిది...

- అభ్యర్థుల గెలుపోటముల్లో కులమే కీలకం
- ఇక్కడి నుంచి లోక్‌సభలోకి అడుగుపెట్టి ప్రముఖపాత్ర
- దేశంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గంగా పేరు
- నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళల ఓట్లే అధికం

పల్నాడు.. పౌరుషాలగడ్డ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు	
కమ్మ	2,14,063
రెడ్డి	1,48,627
ముస్లిం	1,90,589
కాపు	1,60,881
మాదిగ	1,98,613
మాల	1,13,270
ఆర్య వైశ్య	76,544
యాదవ	1,16,986
వడ్డెర	86,903
సుగాలీ	49,945
రజక	42,884
ముదిరాజు	31,796
ఎరుకల	26,981
నాయిబ్రహ్మణ	12,053
యానాది	10,983
బ్రాహ్మణ	9,425

నియోజకవర్గ విశిష్టత

నాగార్జున సాగర్ జలాశయం నిర్మాణంతో ఈ నియోజకవర్గ ప్రజల జీవన విధానంలో మార్పు వచ్చింది. సాగర్ కాల్వలపై విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సాగర్ జలాలు సరఫరా అవుతున్నాయి. ఇక్కడ పండించే బీపీటీ వరికి మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలలో కూడా మంచి గిరాకీ ఉంది. పత్తి, మిరప పంటలు సుమారు ఐదు లక్షల ఎకరాల్లో సాగవుతాయి. చిలకలూరిపేట నియోజక వర్గం పత్తి పరిశ్రమల ఖిల్లాగా ఉంది. గురజాల నియోజక వర్గంలోని పిడుగురాళ్ల ప్రాంతంలో సున్నపు రాయి పరిశ్రమలు ఉన్నాయి. పల్నాడు చరిత్రకు ఈ నియోజకవర్గం దర్పణం పడుతుంది. నాగార్జున సాగర్, అమరావతి, కోటప్పకొండ, చేజర్ల, గుత్తికొండ బిళంలు పర్యాటక కేంద్రాలుగా ఉన్నాయి. మాచర్లలోని చెన్న కేశవస్వామి ఆలయం పల్నాటి చరిత్రకు అలవాలంగా ఉంది. బ్రహ్మ నాయుడి కాలంలో చాపకూటి సిద్ధాంతాన్ని అమలు చేశారు. బ్రిటీష్ హయాంలో కన్నగంటి హనుమంతు పన్నుల నిరాకరణ ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారు. కోహినూరు వజ్రానికి ఈ నియోజకవర్గం పుట్టినిల్లు. ఫ్యాక్షనిజంతో పాటు నక్సల్స్ ప్రభావిత నియోజకవర్గంగా గుర్తింపు పొందింది. నక్సల్స్ నేత చారుమ జుందార్ గుత్తికొండ బిళం నుంచి నక్సలిజాన్ని విస్తరింపచేశారు. నక్సలైట్లపై నిషేధం ఎత్తివేసి ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించిన సందర్భంగా మావోయిస్టు నేతలు గుత్తికొండ బిళం వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిం చారు. నాగార్జున సాగర్ జలాశయం, మధ్యలో ఉన్న కొండ, అమరావతిల్లో బౌద్ధ కేంద్రాలు ఉన్నాయి. ఈ రెండు చోట్ల పురావస్తు శాఖ మ్యూజియంలను నిర్వహిస్తున్నది. అమ రావతిలో ప్రపంచస్థాయి కాలచక్ర మహాసభలను బౌద్ధులు నిర్వహించారు. సాహితీ, కళ, రాజకీయ రంగాలలో అనేక మంది ప్రముఖులు ఈ నియో జకవర్గం నుంచి ఎదిగారు.

పల్నాడు.. పౌరుషాల గడ్డ. సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక. కక్షలు, కార్పణ్యాలు మిళితమై అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయిస్తాయి. నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఎన్నికలు, రాజకీయాలు.. బాంబుల సంస్కృతితో ముడిపడి ఉంటాయి. ప్రధానంగా కండ, ధన బలంతో ముందుండే వారిదే పైచేయిగా ఉంటుంది. అన్నింటి కంటే కులం కీలక పాత్ర పోషిస్తుంది. ఎన్నికల్లో రిగ్గింగ్‌లు, సైక్లింగ్‌లకు పెట్టింది పేరు. దేశంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గంగా ఎన్నికల కమిషన్ జాబితాలో నరసరావుపేట ఉంది. మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఇక్కడి నుంచి రెండు సార్లు విజయం సాధించి లోక్‌సభలోకి అడుగుపెట్టి జాతీయ రాజకీయాల్లో ప్రముఖపాత్ర పోషించారు. దీంతో నియోజకవర్గానికి దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రులు కాసు బ్రహ్మానందరెడ్డి, నేదురుమల్లి జనార్ధన రెడ్డి, కొణిజేటి రోశయ్య లోక్‌సభ సభ్యులుగా నరసరావుపేట నుంచి ఎన్నికయ్యారు. ఈ నియోజక వర్గంలో పురుషుల కంటే మహిళల ఓట్లు అధికంగా ఉన్నాయి. మహిళల తీర్పుపై అభ్యర్థుల జాతకాలు ఆధార పడి ఉంటాయి.

పునర్విభజనలతో పలు మార్పులు

1951లో నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గం ఏర్పడింది. ఇప్పటికి మూడు సార్లు నియోజకవర్గ పునర్విభజన జరిగింది. 1957, 1962లలో జరిగిన ఎన్నికల్లో దీనిని మార్కాపురం నియోజక వర్గంగా మార్పు చేశారు. అనంతరం 1967 ఎన్నికల్లో తిరిగి నరసరావుపేట నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. 2009కి ముందు జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ఈ నియోజక వర్గ రూపురేఖలు మారిపోయాయి. అంతకు ముందు నియోజక వర్గం గుంటూరు, ప్రకాశం జిల్లాలకు విస్తరించి ఉండేది. నరసరావుపేట, గురజాల, మాచర్ల, వినుకొండ, ప్రకాశం జిల్లాలోని మార్కాపురం, కంభం, దర్శి అసెంబ్లీ నియోజక వర్గాలు నరసరావుపేట లోక్‌సభ పరిధిలో ఉండేవి. 2009లో జరిగిన పునర్విభజనతో లోక్‌సభ స్థానం పల్నాడు జిల్లాకే పరిమితమైంది. నరస రావుపేట లోక్‌సభ పరిధిలో నరసరావుపేట, విను కొండ, గురజాల, మాచర్ల, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పెద కూరపాడు అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఉన్నాయి. పునర్విభజనతో పార్టీల బలాబలాల్లో కూడా పూర్తిగా మార్పు వచ్చింది. ప్రకాశం జిల్లాలోని మూడు నియోజకవర్గాలు ఈ నియో జకవర్గం కింద ఉన్నప్పుడు కాంగ్రెస్‌దే పైచేయిగా ఉండేది. నియోజకవర్గ పునర్విభజనతో అప్పటి గుంటూరు జిల్లాకు నరసరావుపేట లోక్‌సభ స్థానం పరిమితం కావడంతో తదుపరి జరిగిన ఎన్నికల్లో రెండు సార్లు ఇక్కడి నుంచి టీడీపీ అభ్యర్థులు వరుసగా గెలుపొందారు. మొత్తం మీద ఈ నియోజ కవర్గం టీడీపీకి అనుకూలంగా మారిందని రాజకీయ విశ్లేషకులు చెపుతుంటారు. టీడీపీ ఆవిర్భావ అనంతరం జరిగిన 1984, 1996 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఇక్కడి నుంచి విజయం సాధించారు. 1989, 1991, 1998, 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ నియోజక వర్గం నుంచి ఇండిపెండెంట్, సీపీఐ అభ్యర్థులు కూడా గెలుపొందిన చరిత్ర ఉంది. 1951లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా చాపలమడుగు రామయ్యచౌదరి విజయం సాధించారు.

నియోజకవర్గ ముఖచిత్రం



బరిలో లావు, అనిల్

తాజా ఎన్నికల బరిలో సిట్టింగ్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా ఖరారు చేసింది. వైసీపీ నుంచి నెల్లూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనిల్‌కుమార్ పోటీలో ఉన్నారు. వీరిద్దరూ ఇప్పటికే నియోజకవర్గంలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనుల అజెండాగా లావు ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అనిల్‌కుమార్ చెబుతున్నారు.

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి చెందిన అభ్యర్థి	పార్టీ	మెజార్టీ ఓట్లు
1951	చాపలమడుగు రామయ్య చౌదరి	స్వతంత్ర	నంద్యాల ఆంజనేయులు రెడ్డి	కాంగ్రెస్	29,936
1957	చేగిరెడ్డి బాలిరెడ్డి	కాంగ్రెస్	గుజ్జుల యలమందారెడ్డి	సీపీఐ	18,805
1962	గుజ్జుల యలమందారెడ్డి	సీపీఐ	చేగిరెడ్డి బాలిరెడ్డి	కాంగ్రెస్	28,827
1967	మద్ది సుదర్శనం	కాంగ్రెస్	టీకే చౌదరి	ఎస్‌డబ్ల్యుఏ	64,431
1971	మద్ది సుదర్శనం	కాంగ్రెస్	వైవీ నరసింహారావు	స్వతంత్ర	1,30,851
1977	కాసు బ్రహ్మానందరెడ్డి	కాంగ్రెస్	ఐ కోటిరెడ్డి	బీఎల్‌డీ	88,071
1980	కాసు బ్రహ్మానందరెడ్డి	కాంగ్రెస్‌ఐ	పోపూరి బ్రహ్మానందం	స్వతంత్ర	84,296
1984	కాటూరి నారాయణ స్వామి	టీడీపీ	కాసు బ్రహ్మానందరెడ్డి	కాంగ్రెస్	14,238
1989	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	పిడతల రంగారెడ్డి	టీడీపీ	65,706
1991	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	అనిశెట్టి పద్మావతి	టీడీపీ	62,616
1996	కోట సైదయ్య	టీడీపీ	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	18,958
1998	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్	కోట సైదయ్య	టీడీపీ	47,819
1999	నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి	కాంగ్రెస్	ఎస్‌ఎం లాల్ జాన్ బాషా	టీడీపీ	13,852
2004	మేకపాటి రాజమోహనరెడ్డి	కాంగ్రెస్	మద్ది లక్ష్మయ్య	టీడీపీ	86,255
2009	మోదుగుల వేణుగోపాలరెడ్డి	టీడీపీ	వల్లభనేని బాలశౌరి	కాంగ్రెస్	1607
2014	రాయపాటి సాంబశివరావు	టీడీపీ	ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి	వైసీపీ	35,280
2019	లావు శ్రీకృష్ణదేవరాయలు	వైసీపీ	రాయపాటి సాంబశివరావు	టీడీపీ	1,53,978

దూరదృష్టి ఉన్న నేత చంద్రబాబు

- ఆయనతో కలిసి పనిచేయడం అదృష్టం
- బాపట్ల టీడీపీ లోక్‌సభ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్

బాపట్ల, మార్చి 23: విజన్, దూరదృష్టి ఉన్న నేత నారా చంద్రబాబునాయుడని బాపట్ల టీడీపీ లోక్‌సభ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్ తెలిపారు. అయనతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. బాపట్ల లోక్‌సభకు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మొదటిసారిగా శనివారం కృష్ణప్రసాద్ బాపట్లకు వచ్చారు. ఈ సందర్భంగా బాపట్ల టీడీపీ కార్యాలయంలో పార్టీశ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999 నుంచి 2004 వరకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రపంచదేశాల మన్ననలను పొందారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి విజయం సాధించాలని ప్రపంచదేశాలు ఆకాంక్షిస్తున్నాయన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో అద్భుతమైన ప్రగతి సాధించగలమన్నారు. దీనిని ఎవరు ఆపలేరన్నారు. యువతకు, మహిళలకు పెద్దఎత్తున అవకాశాలు కల్పిస్తామన్నారు. బాపట్ల లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీచేస్తున్న అభ్య ర్థులు అద్భుతమైన టీమ్ అని వారందరూ విజయం సాధించటం తథ్యమన్నారు. సమావేశం లో బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు తానికొండ దయాబాబు, పల్లం సరోజని, పట్టణ, మండలపార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, నాయకులు మందపాటి ఆంధ్రేయ, విన్నకోట వీరయ్యానాయుడు, కావరి శ్రీనివాసరెడ్డి, పల్లం జీవన్, టీడీపీ నాయకులు కూరపాటి పూర్ణశంకరరావు, చెన్నుపాటి హైమావతి, జంగం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టి.కృష్ణప్రసాద్, వేగేశన

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.24(ఆదివారం)

సహేరీ (ఉదయం) 4.52 (సోమవారం)

వార్డెన్లు అప్పులపాలు



- డైట్‌చార్జీల బిల్లులు రాక ఆందోళన
- ఒక్కో హాస్టల్‌కు రూ.5 లక్షలకుపైగా పెండింగ్
- విద్యా సంవత్సరం ముగుస్తున్నా విడుదల కాని డైట్ చార్జీలు
- నిధులు ఉన్నా ట్రెజరీలో బిల్లులకు మోక్షం లేదు
- అప్పులతో వసతి గృహాల నిర్వహణ చేయలేమంటోన్న సంక్షేమాధికారులు



గుంటూరు(విద్య), మార్చి 23: డైట్ బిల్లులు రాక.. పంపిణీదారులు సరుకులు ఇవ్వక.. పిల్లల ఆకలి కేకలు చూడలేక వార్డెన్లు అప్పులు చేసి ఆహార పదార్థాలు కొనుగోలు చేసి ఇంతకాలం హాస్టళ్లను నడిపారు. అయితే నెలలు గడుస్తున్నా డైట్ బిల్లులు ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. మరో నెల రోజుల్లో విద్యా సంవత్సరం ముగియనున్నది. దీంతో రూ.లక్షలు అప్పులు చేసిన వార్డెన్లు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సంక్షేమ హాస్టల్స్ వార్డెన్లు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కొన్ని చోట్ల అప్పులతో నిత్యావసర వస్తువులు కొనలేమని కొంతమంది చేతులు ఎత్తివేస్తున్నారు. ఇప్పటి వరకు అప్పులు చేసి తెచ్చిన నిత్యావసర సరుకులు, కూరగాయలు, గుడ్లు, చికెన్ బిల్లులకు సంబంధించి ఒక్కో హాస్టల్‌కు రూ.లక్షల్లో రావాల్సి ఉంది. దీంతో పంపిణీదారులు అప్పు ఇవ్వడానికి ముందుకు రావడం లేదని వార్డెన్లు వాపోతున్నారు. ప్రభుత్వం సత్వరం నిధులు విడుదల చేయకుంటే హాస్టళ్లను నిర్వహిం చడం తమవల్ల కాదంటూ కొందరు వార్డెన్లు జిల్లా స్థాయి అధికారులకు స్పష్టం చేశారు. ఫలితంగా విద్యార్థులు ఆకలి కేకలతో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 42, బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 54, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 9 హాస్టళ్లు ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో దాదాపు 15 వేల మందికిపైగా విద్యార్థులు 3 నుంచి 10వ తరగతి వరకు వసతి పొందుతూ చదువుకుంటున్నారు. వారికి ప్రభుత్వం డైట్‌చార్జీల కింద నెలకు 3,4 తరగతుల విద్యార్థులకు రూ.1000, 5 నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1250, కళాశాల స్థాయి విద్యార్థులకు రూ.1400 చెల్లించాలి. ఈ నిధులతోనే విద్యార్థుల వంటకు అవసరమైన కూరగాయలు, చికెన్, గుడ్లు, పండ్లు తదితరాలు కొనుగోలు చేస్తారు. అయితే ప్రభుత్వం 8 నెలల నుంచి డైట్ చార్జీలు చెల్లించడం లేదని వార్డెన్‌లు తెలిపారు. ఒక్కోహాస్టల్‌కు రూ.1.20 లక్షల నుంచి రూ.5 లక్షలకుపైగా డైట్‌చార్జీల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అంటే ఉమ్మడి జిల్లాలో అన్ని వసతిగృహాలు కలిపి 105 ఉన్నాయి. అంటే రూ.1.26 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉందని సమాచారం. బయోమెట్రిక్ ప్రకారం విద్యార్థుల హాజరు నమోదు చేసి ట్రెజరీకి నెలవారీగా డైట్ బిల్లులను వార్డెను పంపుతారు. డైట్ చార్జీలకు అవసరమైన బడ్జెట్ ఉందని, జిల్లా స్థాయిలో బిల్లులు ట్రెజరీకి పంపినా అనుమతులు మాత్రం ఇంతవరకు రాలేదని అధికారులు చెబుతున్నారు. అప్పులు తేవడంతోపాటు తమ జీతం డబ్బులను కూడా సరుకుల కొనుగోళ్ల కోసం ఖర్చు చేసిన వార్డెన్లు మరో నెలలో విద్యా సంవత్సరం ముగియనుండటం.. ప్రస్తుత ప్రభుత్వం గడువు ముగియనుండటంతో ఆందోళన చెందుతున్నారు.

ప్రచారం తప్ప.. పైసలు ఇవ్వరు...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏ సభలో మాట్లాడినా నా ఎస్సీ, ఎస్టీ, నా బీసీ అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పడం తప్ప పేద, బడుగు, బలహీన వర్గాల గోడు పట్టించుకున్న దాఖలాలు లేవనేందుకు వసతిగృహాల అంశమే నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు. మరోవైపు విద్యార్థిని విద్యార్థులకు అందాల్సిన కాస్మోటిక్స్ చార్జీలు కూడా ఇప్పటి వరకు విడుదల చేయలేదు.

జెండా తొలగించలేదని ఫిర్యాదు

టీడీపీ కార్యకర్తపై వైసీపీ ఎంపీటీసీ దాడి

కొల్లూరు, మార్చి 23: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది టీడీ పీ వర్గీయుల ఇళ్లపైన ఉన్న జెండాలను తొలగించారు. అయితే వైసీపీ వారి ఇళ్లపై జెండాలు తొలగించలేదు. దీనిని గుర్తించిన టీడీపీ కార్యకర్త అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సహించలేని వైసీపీ ఎంపీటీసీ టీడీపీ కార్యకర్తపై దాడి చేశారు. ఈ సంఘటన శనివారం సాయంత్రం కొల్లూరు మండలం కిష్కింధపాలెంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలు.. గ్రామంలో టీడీపీ నాయకుల ఇళ్లపై కట్టిన జెండాలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. వైసీపీ ఎంపీటీసీ ఇంటిపై పార్టీ జెండాను తొలగించలేదు. తమ ఇళ్లపై జెండాలను తొలగించి, ఎంపీటీసీ ఇంటిపై ఉన్న జెండాను ఎందుకు తొలగించలేదని టీడీపీ కార్యకర్త కొల్లి వెంకటేశ్వరరావు సంబంధిత సిబ్బందిని ప్రశ్నించాడు. ఈ విషయాన్ని వీఆర్వో, పంచాయతీ సిబ్బంది వైసీపీ ఎంపీటీసీకి తెలిపి జెండాను తొలగించాలని సూచించారు. దీంతో తనపై ఫిర్యాదు చేస్తావా అంటూ ఎంపీటీసీ పొలిమెట్ల ఆనందకిషోర్, సర్పంచ్ నీలాంబరం, కార్యకర్తలు గురివిందపల్లి లోకం, కొక్కిలిగడ్డ లాజరు తదితరులు టీడీపీ కార్యకర్త వెంకటేశ్వరరావుపై దాడి చేశారు.





శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

రండి దర్శించండి తరించండి

శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానము

శింగరకొండ, అద్దంకి మండలం, బాపట్ల జిల్లా

69వ వార్షిక తిరునాళ్ళ మహోత్సవములు

(తేది.23-03-2024 నుండి 25-03-2024 వరకు)

స్వామియే స్వయముగా ఆవిర్భవించి క్షేత్ర మహిమలు కలిగిన దివ్యక్షేత్రము శింగరకొండ నందు

తేది.25-3-2024 సోమవారం ఉదయం 5గంటల నుండి స్వామి వారి దివ్యదర్శనము, సాయంత్రము గం॥6.00లకు రథోత్సవము. ప్రతిరోజు సాయంత్రము గం॥6.00 నుండి సాంస్కృతిక కార్యక్రమములు కలవు. భక్తులు విరివిగా ఈ మహోత్సవములో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావలసినదిగా కోరుచున్నాము. దేవస్థానములో జరుగు రాతి ముఖమండపము పునఃనిర్మాణమునకు మరియు వివిధ అభివృద్ధి పనులకు భక్తులు సహకరించి విరివిగా విరాళములు ఇచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరు.

పరోక్షముగా aptemples.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా E-Hundi, E-Donations మరియు అన్ని స్వామి వారిసేవలలో పాల్గొనవచ్చును.

పార్కింగ్ స్థలములు

1. అద్దంకి వైపు నుండి వచ్చు వాహనములకు కూకట్ల కన్వెన్షన్ హాల్ ప్రక్క నుండి 99 అడుగుల విగ్రహము వరకు
2. నరసరావుపేట వైపు నుండి వచ్చు వాహనములకు చక్రాయపాలెం వైపు గల ఆర్చ్ గేట్ వద్ద
3. సింగరకొండపాలెం వైపు వచ్చు వాహనదారులు సింగరకొండపాలెం MPH School వద్ద.

ట్రాఫిక్ మళ్లింపు వివరాలు

1. ఒంగోలు టు హైదరాబాద్ వయా మార్టూరు, చిలకలూరిపేట, నరసరావుపేట వైపు
2. వినుకొండ నుండి వచ్చు వాహనాలు వయా సంతమాగులూరు క్రాస్ రోడ్, చిలకలూరిపేట వైపు
3. కడప నుండి వచ్చు వాహనాలు వయా పొదిలి, చీమకుర్తి, ఒంగోలు వైపు
4. అద్దంకి ట్రాఫిక్ మేదరమెట్ల పైలాన్ నుండి నేషనల్ హైవే వైపు

సదా స్వామి వారి సేవలో...

తల్లాప్రగడ సుభద్ర, సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి

శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానము శింగరకొండ అద్దంకి మండలం, బాపట్ల జిల్లా



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23 : నామినేషన్ల ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులకు సమగ్ర అవగాహన అవసరమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. పార్లమెంట్‌తో పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు, ఏఆర్వోలకు శనివారం స్థానిక స్పందనహాలులో నిర్వహించిన వర్క్‌షాపులో కలెక్టర్ మాట్లాడారు. నామినేషన్ల ప్రక్రియలో అవసరమైన అధికారులతో ప్రత్యేకంగా డెమో నిర్వహించారు. నామినేషన్ల స్వీకరించే సమయంలో తప్పనిసరిగా ఎన్నికల మిషన్ నిర్దేశించిన చెక్‌లిస్టును అనుసరించాలని దిశానిర్దేశం చేశారు. అభ్యర్థుల ఫొటోలు గత మూడు నెలలోపు దిగినవిగా స్పష్టంగా కనిపిస్తూ ఉండాలన్నారు. బ్యాలెట్ పేపర్లపైన వారి పేరు ఏ విధంగా ఉండాలో, డిక్లరేషన్‌లో పొందుపర్చాలన్నారు. కేవలం ఎన్నికల ఖర్చుల నిమిత్తం తాజాగా తెరిచిన బ్యాంకు ఖాతా వివరాలను కూడా నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్లను ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు మాత్రమే స్వీకరించాల్సి ఉంటుందన్నారు. ప్రతిరోజు వచ్చిన నామినేషన్ల వివరాలను నోటీసు బోర్డులో స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. శుభముహూర్తాలు, చివరి రోజు డెడ్ లైన్ లోపు నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు వచ్చినప్పుడు ఎలాంటి వివాదాలకు తావులేకుండా మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా భద్రపర్చుకోవడం కూడా కీలకమన్నారు. సువిధ పోర్టర్ ద్వారా కూడా నామినేషన్లు, అఫిడవిట్లు, ఎన్నికల ప్రచారానికి అనుమతులను అభ్యర్థులు కోరవచ్చని తెలిపారు. డమ్మి నామినేషన్‌పత్రాలను ఆర్వోలకు ఇచ్చి వాటిని నింపడం, తప్పులను గుర్తించడంపై వారి టీములకు ప్రత్యేక పరీక్షను కూడా నిర్వహించారు. అభ్యర్థులకు వరుస సంఖ్యలో బ్యాలెట్ బాక్సులో పేరును కేటాయించేందుకు అనుసరించాల్సిన విధానం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరాలను అనుసంధానం చేయడంపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రవర్తనా నియామావళిని అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ఇలాంటివి ఏమైనా జరిగితే క్షేత్రస్థాయిలో మహిళా పోలీసులు, వీఆర్వోలు తక్షణమే పై అధికారుల దృష్టికి తీసుకొని రావాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్వో శ్రీలతతో పాటు ఎన్నికలకు సంబంధిత నోడల్ అధికారులు ఉన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎన్నికల కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించారు.

డీఎంహెచ్‌వోకు ఏడీగా ఉద్యోగోన్నతి



రాజ్యలక్ష్మి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మికి వైద్యశాఖ అడిషనల్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఆమె ఏప్రిల్ 30వతేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈనేపథ్యంలో రాజ్యలక్ష్మికి అడిషనల్ డైరెక్టర్(స్పెషల్) హోదా కల్పిస్తూ ఇక్కడే పనిచేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న డీఎంహెచ్‌వో పోస్టును అప్‌గ్రేడ్ చేసి ఇక్కడే కొనసాగే విధంగా వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఉత్తర్వులులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యశాఖ అడిషనల్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన రాజ్యలక్ష్మిని శనివారం పలువురు అభినందించారు.

టోకెన్ కష్టాలు

- ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసుకొనేందుకు కష్టాలు
- గత నెలలో నిధులు వచ్చినా ఒక్కపైసా తీసుకోలేని దుస్థితి
- ఇబ్బందికరంగా మారిన కొత్త విధానం



ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23 : కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థికసంఘం నిధులను డ్రా చేసుకునేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికే పంచాయతీల్లో చిల్లిగవ్వ కూడా లేక కూనారిల్లుతున్న సమయంలో రాక రాక వచ్చిన నిధులను కూడా సకాలంలో తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కేంద్రప్రభుత్వం గత నెలలో సుమారు రూ.35కోట్ల ఆర్థికసంఘం నిధులను నేరుగా జిల్లాలోని పంచాయతీ అకౌంట్లకు జమచేసింది. అయితే ఆ నిధులను డ్రా చేసుకునేందుకు కొత్తగా టోకెన్ సిస్టం ఏర్పాటు చేశారు. సాధారణంగా పంచాయతీ నిధులను తీసుకునేందుకు పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లకు టోకెన్ (కంప్యూటర్ సిగ్నేచర్) సిస్టం ఉండటంతో పాటు ఎంపీడీవో కూడా ఇవ్వాల్సి ఉంది. అయితే ఆ సమయంలో జిల్లావ్యాప్తంగా ఎంపీడీవోలు బదిలీలు కావడంతో టోకెన్ రాలేదు. నెల్లూరు, గుంటూరు జిల్లాల నుంచి అధికారులు వచ్చి బాధ్యతలు స్వీకరించిన పక్షంరోజుల తర్వాత వారికి టోకెన్ వచ్చింది. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఎస్ఐసీ ద్వారా ఆ ప్రక్రియను ఈనెల 15వతేదీ లోపు పూర్తిచేశారు. ఆయా మండలాల్లో ఆర్థికసంఘం నిధులను డ్రా చేసుకునేందుకు మండల స్థాయిలో టోకెన్ పూర్తయిన తర్వాత జిల్లా పరిషత్ సీఈవో టోకెన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సమయంలోనే సీఈఓను కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రస్తుతం ఇన్‌చార్జ్ సీఈఓను నియమించినా పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించలేదు. దాని కారణంగా ప్రస్తుతం ఇన్‌చార్జి సీఈవోకు టోకెన్ లేదు. దీని కారణంగా గ్రామ పంచాయతీల్లో నిధులు ఉన్నా డ్రా చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే గ్రామపంచాయతీల్లో ముందుస్తుగా పెట్టుబడులు పెట్టి చేసిన పలురకాల పనులకు బిల్లులు మంజూరుకు అవకాశం వచ్చినా ప్రస్తుత పరిస్థితుల కారణంగా నిధులు డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో సర్పంచ్‌లలో ఆందోళన నెలకొంది. నిధులను డ్రా చేసుకునేందుకు ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాతే అవకాశం ఉండటంతో అప్పటి వరకు పంచాయతీల్లో ఏదైనా అత్యవసర పనులు చేపట్టాలన్నా డబ్బులు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్థికసంఘం నిధులను డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పించాలని పాలక వర్గాలు కోరుతున్నాయి.

వైసీపీ నాయకుల కొత్త ఎత్తుగడ..

ఏడుగురు వలంటీర్ల రాజీనామా

జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న తొలగింపులు

అయినా వెనక్కి తగ్గని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు

ఒంగోలు మేయర్ తాయిలాలపై

తూతూమంత్రపు చర్యలు

ఏడుగురికే నోటీసులు..

అధికారులపై విమర్శల వెల్లువ

ఉల్లం'ఘను'లు

అధికారపార్టీకి కొందరు ప్రభుత్వ ఉద్యోగులు జీహుజూర్ అంటున్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పట్టించుకుంటున్న పరిస్థితి లేకుండా పోయింది. ప్రచారంలో పాల్గొనడమే కాకుండా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ప్రధానంగా వలంటీర్లు రెచ్చిపోతున్నారు. పార్టీ నాయకులతో కలిసి పర్యటించరాదని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలను లెక్క చేయడం లేదు. నిబంధనలు తమకు వర్తించవన్నట్లుగా అధికారపార్టీ కార్యక్రమాల్లో మునిగి తేలుతున్నారు. తాజాగా అక్కడక్కడ అధికారులు చర్యలు తీసుకుంటుండటంతో వారు రూటు మార్చారు. తమకు పోస్టులు అవసరం లేదంటూ రాజీనామా చేస్తున్నారు. అధికారం నాయకుల అండ ఉందనే ధీమాతో వారు అలా ప్రవర్తిస్తున్నారని తెలుస్తోంది. జిల్లాలోని పలుప్రాంతాల్లో అధికారపార్టీ నాయకులతో కలిసి పార్టీ కండువాలు వేసుకుని మరీ ప్రచారాల్లో పాల్గొంటున్నా వారిపై చర్యలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి.

మార్కాపురం రూరల్, మార్చి 23 : ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వైసీపీ అభ్యర్థులతో కలిసి వలంటీర్లు ప్రచారం చేస్తుండడంతో ఎన్నికల కమిషన్ కన్నెర్ర చేస్తోంది. వారిని విధుల నుంచి తొలగిస్తోంది. దీంతో ఎలాగైనా ఎన్నికలలో వారితో ప్రచారం చేయించాలనే ఆలోచనతో వైసీపీ నాయకులు కొత్త ఎత్తులు వేస్తున్నారు. ఉన్న వలంటీర్లతో రాజీనామా చేయిస్తున్నారు. అందులో భాగంగానే పట్టణంలో పనిచేస్తున్న ఏడుగురు వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. ఆ పత్రాలను మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కు కార్యాలయంలో అందజేశారు. తామంతా 'జగనన్న కోసం పనిచేసేందుకు రాజీనామా చేస్తున్నాం' అని ప్రకటించారు. వలంటీర్లుగా రాజీనామా చేసిన వారిలో పట్టణంలోని ఏడవ సచివాలయంలో పనిచేస్తున్న రాచకొండ రమణయ్య, ఎనిమిదవ సచివాలయంలో పనిచేస్తున్న షేక్ రఫీ, ఎం.రామిరెడ్డి, కేలం శివారెడ్డి, షేక్ ఇబ్రహీం, తొమ్మిదో సచివాలయంలో పనిచేస్తున్న బిలాల్ మసీద్, దుద్దుకూరి లక్ష్మీనారాయణలు తమ రాజీనామా పత్రాలను కమిషనర్‌కు అందజేశారు.

ప్రచారంలో పాల్గొన్న టెక్నికల్ అసిస్టెంట్ సస్పెండ్

మార్కాపురం పట్టణం కంభంరోడ్డులోని 25వ వార్డులో వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు పాల్గొన్న ప్రచార సభలో పాల్గొన్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ కుందురు అనిల్‌కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లుగా ఉన్న ఫోటోలు, వీడియోలు ఉన్న వివరాలను జిల్లా స్థాయి అధికారులకు, ఎన్నికల ప్రవర్తన నియామావళి అధికారులకు స్థానికులు పంపించారు. దీంతో వారి ఆదేశాల ప్రకారం అనిల్‌కుమార్‌రెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

ఇద్దరు వలంటీర్లు విధుల నుంచి తొలగింపు

తర్లుపాడు, మార్చి 23: మండలంలోని తాడివారిపల్లెలో వైసీపీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు ఆవులమంద వెంకటేశ్వర్లు, జమ్ముల బాబును విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఎవరైనా వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఎమ్మెల్యే అన్నా రాంబాబుపై కేసు నమోదు

పట్టణంలోని కంభం కూడలిలో నూతనంగా ప్రభుత్వం నిర్మిస్తున్న షాదీఖానా శ్లాబు పనుల ప్రారంభం కార్యక్రమంలో ఈనెల 17న పాల్గొన్న ఎమ్మెల్యే అన్నా రాంబాబుపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదైంది. నిబంధనలు ఉల్లంఘనకు సంబంధించి ఫొటోలు, వీడియోలు ద్వారా వివరాలను సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా పరిశీలించారు. ఆయన ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు.



వైసీపీ ప్రచారంలో పాల్గొన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ అనిల్ కుమార్

వీరు మారరంతే!

కొండను తవ్వి ఎలుకను పట్టారు..!

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన మేయర్‌పై చర్యలేవి?

సచివాలయ సెక్రటరీలకు బహుమతులపై ఈసీ సీరియస్

700 మందికిగాను ఏడుగురు సెక్రటరీలకే నోటీసులా?

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 23 : అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికల కమిషన్ ఆదేశాలను సైతం ధిక్కరించి మేయర్ గంగాడ సుజాత చేసిన పనికి ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన సచివాలయ సెక్రటరీలకు బలయ్యారు. ఈనెల 16న మధ్యాహ్నం నుంచి ఎన్నికల కోడ్ అమలులో వచ్చిన విషయం తెలిసిందే. అయితే అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఈ ఎన్నికల్లో గెలుపు కోసం వైసీపీ నేతలు బహుమతులు ఎరగా చూపి, ఇబ్బడిముబ్బడిగా పంచేశారు. ఒంగోలు నగరపరిధిలో 70 సచివాలయాలు ఉండగా, ఒక్కో సచివాలయంలో పది మంది సెక్రటరీలు పనిచేస్తున్నారు. వారంతా ప్రభుత్వ ఉద్యోగులే. సమావేశం పేరుతో మేయర్ ఇంటికి పిలిపించుకుని వైసీపీ కోసం పనిచేయాలని ఆదేశించారు. అనంతరం ఇటీవల ఇళ్లపట్టాల పంపిణీలో కష్టపడి పనిచేశారు.. అంటూ గిఫ్టులు ఇచ్చి మరీ పంపారు. అయితే అప్పటికే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ కథనాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దీనిపై ఎన్నికల కమిషన్ సీరియస్ కావడంతోపాటు జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న కలెక్టర్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మొత్తంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించిన అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకుండా కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉందని ప్రజలు నవ్వుకుంటున్నారు.

మిగిలిన వారిపై చర్యలేవి ?

సుమారు 700 మంది సెక్రటరీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. అయితే వారిలో అధికారులకు ఏడుగురు మాత్రమే బాధ్యులుగా కనిపించడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అందులో ఒకరు రెడ్డి సామాజికవర్గానికి చెందిన సెక్రటరీ ఉండగా, మిగిలిన ఆరుగురు ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన వారే. ప్రత్యేకించి కార్పొరేషన్ అధికారుల ఆదేశాల లేకుండా కనీసం ఇంటిపన్ను పేరు కూడా మార్చని సెక్రటరీలు సొంతంగా మేయర్ ఇంటికెళ్లి బహుమతులు తెచ్చుకునే సాహసం చేయరని ప్రజల నుంచి వినిపిస్తున్న మాట. అయితే కార్పొరేషన్ అధికారులు కేవలం ఏడుగురుపైనే చర్యలు తీసుకుంటుండగా, అసలు నిబంధనలు ఉల్లంఘించి మరీ ఇంటికి పిలిపించుకున్న మేయర్ గంగాడ సుజాతపై ఎన్నికల అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనకూడదని చెబుతున్న ఈసీ ప్రజాప్రతినిధులపైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే మొక్కుబడి చర్యలతో ముగించకుండా పూర్తిస్థాయిలో విచారణ చేసి అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజల నుంచి వినిపిస్తున్న మాట.



విజయవాడ ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం జరిగిన టీడీపీ ఎన్నికల వ్యూహం వర్క్‌షాపులో పాల్గొన్న ఉమ్మడి జిల్లా అభ్యర్థులు గొట్టిపాటి రవికుమార్, దామచర్ల జనార్దన్, ఎంఎం కొండయ్య, బీఎన్ విజయకుమార్ తదితరులు

పది పరీక్షలకు 99శాతం మంది హాజరు

ఒంగోలు(విద్య), మార్చి 23: జిల్లాలో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ఫిజికల్ సైన్స్(పీఎస్) పరీక్షకు 99శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 29,356 మంది హాజరు కావాల్సి ఉండగా 29,103 మంది హాజరు కాగా 253 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 1,112మందికిగాను 515 మంది హాజరు కాగా 597 మంది గైర్హాజరయ్యారు. కేవలం 46.31శాతం మంది మాత్రమే పరీక్ష రాశారు. 75 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. పరీక్షల రాష్ట్ర పరిశీలకులు ఎంఆర్.ప్రసన్నకుమార్ ఐదు కేంద్రాలను సందర్శించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 92 కేంద్రాలను తనిఖీ చేశారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఈఓ డి.సుభద్ర తెలిపారు.

సందట్లో సడేమియా!

రూ.10 కోట్లు విలువైన బండిదారి స్వాహా

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

కబ్జా చేసి ప్రహరీగోడలను నిర్మిస్తున్న అక్రమార్కులు

చోద్యం చూస్తున్న రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులు



బండిదారిలో సాగుతున్న అక్రమ నిర్మాణాలు

దర్శి, మార్చి 23: కోట్లాది రూపాయల విలువ చేసే బండిదారి స్థలం పూర్తిగా స్వాహా అవుతోంది. ఆ స్థలంలో యథేచ్ఛగా గృహాలు, ఇతర నిర్మాణాలను అక్రమంగా సాగిస్తున్నారు. కొంత మంది ఆలశ్యం చేస్తే స్థలం దొరకదనే ఉద్దేశంతో ఆక్రమించి చుట్టూ ప్రహరీగోడలను నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులు తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమార్కుల వద్ద లక్షలాది రూపాయలు ముడుపులు తీసుకొని వారికి సహకరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దర్శి - కురిచేడు రోడ్డులో 247, 248, 266 సర్వేనెంబర్లల్లో సుమారు పది ఎకరాల బండిదారి భూమి ఉంది. దర్శి నుంచి పడమర వైపున ఉన్న పొలాలకు వెళ్లేందుకు వీలుగా ఇతర అవసరాలను దృష్టిలో పెట్టుకొని సుమారు 120 అడుగుల వెడల్పులో కిలోమీటర్ దూరం బండిదారి కోసం స్థలాన్ని వదిలారు. గత కొంత కాలంగా ఆ స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. దర్శి పట్టణానికి సమీపంలో ఉండటంతో భారీగా విలువ పెరిగింది. దీంతో ముందుగానే ఒక కళాశాల యాజమాన్యం ఎకరానికి పైగా స్థలాన్ని ఆక్రమించి ప్రహరీగోడను నిర్మించుకొని కళాశాలలో కలుపుకున్నారు. అందులో షెడ్లను కూడా వేసి వాడుకుంటున్నారు. బండిదారికి ఇరువైపులా ఉన్న రైతులు కొంతమంది మరికొంత స్థలాన్ని ఆక్రమించి తమ పొలంలో కలుపుకున్నారు. ఇలా ఆక్రమణలో గతంలోనే సగానికిపైగా కనుమరుగైంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఆక్రమణలు మరింత పెరిగాయి. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఐదు ఎకరాల బండిదారి భూమిని అనేకమంది ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. రెండు నెలలుగా అక్రమ నిర్మాణాలు తారస్థాయికి చేరాయి. దొరికిన వారు దొరికినట్లు ఆక్రమించుకొని భద్రపరుచుకుంటున్నారు. కొంత మంది ఇళ్లను నిర్మిస్తుండగా, మరికొందరు ఆక్రమించిన స్థలం చుట్టూ ప్రహరీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రస్తుతం అక్కడ ఎకరం రూ.2కోట్లకు పైగా ధర పలుకుతుంది. ఈ లెక్కన రూ.10కోట్ల విలువైన బండిదారి స్థలం కొద్ది కాలంలోనే ఆక్రమణకు గురైంది. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాల్సిన నగర పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. బండిదారి ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై ఆంధ్రజ్యోతి రెవెన్యూ అధికారులను వివరణ కోరగా ఆ స్థలం దర్శి పట్టణ పరిధిలో ఉన్నందున నగర పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్తున్నారు. ఆక్రమణలపై నగర పంచాయతీ అధికారులను వివరణ కోరగా తమకు ఇప్పటి వరకు దర్శి పట్టణంలోని భూములు, స్థలాల వివరాలను రెవెన్యూ అధికారులు అందించలేదని అందువలన ఆ స్థలం ఏమిటో తెలియకపోవటం వలన ఏమీ చేయలేకపోతున్నామన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సి ఇరు శాఖల అధికారులు ఉద్దేశపూర్వకంగా పొంతన లేని సమాధానాలతో తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అక్రమణదారుల వద్ద ముడుపులు తీసుకొని వారికి సహకరిస్తూ ఇరువురు ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కొద్ది రోజులకు కోట్లాది రూపాయల విలువైన బండిదారి ఆక్రమణలు, అక్రమ కట్టడాలతో మాయమయ్యే పరిస్థితి నెలకొంటుంది. దిగువున ఉన్న పొలాల రైతులు బండిదారి పూర్తిగా ఆక్రమణలకు గురవుతుండడంతో భవిష్యత్‌లో దారి లేకుండా పోతుందని ఆందోళనలు చెందుతున్నారు. అనేకమంది రైతులు పలుమార్లు జిల్లా అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పటిష్ఠ చర్యలు తీసుకోలేదు. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పటిష్ఠ చర్యలు తీసుకొని బండిదారిని కాపాడాలని కోరుతున్నారు.

రేషన్.. రూటు మారే..

అక్రమ వ్యాపారంతో కోట్లు సంపాదన

బియ్యం అక్రమ రవాణాకు కేంద్రంగా ఒంగోలు

బహిరంగంగా తరలిస్తున్నా పట్టించుకోని వైనం

సొంత వాహనాలు కొనుగోలు చేసి తరలింపు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23 : రేషన్ బియ్యం అక్రమ రవాణాకు కొత్త ఎత్తుగడలతో అక్రమార్కులు రాత్రికి రాత్రే బియ్యాన్ని తరలిస్తున్నారు. ఒంగోలు కేంద్రంగా మిల్లులను అద్దెకు తీసుకొని వాటి ద్వారానే బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి లక్షలు సంపాదిస్తున్నారు. ఐదారు నెలల క్రితం జిల్లావ్యాప్తంగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బియ్యం అక్రమ నిల్వలపై దాడులు చేయడంతో కొంతమేర వ్యాపారం తగ్గించారు. అయితే ఇటీవల కొత్త పద్ధతులు మొదలుపెట్టారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు ఇప్పుడు మరింత రెచ్చిపోతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుండటంతో బహిరంగంగానే సేకరిస్తూ నిల్వలు పెడుతున్నారు. ఇందుకు అధికారపార్టీ నాయకుల అండదండలు భారీగా ఉన్నాయి. వారితో ఉన్న సనిహితాన్ని అడ్డం పెట్టుకుని రేషన్ బియ్యం కొనుగోలు నుంచి ఇతర ప్రాంతాలకు తరలించే వరకు అనుసరిస్తున్న విధానాలు ఎవరికి తెలియనీయడం లేదు. రేషన్ డీలర్ల వద్ద కిలో రూ.22కు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు నేరుగా మిల్లుకు తరలించి అక్కడ కిలో రూ.32కు విక్రయిస్తున్నారు. ఆ మిల్లులో గోతాలు మార్పు చేసి రాత్రికి రాత్రే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అందుకోసం కొంతమంది సొంతంగానే లారీలను ఏర్పాటు చేసి బియ్యాన్ని తరలిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 1వతేదీ నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులకు రేషన్ పంపిణీ ప్రక్రియ జరుగుతుంది. అయితే ఈ 15రోజుల్లోనే జిల్లావ్యాప్తంగా భారీ ఎత్తున అక్రమంగా రేషన్ తరలిపోతున్నా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ అక్రమ వ్యాపారం కోసం కొంతమంది లారీలే కొనుగోలు చేశారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒంగోలు నగరంలో ఈ అక్రమ వ్యాపారం చేస్తున్న అధికారపార్టీకి చెందిన నేతలు సుమారు డజను మందికిపైగా ఉన్నారు. వీరందరు ఏరియాల వారీగా ఎంపిక చేసుకొని డీలర్ల వద్ద నుంచి బియ్యం కొనుగోలు చేసి తమ మిల్లులకు తరలించి అక్కడి నుంచి లారీల్లో తరలిస్తున్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం...

కాగా రేషన్ వ్యాపారంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుండటంతో ఇష్టారీతిన డీలర్ల వద్ద నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి కోట్లు సంపాదిస్తున్నారు. అందుకు కొంతమంది అధికారులు, అధికార పార్టీ నాయకుల సహకారం ఉండటంతో ఈవ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. జిల్లాలో 1392 రేషన్ షాపుల పరిధిలో 6.60లక్షల కార్డులు ఉండగా అందు కోసం 10,444 మెట్రిక్ టన్నులు బియ్యాన్ని సరఫరా చేస్తోంది. ప్రస్తుతం ఇస్తున్న బియ్యాన్ని కార్డుదారులకు ఉచితంగా ఇస్తున్నారు. ముందుగానే రేషన్ డీలర్లతో ఒప్పందం చేసుకొని బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. కార్డుదారుల నుంచి ఎండీయూ ఆపరేటర్ల ద్వారా కిలో రూ.10కి కొనుగోలు చేసి అక్రమార్కులకు కిలో రూ.22 వరకు విక్రయిస్తున్నారు. అలా కిలోకు రూ.10కిపైగా డీలర్లకు ఆదాయం వస్తుండగా అక్రమ బియ్యం వ్యాపారులు అంతకు రెట్టింపుకు విక్రయిస్తూ కోట్లు గడిస్తున్నారు.



ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

ఇంటి ఋణాలు

రేకుల ఇల్లు / పెంకుల ఇల్లు / స్లాబ్ ఇల్లు / వ్యవసాయ ఋణాలు / ఖాళీ స్థలాలకు / OTS పట్టాలు / కడుతున్న ఇల్లు / కట్టిన ఇల్లు / మొ॥ వాటికి తక్కువ వడ్డీకి ఇప్పించబడును. 18సం॥ సర్వీస్ ఇస్తున్నాం. సంప్ర॥ 9502466253

AJO-183708

స్థలం అమ్మబడును

చీరాల, రంగారెడ్డినగర్, రంగారెడ్డి గారి ఇంటి వెనుక 135.29చ.మీ., 40.9 X 36 కొలతలు కలిగిన స్థలం (దక్షిణం, పడమర రోడ్డు) అమ్మకు కలదు. సంప్రదించండి. నో బ్రోకర్స్, డైరెక్ట్ - Contact : 9491785306

AJO-183578

హౌసింగ్ లోన్స్

మార్టిగేజ్ లోన్, బిజినెస్ టేకోవర్, రేకుల షెడ్డు, పర్సనల్, సింగిల్ డాక్యుమెంట్స్‌పై లోన్స్ R.R. అసోసియేట్స్ లోన్స్ & కన్సల్టెన్సీ, ఒంగోలు, సెల్: 9491295153, 9440873153

AJO-183854

WANTED

ఒంగోలు లోని ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (PRO's) కావలెను. Age: 21-35 Yrs. అనుభవంను బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: సెల్: 87121 64111.

AJO-198

BUILDING FOR RENT / SALE

ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ ఎదురు, రామ్‌నగర్, 6వ లైను, N.R.K.M లాడ్జి ప్రక్కన, 5అంతస్తుల బిల్డింగ్ (40X80 RCC) కొలతలతో అద్దె / అమ్మకానికి కలదు. సెల్: 9866659049, 7013261494

AJO-151047

EDUCATION

Join by 25th BA Rs 5500, B.Com 6k B.Sc 10k, PG Arts 8K, yearly in Distance at PLNM Degree College, 9177408565, 9642656449, MBA 16k, MCA 20k Sem.

AJG-184906

అమ్మబడును

నెల్లూరు జిల్లా, కందుకూరు టౌన్‌లో రూ.30,000/-లు అద్దె వచ్చు ఇల్లు అమ్మబడును మరియు ఇంటి స్థలం గది రూ.25,000/-కు కలదు. నూతన బైపాస్ ప్రక్కన ప్లాట్లు, పొలము అమ్మబడును, కొనబడును. సంప్ర॥ 97042 50705

AJO-183696

రియల్ ఎస్టేట్

గుంటూరు సిటీకి అతి సమీపంలో లాం గ్రామం నందు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దగ్గర సువర్ణ కుటీర్ డెవలపర్స్ వారి 18వ CRDA అప్రూవుడ్ వెంచర్ చ.గ 10,000 మాత్రమే. బ్యాంకు లోను, 20%+తో బై బ్యాక్ సౌకర్యం కలదు. సంప్ర॥ 88868 55355, 88863 55955

AJG-184754

రియల్ ఎస్టేట్

గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, రెడ్డిపాలెం, వెనిగండ్ల, అగతవరప్పాడు, పెదకాకాని, కొప్పురావూరు, నంబూరు, కంతేరు, కాజా మరెక్కడైనా ప్లాట్లు అ/కొ. సంప్ర॥ జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత. ఫోన్ : 73823 96677

AJG-700

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్థంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888

చీమకుర్తి : 96525 55752

చీరాల : 99859 21376

మార్కాపురం : 99859 21358

కందుకూరు : 97036 18697

కనిగిరి : 99854 11483

గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥

Asst-Cir-Manager. 9985411484

శింగరకొండలో వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభం

అద్దంకి, మార్చి 23: శింగరకొండ లక్ష్మీనరసింహ స్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 69వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీప స్థాపన, మండపారాధన జరిగింది. ధ్వజస్తంభ నిర్మాణదాత, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మేదరమెట్ల శంకరారెడ్డి, ఈవో సుభద్ర జీవధ్వజ పూజ, ఉష్ట్ర పతాక పూజ, ధ్వజారోహణ నిర్వహించారు. మేదరమెట్ల రాజశేఖరరెడ్డి, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు. భజన, మహిరావణ చరిత్ర తోలుబొమ్మలాట, కోలాట ప్రదర్శనం విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గజవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. ఏర్పాట్లను ఫెస్టివల్ ఆఫీసర్ తిమ్మనాయుడు, ఈవో సుభద్ర పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, బిందె తీర్థం, విశేష అభిషేకం జరగనున్నాయి. రుత్వికులచే మహన్యాస పూర్వక ఏకాదశ మన్యుసూక్త వారాభిషేక, సుందరకాండ పారాయణ, సూర్య నమస్కారాలు, సప్తశతి పారాయణ, పంచామృతాలు, దశ విధ ద్రవ్యాలచే విశేష అభిషేకం, విశేష అలంకరణ నిర్వహించనున్నారు. లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద పాలకమండలి చైర్మన్ నర్రావుల ఏడుకొండలు, ఈవో కోటిరెడ్డి ధ్వజస్తంభ పూజ, పతాక పూజలు నిర్వహించారు. ప్రధాన తిరుణాళ్ల సోమవారం జరగనుంది.


ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

ట్రాఫిక్ మళ్లింపుపై ప్రత్యేక దృష్టి

అద్దంకి, మార్చి 23: శింగరకొండ 69వ వార్షిక తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ తెలిపారు. శింగరకొండ తిరుణాళ్ళ ట్రాఫిక్ మళ్లింపుపై శనివారం ఆయన పరిశీలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ ప్రభల నిర్వాహకులతో చర్చించారు. ఎన్నికల కోడ్ అములులో ఉన్నందున ఇతరులను కించ పరిచేవిధంగా, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయరాదన్నారు. రాజకీయపార్టీల జెండాలు, గుర్తులు ప్రదర్శించరాదన్నారు. అసభ్యకరమైన నృత్య ప్రదర్శనలు నిర్వహించరాదని చెప్పారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతి భద్రతలకు భంగం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శింగరకొండ దేవాలయాల పరిసరాలు, ప్రవేశ మార్గాలు, ప్రభలు ఉంచే ప్రదేశాలను అడిషనల్ ఎస్పీ పరిశీలించారు. తిరునాళ్లకు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపునకు సంబంధించి పోలీస్ అధికారులతో చర్చించారు. తిరునాళ్లకు సుమారు 750 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్టు చెప్పారు. సోమవారం ట్రాఫిక్ మళ్లిస్తున్నట్టు తెలిపారు. ఒంగోలు వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను మేదరమెట్ల నుంచి చిలకలూరిపేట మీదుగా నర్సరావుపేట వైపు, హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను సంతమాగులూరు అడ్డరోడ్డు నుంచి నర్సరావుపేట, చిలకలూరిపేట, మేదరమెట్ల మీదుగా మళ్లిస్తున్నట్టు చెప్పారు.

కడప వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు పొదిలి, ఒంగోలు మీదుగా మళ్లిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న నర్రావుల కొండలు, ఈవో కోటిరెడ్డి


ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ధ్వజస్తంభం వద్ద ఉష్ట్ర పతాక పూజ, ధ్వజారోహణ చేస్తున్న మేదరమెట్ల శంకరరెడ్డి, ఈవో సుభద్ర


వృద్ధుడిపై ఎస్ఐ దాడిచేసిన సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

వృద్ధుడిపై ఎస్ఐ దాడి ఘటనపై డీఎస్పీ విచారణ

బల్లికురవ, మార్చి 23: బల్లికురవలో వృద్ధుడు హనుమంతరావుపై ఎస్ఐ నాగశివారెడ్డి దాడి చేసిన సంఘటనపై బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ శనివారం రాత్రి విచారణ చేపట్టారు. నాలుగు రోజుల క్రితం బల్లికురవలో బడ్డీ బంకులో ఉన్న వృద్ధుడు శానంపూడి హనుమంతరావుపై ఎస్ఐ దాడిచేసి మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు కేసు నమోదు చేశారు. ఈ దాడిలో అస్వస్థతకు గురైన వృద్ధుడు ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో చేరి అక్కడనుంచి ఎస్ఐ నాగశివారెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను అకారణంగా కొట్టి తన వద్ద మద్యం సీసాలు లేకపోయినా, ఉన్నట్లు కేసు పెట్టారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఇదే విషయమై ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. దీంతో బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, సంతమాగులూరు సీఐ నరసింహారావులు శనివారం రాత్రి సంఘటన జరిగిన ప్రదేశం తోపాటు వృద్ధుడు నివాసం ఉంటున్న ఇంటి వద్ద విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధుడి మనుమరాలు దుర్గ విచారణకు వచ్చిన డీఎస్పీతో తాము టీడీపీ సానుభూతిపరులమని, తమపై కక్ష కట్టి తమ దుకాణంలో ఎస్ఐ తరచూ తనఖీలు చేస్తున్నారని చెప్పారు. ప్రయివేట్ వ్యక్తులను తీసుకువచ్చి తనిఖీ చేస్తున్నారని తెలిపారు. తమ దుకాణంలో మద్యం దొరకలేదని చెప్పారు. తమ వద్ద ఉన్న సీసీ పుటేజీను కూడా పరిశీలించాలని కోరారు. వృద్ధుడు హనుమంతరావు మాట్లాడుతూ ఎస్ఐ అకారణంగా కొట్టి జీపులో స్టేషన్‌కు తీసుకువెళ్ళారని తెలిపారు. తాను ఎలాంటి మద్యం అమ్మకాలు చేపట్టలేదని, తనపై అక్రమంగా కేసు బనాయించారని డీఎస్పీతో తెలిపారు.

గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు


పెదగంజాం గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

చినగంజాం, మార్చి 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో కేంద్ర బలగాలు, పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. ఎస్ఐ ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెదగంజాం, రాజుబంగారుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజుబంగారుపాలెం, కుక్కలవారిపాలెం గ్రామాల్లో కేంద్ర బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఘర్షణలు, అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి, మార్చి 23: మద్యం తీసుకువెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 30 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. శింగరకొండపాలెంకు చెందిన గోవిందు అద్దంకి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం రాత్రి 30 మద్యం బాటిళ్లతో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకొని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఎమ్మెల్యే స్వామి మాతృమూర్తి మృతికి రవికుమార్ సంతాపం

అద్దంకి, మార్చి 23: కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాతృమూర్తి సుబ్బమ్మ మృతి పట్ల అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే స్వామికి రవికుమార్ ఫోన్ చేసి మాట్లాడారు.

ఈవీఎంల భద్రతకు పటిష్ఠమైన చర్యలు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ల భద్రతకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాడ్స్ భద్రపర్చిన సీల్స్‌ను తనిఖీ చేశారు. కంట్రోలు యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. అక్కడ అమర్చిన సీసీకెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాడ్స్ గోడౌన్‌ను పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు నివేదికను పంపనున్నట్లు తెలిపారు. ఒకేసారి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నందున అవసరమైన వీవీప్యాడ్లు, కంట్రోలు యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డీఎస్.క్రాంతికుమార్, కాలేషాబేగ్, రసూల్, ఎస్‌డీ.హనీఫ్, డి.యుగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇసుక రవాణాదారుల నుంచి వసూళ్లు

- మూడు రోజుల నుంచి తెరలేపిన ఎస్ఈబీ అధికారులు


గుండ్లకమ్మ నదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు

అద్దంకి, మార్చి 23: గుండ్లకమ్మ నదిలో ఇసుక రవాణాపై ఒకవైపు సీన రేజ్ వసూళ్లు జరుగుతుండగా, మరోవైపు ఎస్ఈబీ అధికారులు వసూళ్లపర్వం కొనసాగిస్తున్నారు. గుండ్లకమ్మ నదిలో అద్దంకి ప్రాంతంలో ఎలాంటి అధికారిక ఇసుక రీచ్ లేదు. అయినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఇసుక సీనరేజ్ వసూళ్ల కాంట్రాక్ట్ దక్కించుకున్న కార్పొరేట్ సంస్థలు గత నాలు గేళ్లుగా అనధికారికంగా సీనరేజ్ వసూళ్లు చేస్తూనే ఉన్నారు. మధ్యలో కొంతకాలం సీనరేజ్ వసూలు నిలిపి వేయటంతో పాటు ఇసుక రవాణా జరగకుండా అడ్డుకున్నారు.

అయితే, గత నెల రోజులుగా మరలా ఇసుక రవాణా పునఃప్రారంభమైంది. ఇసుక సీనరేజ్ రూపేణ ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1400 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు గత రెండు మూడు రోజులుగా ఎస్ఈబీ అధికారులు రంగప్రవేశం చేసి ఇసుక రవాణాదారుల నుంచి వసూళ్లపర్వానికి తెరలేపారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3 వేల నుంచి రూ.7 వేల వరకు వసూళ్లు చేస్తున్నారు. రోజుకు సరాసరిన అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుంచి సుమారు వంద ట్రాక్టర్‌ల ఇసుక రవాణా జరుగుతుంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత కొంత మంది ఇసుక రవాణాదారులు సీనరేజ్ బిల్లులు చెల్లించకుండానే వెళ్తున్నట్లు తెలుస్తుంది. ఈనేపథ్యంలో ఎస్ఈబీ అధికారులు వసూళ్లపర్వానికి తెరలేపినట్లు విమర్శలు వస్తున్నాయి. వచ్చిన కాడికి దండుకొని జేబులలో వేసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఎస్ఈబీ అధికారులు దందాకు తెరలేపటం మరింత విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ సీనరేజ్ వసూలు అరికట్టడంతో పాటు, ఎస్ఈబీ అధికారుల వసూళ్లపర్వానికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీందర్


రాజకీయ పార్టీ నేతలకు సూచనలు చేస్తున్న ఆర్వో రవీందర్

పర్చూరు, మార్చి 23: మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ర్యాలీలు, పార్టీ కార్యాలయాలు ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నేతలు, అధికారులతో ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన అంశాలు, జాగ్రత్తలు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలకనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూలు తేదీ నుంచే కోడ్ అమల్లో ఉందని చెప్పారు. అనుమతులకు వివిధ యాప్‌ల ద్వారా గానీ, ఆర్వో ఆఫీసు ద్వారా కాని 24 గంటల వ్యవధిలోనే అనుమతులు పొందవచ్చునని చెప్పారు. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలన్నారు. విధి నిర్వహణలో అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు.

సమావేశంలో పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు, ఇంకొల్లు, చిన్నగంజాం తహసీల్దార్‌లు సీహెచ్ సుబ్బయ్య, కె.సంధ్య, వై.నాగరాజు, మోహర్‌బాబు, ఎం.ప్రమీల, జీవీఎస్ ఫణీంద్రబాబు, ఎంపీడీవోలు నితిన్, శ్రీదేవి, శ్రీనివాసరెడ్డి, వరప్రసాద్, ఆయా రాజకీయ పార్టీల నేతలు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ పోలీసుల అదుపులో గ్రానైట్ లారీలు


ఇటీవల మార్టూరు పోలీసులకు పట్టుబడిన గ్రానైట్ శ్లాబుల లారీలు (ఫైల్)

మార్టూరు, మార్చి 23: మార్టూరు ప్రాంతం నుంచి తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలుతున్న ఎలాంటి బిల్లులు లేని గ్రానైట్ శ్లాబుల లారీలను తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. శుక్రవారం అర్ధరాత్రి, శనివారం వేకువ జామున వీటిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దాదాపుగా పదికి పైగా గ్రానైట్‌శ్లాబుల లారీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇంకా అదనంగా లారీలు ఉండవచ్చునని సమాచారం. నల్గొండ జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా చేపట్టిన తనిఖీలలో భాగంగా లారీలను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వాటిలో మార్టూరు, బల్లికురవ మండలాలకు చెందిన గ్రానైట్ పరిశ్రమల నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా ఇతర రాష్ట్రాలకు గ్రానైట్ అక్రమార్కులు తరలించే లా రీలు ఉన్నట్లు తెలిసింది.

మార్టూరు, బల్లికురవ ప్రాంతాల నుంచి గ్రానైట్ అక్రమ రవాణా చేసేవారు ఆరితేరి పోయారు. రోజూవారీ, నెలవారీ జీతాలకు పనిచేసే వారు కొంతమంది గ్రానైట్ అక్రమ మార్గంలో రవాణా చేస్తూ కోట్లాది రూపాయలను సంపాదించిన వారు మార్టూరులో స్థిర నివాసంగా ఉంటున్నారు. వారిపై గతంలో ఈ గ్రానైట్ అక్రమ రవాణాకు సంబంధించి మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌లలో కేసులు కూడా ఉన్నాయి. వారందరూ పర్చూరు నియోజకవర్గం వైసీపీ సమన్వయ కర్తగా పనిచేసి, ఇటీవల నియోజకవర్గం నుంచి వెళ్లిపోయిన నాయకుడి అనుచరుల కనుసన్నల్లో. వారి అండదండలతో నిరాటంకంగా గ్రానైట్ అక్రమ రవాణాను కొనసాగిస్తూ లక్షలాది రూపాయలను సంపాదించారు. అయితే, నియోజకవర్గ సమన్వయ కర్త మారిన తర్వాత గ్రానైట్ అక్రమార్కులు కొంత పంథాను అనుసరించారు. గ్రానైట్ అక్రమ రవాణాను నిర్భయంగా కొనసాగిస్తున్నారు.

అయితే, ఇటీవల స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర రెడ్డి మార్టూరులోనే రెండు గ్రానైట్ అక్రమ శ్లాబుల లారీలను అదుపులోకి తీసుకున్నారు. అయినా గ్రానైట్ అక్రమార్కులు మరింతగా అక్రమ రవాణాలో మునిగిపోయారు. ఈనేథ్యంలో తెలంగాణ పోలీసులు ఈ ప్రాంతానికి చెందిన లారీలను అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న పదికిపైగా గ్రానైట్ శ్లాబుల లారీలను అదుపులోకి తీసుకున్నారన్న సంఘటన అక్రమార్కుల్లో గుబులు రేపింది.

కదలని అక్రమ శ్లాబుల లారీలు

తెలంగాణా పోలీసులు మార్టూరు ప్రాంతం నుంచి తెలంగాణకు, ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ శ్లాబుల లారీలను పట్టుకున్నారన్న వార్తతో అక్రమ వ్యాపారులు సందిగ్ధంలో పడిపోయారు. ఏడాదికిపైగా అక్రమ వ్యాపారం చేసినవారు తెలంగాణ పోలీసుల వైఖరితో ఏంచేయాలో మదనపడుతున్నారు. దాంతో రోజూ 40 నుంచి 60 దాకా ఈప్రాంతం నుంచి అక్రమ గ్రానైట్ శ్లాబులను ఇతర రాష్ట్రాలకు తరలించే వ్యాపారులు శనివారం ఒక లారీని కూడా ఈ ప్రాంతం నుండి బయటకు పంపించడానికి సాహసం చేయలేకపోయారు. మన రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రం దాటించడానికి ఒక లారీకి రూ.20 వేల నుంచి రూ.25 వేలు దాకా మామూళ్లు ద్వారా ఖర్చుపెట్టే అక్రమ వ్యాపారులు తెలంగాణలో శుక్రవారం బ్రేక్ పడటంతో ప్రత్యామ్నాయదారులు వైపు తెలంగాణకు పరుగెత్తారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ అక్రమ వ్యాపారంలో యువకులు ఆరితేరిపోయారు. తెలంగాణ పోలీసులు గ్రానైట్ లారీలను అదుపులోకి తీసుకోవడం ఇది తొలిసారి కావడం విశేషం. ఈ ఉదంతంతోనైనా మన పరిదిలో మైనింగ్, విజిలెన్స్ అధికారులు గ్రానైట్ అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతారో లేదో వేచి చూడాల్సిందే.

వేధిస్తున్న కూలీల కొరత

- ఊపందుకున్న మిర్చి కోతలు
- పెరిగిన పెట్టుబడులు
- ఆశాజనకంగా లేని ధరలతో రైతుల ఆందోళన


మిరప కాయలను గ్రేడు చేస్తున్న కూలీలు

చీరాల, మార్చి 23: పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో మిరప కోతలు ఊపందుకున్నాయి. దీంతో కూలీల కొరత వెంటాడుతోందని రైతులు అంటున్నారు. ఎండల తీవ్రతతో మిరప కోతలు సక్రమంగా సాగటం లేదు. ఇక కళ్లాల్లో ఉన్న ఆరబెట్టిన మిరపను గ్రేడు చేసేందుకు మనుషులు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉంటే మిరప ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రోజువారీ కూలీలకు కూలి చెల్లించాలంటే చేతిలో తగినంత ఆర్థిక వెసులుబాటు లేక ముందస్తుగా వచ్చిన పంటను అయినకాడికి తెగనమ్ముకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి, మార్టూరు మండలాల పరిధిలోని మిరిప సాగుదారులు మిరప ధర తగ్గటం పట్ల ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు నియంత్రిస్తున్నారని వాపోతున్నారు. కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉంచుదామంటే గిట్టుబాటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. దీంతో ప్రధానంగా కౌలుదారులు ఏరోజుకారోజు కూలీలకు కూలి చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నారు. కొందరు వారాంతపు బట్వాడాకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. అయితే, ఏరోజుకారోజు డబ్బు ఇచ్చేవారికన్నా వారంతపు చెల్లింపు వారికి కొంత అధిక మొత్తం చెల్లించాల్సి వస్తుందంటున్నారు.

ఇదిలాఉంటే స్థానికంగా కూలీలు సరిపడా దొరకని వారు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను పిలుచుకుంటున్నారు. దీంతో వారి రాకపోకలకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. ఈక్రమంలో కూలీలు కొంతమేర ఆగినా ప్రతిరోజు వాహనాల(ఆటో) బాడుగ చెల్లించాల్సిన పరిస్థితి. ఈ ఏడాది పెట్టుబడులు అంచనాలను మించి అవుతున్నాయని చెప్తున్నారు. ఈక్రమంలో గిట్టుబాటు ధర ఉంటే తప్ప నష్టాలు మూటగట్టుకేనే పరిస్థితేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమరవీరులకు నివాళులు

అద్దంకిటౌన్, మార్చి 22: అద్దంకి పట్టణ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం అమరవీరులకు నివాళులర్పించారు. భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ చిత్రపటాలకు ప్రజాసంఘాల సభ్యులు నివాళులర్పించారు. చిన్న వయసులోనే జీవితసుఖాలను పక్కనపెట్టి భారతదేశ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్రాల కోసం ప్రాణాలర్పించిన విప్లవవీరులు అని కొనియాడారు. కార్యక్రమంలో మనం త్రిమూర్తులు, అన్నమనేని వెంకట్రావు, జ్యోతి చంద్రమౌళి, చెన్నుపాటి రామాంజనేయులు, పీసీహెచ్ కోటయ్య తాళ్ళూరి బాబురావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: భగత్ సింగ్ 93వ వర్ధంతిని శనివారం మార్టూరులోని గన్నవరం రోడ్డులో సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహమ్మద్ బాషా, సుజాత, ఉప్పలపాటి అచ్యుతరామరాజు, సాయిబాబా, ఖాజా, పఠాన్ బాబు, క్రాంతి సీమ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పంగులూరు, మార్చి 23: పౌష్టికాహారంతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ అన్నారు. పోషణ్ పఖ్వాడ్ కార్యక్రమంలో భాగంగా పంగులూరులో పాఠశాలల విద్యార్థులకు ఆయుర్వేద వైద్యులు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్, శీతల పానీయాల వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లలితకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త సరోజిని, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను హత్యచేసిన భర్త అరెస్ట్

చీరాలటౌన్, మార్చి 23: వేటపాలెం మండల పరిధిలోని రోశయ్య కాలనీకి చెందిన దేవర లక్ష్మీ(35)ని హత్యచేసిన కేసులో భర్త లక్ష్మీనారాయణను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న వీరికి ఇద్దరు సంతానం. భార్యపై అనుమానం వ్యక్తం చేస్తుండటంతో కుటుంబంలో వివాదాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో పథకం ప్రకారం గత బుధవారం గ్రామ శివారు ప్రాంతంలోని పొలాల్లోకి భార్యను తీసుకెళ్లి హతమార్చి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న టూటౌన్ పోలీసులు సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

గోశాలలో గోమాతలకు సీమంతం


గోమాతకు పూజలు చేస్తున్న మహిళలు

మార్టూరు, మార్చి 23: మార్టూరులోని శ్రీకృష్ణ పిరమిడ్ గోసంరక్షణ సేవా సమితిలో శనివారం మహిళలు గోమాతలకు సీమంతం నిర్వహించారు. సేవా సమితి 12వ వార్షికోత్సవం సందర్భంగా గణపతిపూజ, శ్రీకృష్ణ పూజలు, కుంకుమార్చన, గోవులకు సీమంతం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవిఘ్నేశ్వర లక్ష్మీదేవి సమేత శ్రీవేణుగోపాలస్వామి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంత రం భక్తులకు అన్న సమారాదన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సెయింట్ ఆన్స్‌లో వర్క్‌షాప్

చీరాల, మార్చి 23: సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏడు రోజుల వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు శనివారం తెలిపారు. వర్క్‌షాప్ ఉపయోగాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపారావు వివరించారు. కార్యక్రమలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28 మందిపై బైండోవర్ కేసులు నమోదు

బల్లికురవ, మార్చి 23: రానున్న ఎన్నికలలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా మండలంలోని పలుగ్రామాలకు చెందిన టీడీపీ, వైసీపీ నేతలపై బైండోవర్ కేసులు నమోదు చేసిన్నట్లు తహసీల్దార్ సుభద్ర తెలిపారు. మండలంలోని వేమవరం, ఉప్పుమాగులూరు, కొప్పెరపాడు, చెన్నుపల్లి గ్రామాలకు చెందిన 28 మందిని పోలీసులు గుర్తించి వారిపై ముందస్తు బైండోవర్ కేసులకు తీసుకు రాగా కేసులు నమోదు చేసిన్నట్లు తహసీల్దార్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుల మధ్య ఘర్షణ

బల్లికురవ, మార్చి 23: మండలంలోని వేమవరం నాలుగ రోడ్ల కూడలిలో శనివారం మద్యం మత్తులో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వీరిద్దరికి గాయాలు కావటంతో వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సకు వెళ్లారు. అందిన సమాచారం మేరకు.. ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన పిన్నిటి నాగరాజు, సోమవరప్పాడుకు కొండవర్థు గోపిరాజులు వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం ఎదురుగా ఉన్న హోటల్‌లో మద్యం తాగుతున్నారు. ఈక్రమంలో గోపిరాజు సెల్‌ఫోన్‌లో జగన్ పాటలు పెద్దగా పెట్టటంతో పక్కనే మద్యం సేవిస్తున్న నాగరాజు పాటల సౌండ్ తగ్గించాలని అనటంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఒకరికొకరు కూర్చున్న కుర్చీలతో దాడి చేసుకొన్నారు. ఈఘటనలో గోపిరాజు తలకు గాయాలు అయ్యాయి. నాగరాజుకు శరీరంపై రక్త గాయాలు అయ్యాయి. వెంటనే గోపిరాజు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లగా, నాగరాజు మార్టురు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాడు. ఘటన జరిగిన వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో బల్లికురవ పోలీసులు విచారణ చేపట్టారు. వైద్యశాలల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు కానున్నాయి.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



స్వామిత్ సర్వే జరిగిన ప్రదేశాలను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ కన్నబాబు

యద్దనపూడి (వ నా ర బ్బా ర ు), మార్చి 23: ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సరైన వసతులు కల్పించాలని పంచాయతీరాజ్ కమిషనర్, స్వామిత్ స్పెషల్ ఆఫీసర్ కన్నబాబు అన్నారు. శనివారం యద్దనపూడి మండలం చిలుకూరివారిపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పనులు చేస్తున్న కూలీలకు ఏర్పాటుచేసిన వసతులను పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీఎం రమేష్‌కు పలు సూచనలు చేశారు. తొలుత గ్రామంలో స్వామిత్ సర్వే జరిగిన వాటిని కన్నబాబు పరిశీలించారు. కార్యక్రమంలో డీపీవో రవికుమార్, డీఎల్‌పీవో హనుమంతరావు, డ్వామా పీడీ రాజేష్, ఎంపీడీవో శివసుబ్రమణ్యం, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో పూరిల్లు దగ్ధం

దేవరపల్లి(పర్చూరు), మార్చి 23: పర్చూరు మండలం దేవరపల్లిలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామాలనికి చెందిన జూపూడి రోశయ్యకు చెందిన పూరిల్లుతోపాటు అందులో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో చుట్టపక్కల వారు ఆర్పేప్రయత్నం చేశారు. మంటలు అదుపు కాకపోవటంతో చీరాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ1.5 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయం తెలియాల్సి ఉంది.

ఆదరించండి.. అందరివాడిగా సేవచేస్తా!


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, మార్చి 23: వచ్చే ఎన్నికల్లో చీరాల నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న తనను ఆదరించాలని ఎంఎం కొండయ్య అన్నారు. అందరికి అందుబాటులో ఉంటూ అందరివాడిగా సేవచేస్తానని చెప్పారు. స్థానిక బాబా రైస్ మిల్లులో శనివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



సోమశిలలో 11.080 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మార్చి 23: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి ప్రాజెక్టులో 11.080 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 50, డెల్టాకు 1500, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రంజాన్ వేళలు ఇఫ్తార్ (ఆదివారం) : 6.22 | సహరి (సోమవారం) : 4.52

ఉష్ణోగ్రతలు నెల్లూరు : 35.2 25.5 | కావలి : 35.0 25.0 | కందుకూరు : 34.0 26.0 | ఆత్మకూరు : 38.0 25.0 | ఉదయగిరి : 34.0 22.0



ఆట మొదలైంది!

- జిల్లావాసులకు డబుల్ ధమాకా! ● ఒకటి ఐపీఎల్.. ఇంకొకటి పొలిటికల్ ● జట్ల గెలుపుపై అభిమానుల్లో ఉత్కంఠ


నెల్లూరు, మార్చి 23 **(ఆంధ్రజ్యోతి) :** మండు వేసవిలో రాజకీయ, క్రీడాభిమానులకు ఉత్కంఠ రేపే సీజన్ ఆరంభమైంది. కుర్రకారును ఉర్రూతలూగించే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టీ-20 క్రికెట్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. సాధారణ పరిస్థితుల్లో అయితే చిన్నపెద్ద తేడా లేకుండా అన్ని వయసుల వారిలో ఉత్కంఠ రేపేది. అయితే, ఇప్పుడు అంతకు మించిన పొలిటికల్ ఫీవర్ వచ్చేసింది. ఎన్నికల బరిలో నిలిచే రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు శుక్రవారం నాటితో ఖరారయ్యారు. దీంతో పొలిటికల్ హీట్ పెరిగింది. ఐపీఎల్‌కు పొలిటికల్ ఫీవర్‌కు చాలా తేడా ఉంది. ఐపీఎల్ మ్యాచ్‌లు దేశంలోని ప్రధాన నగరాల్లోని మైదానాల్లోనే జరుగుతాయి. కానీ పొలిటికల్ మ్యాచ్ జిల్లాలోని సందుగొందుల్లోనూ జరుగుతుంది. ఐపీఎల్ మ్యాచ్ రోజులో ఒక నిర్దిష్ట సమయంలోనే జరుగుతుంది. అది కూడా మూడు గంటల సేపే. శని, ఆదివారాల్లో మాత్రం రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. మిగిలిన రోజుల్లో సాయంత్రం 4 గంటలకు మాత్రమే మ్యాచ్ జరుగుతుంది. పరిమిత ఓవర్లు.. నిర్దీత కాలం.. ఇది ఐపీఎల్ ఆట సమయం. ఈ మూడు గంటలు మాత్రమే క్రీడాభిమానుల్లో ఉత్కంఠ ఉంటుంది. కానీ పొలిటికల్ గేమ్ అలా కాదు. పగలు రేయి అన్న తేడా లేదు. 24 గంటలూ సాగుతూనే ఉంటుంది. నిమిషానికో విశేషం, గంటకో సంఘటనతో ఉత్కంఠ రేపుతూనే ఉంటుంది. ఐపీఎల్ మ్యాచ్ క్రీడాకారులకు ఆదాయం వస్తుంది. కానీ ఎన్నికల బరిలో తలపడుతున్న రాజకీయ క్రీడాకారులకు చేతి చిలుము వదులుతుంది. అయితే రాజకీయ క్రీడాకారులను ఎంకరేజ్ చేసే ప్రేక్షకులకు మాత్రం ఎంతో కొంత గిట్టుబాటు అవుతుంది. ఇక ఎక్కడో జరిగే ఐపీఎల్ జట్ల గురించి అందులోని ఆటగాళ్ల గురించి, వారి ఆట తీరు గురించి ఏడాదిలో ఎన్నోసార్లు ప్రజలు చూసే ఉంటారు. అయితే ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికల జట్ల క్రీడాకారులు, వారి ఆటతీరులో ఎప్పటికప్పుడు మార్పులు ఉండనే ఉంటాయి. ఈ క్రమంలో జరగనున్న ఎన్నికల సంగ్రామానికి ప్రధాన రాజకీయ పార్టీలు తమ పార్టీల జట్టు సభ్యులను ప్రకటించాయి. తెలుగుదేశం, జనసేన, బీజేపీలు ఉమ్మడిగా బరిలోకి దిగుతుండగా, అధికార వైసీపీ ఒంటరి పోరుకు సిద్ధమైంది.

● ఉమ్మడిగా..

సార్వత్రిక ఎన్నికల మ్యాచ్‌లో టీడీపీ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బలమైన జట్టును రంగంలోకి దించింది. ఒక పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 9 మంది క్రీడాకారుల్లో ఆరుగురిని కొత్తగా రంగంలోకి దించింది. ఈసారి జట్టు సభ్యులు అలసిపోకుండా, రాజకీయ అభిమానులు నిరుత్సాహపడకుండా అన్ని విధాలా అండగా ఉండే ఇద్దరు బలమైన అభ్యర్థులను బరిలోకి దించింది. అపార అనుభవజ్ఞులతో పాటు యువరక్తానికి అవకాశం ఇచ్చింది. మహిళలకు సముచిత స్థానం కల్పించింది. జట్టు సారథిగా నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్ని నియోజకవర్గాలను కలియతిరుగుతూ జట్టు సభ్యులను సమన్వయం చేసుకొంటూ ముందుకు కదులుతున్నారు. టీడీపీ జట్టుపై ప్రేక్షకుల అంచనాలు ఇలా ఉన్నాయి. టీం మేనేజర్, స్ట్రైకింగ్ బ్యాట్స్‌మన్‌గా పొంగూరు నారాయణ స్కోరు మీద ప్రజల అంచనాలు బలంగా ఉన్నాయి. ఓపెనర్‌గా క్రీజులోకి అడుగుపెడుతున్న మరో బ్యాట్స్‌మన్ నెల్లూరు రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. నారాయణ, శ్రీధర్‌రెడ్డి ఈ ఇద్దరు ఓపెనర్లు ప్రత్యర్థి జట్టు తమ ముందు ఉంచిన టార్గెట్‌ను చిత్తు చేస్తారని, రికార్డు స్కోరు సృష్టిస్తారనే పొలిటికల్ అభిమానులు అంచనా వేస్తున్నారు. పార్లమెంట్ ఫలితాలను మలుపుతిప్పగలిగే సత్తాకలిగిన కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావలి అభ్యర్థి దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, జట్టు విపత్కర పరిస్థితులను ఫేస్ చేస్తే దానిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి మిడిల్ ఆర్డర్‌లో ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి వంటి అనుభవజ్ఞుడు, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల నుంచి యువకులు.. హిట్టర్స్ కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావులను సిద్ధం చేసింది. ఇక తిరుపతి పార్లమెంట్ ఫలితాలపై ప్రభావం చూపగలిగే స్థాయి కలిగిన సీనియర్ క్రీడాకారుడు, రాజకీయ క్రీడలో ఆల్ రౌండర్‌గా పిలవబడే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని సర్వేపల్లి బరి నుంచి రంగంలోకి దింపింది.

వైసీపీ టీం

గత ఎన్నికల్లో ట్రోఫీ గెలుచుకున్న వైసీపీ టీం ఈసారి ఆట మొదలు కాకముందే ఆటుపోట్లను ఎదుర్కొందనే విషయంలో అనుమానం లేదు. జట్టు మేనేజర్ పోకడ నచ్చక ముగ్గురు సీనియర్ ఆటగాళ్లు మ్యాచ్‌కి ఇంకా ఏడాది సమయం ఉందనగానే పక్కకు వచ్చేసి ప్రత్యర్థి టీంలో చేరిపోయారు. టీంలోని ఒక ఆటగాడి కుట్రలు జీర్ణించుకోలేక, వాటిని సమర్థించిన మేనేజర్ పోకడను భరించలేక అందరి నోట మెప్పులు పొందిన ఒక బలమైన క్రీడాకారుడు జట్టు నుంచి తప్పుకున్నాడు. ప్రత్యర్థి టీంలో సారథి బాధ్యతలు స్వీకరించాడు. దీంతో చేదు అనుభవాలతో వైసీపీ ఆట మొదలు పెట్టాల్సి వచ్చింది. కానీ వైసీపీ టీంలో కూడా బలమైన క్రీడాకారులు ఉన్నారు. జట్టు సారథి బాధ్యతలు చేపట్టిన నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి ఐపీఎల్ (ప్రత్యక్ష ఎన్నికల్లో) బ్యాట్ పట్టుకోవడం తొలిసారే అయినా ప్రత్యర్థుల లెక్కలు తారుమారు చేయడంలో సిద్ధహస్తుడిగా గుర్తింపు పొందారు. ఇక ఈ జట్టులో ఇప్పటికే రెండు, మూడు సార్లు ఎన్నికల క్రీడలో ఆడిన అనుభవం కలిగిన క్రీడాకారులు ఉన్నారు. నెల్లూరు రూరల్ నుంచి ఆల్ రౌండర్‌గా గుర్తింపు పొందిన ఆదాల ప్రభాకరరెడ్డి పోటీ చేస్తున్నారు. ఈయన ఆట తీరు గురించి జిల్లా ప్రజలకు బాగా తెలుసు. అయితే ఈ సారి ఎలా ఉండబోతోంది అనే విషయంలోనే ఉత్కంఠ నెలకొని ఉంది. ఇక కావలి అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఫామ్‌లో లేరనే ప్రచారం చాలా రోజులుగా నడుస్తోంది. అయితే ఈయన్ను తక్కువగా అంచనా వేయలేము. ఈయనకు రెండు సార్లు గెలిచిన అనుభవం ఉంది. కోవూరు అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కుటుంబం రాజకీయ క్రీడల్లో ఆరితేరింది. ఆత్మకూరు, ఉదయగిరిల నుంచి మేకపాటి కుటుంబ వారసులు విక్రమ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డిలు రంగంలో ఉన్నారు. ఈ కుటుంబానికి అభిమానులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. కందుకూరు నుంచి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆ నియోజకవర్గ పిచ్‌కి కొత్త వారే కానీ ఆటలో మాత్రం పాతవారే. ఇక తిరుపతి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోకి వచ్చే సర్వేపల్లి నుంచి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రంగంలోకి దిగారు. చతురత కలిగిన క్రీడాకారుడిగా ఈయనకు మంచి గుర్తింపు ఉంది.



పైసా లేదు.. వసతులెలా!?

- పోలింగ్ కేంద్రాల నిర్వహణ బాధ్యత హెచ్‌ఎంలదే!
- నాడు-నేడు నిధులు వినియోగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ
- ఉన్నతాధికారుల ఒత్తిళ్లు
- తలలు పట్టుకుంటున్న ప్రధానోపాధ్యాయులు

ప్రభుత్వ తీరు చాలా విడ్డూరంగా ఉంది. బడి ఖాతాల్లో నిధుల్లేక నాడు-నేడు పనులు చాలాచోట్ల అర్ధంతరంగా ఆగిపోయి మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. చిన్న అవసరాలకు కూడా పైసా లేక ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం) ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాలుగా ఎంపికైన పాఠశాలల్లో నిర్వహణకు కావలసిన ఏర్పాట్లకు నాడు-నేడు నిధులు వినియోగించుకోవాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిపై హెచ్‌ఎంలు మండి పడుతున్నారు.

సంగం, మార్చి 23 : జిల్లాలో 2,033 ప్రాథమిక, 2,56 ప్రాథమికోన్నత, 2,95 ఉన్నత పాఠశాలలతోపాటు మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 90శాతం పాఠశాలల్లో 2,317 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో బీఎల్వోలతోపాటు ఏరియా సెక్టోరియల్ అధికారులను నియమించారు. ఆయా కేంద్రాలలో వీరు పర్యటించి పోలింగ్ నిర్వహణకు కావలసిన ర్యాంపుల నిర్మాణం, విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు వంటి వసతులు ఉన్నాయా.. లేకుంటే ఏమేమి వసతులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు నివేదికలు పంపారు. దాదాపు పోలింగ్ కేంద్రాలన్నీ పాఠశాలల్లోనే ఉన్నాయి. ఏ కేంద్రంలో వసతులు ఏవో వాటి ఏర్పాట్ల బాధ్యతలు కూడా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులదే చూసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు మనబడి.. నాడు-నేడు ఫేజ్-1, ఫేజ్-2 స్కూళ్లకు విడుదల చేసిన స్కూల్ మెయింటెన్స్ ఫండ్ (ఎస్ఎంఎఫ్) నుంచి నిధులు వాడుకోవాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులు కూడా రాని స్కూళ్ల హెచ్‌ఎంలు అందుబాటులో ఉన్న ఇతర నిధులను ఖర్చు చేయాలని కూడా చెప్పారు. దీనిపై హెచ్‌ఎంలు భగ్గుమంటున్నారు. అసలు ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు స్కూల్ కాంపోజిట్ గ్రాంట్ల కింద పైసా ఇవ్వలేదు. నాడు-నేడు 2వ విడత పనులు చేస్తున్న స్కూళ్లకు ఇచ్చిన నిధులు ఖర్చయిపోయాయి. కొన్నిచోట్ల నిధులు చాలక అర్ధంతరంగా పనులు ఆగిపోయాయి. అలాంటప్పుడు ఖాతాల్లో నిధులు ఎలా ఉంటాయని ప్రశ్నిస్తున్నారు. నిధులు లేవని చెప్పినా ఎలాగైనా చేయాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.

● స్కూల్ గ్రాంటు సగం ఇతర జిల్లాల పాఠశాలలకు..

ఇటీవల ప్రతి పాఠశాలకు రూ.26వేల స్కూల్ గ్రాంటును పాఠశాలల ఖాతాలకు జమ చేసింది. దీనిలో సగం ఇతర జిల్లాలలోని పాఠశాలల అడ్రస్సులతో జమ చేయాలని చెప్పడంతో పంపించారు. పాఠశాలల నిర్వహణకు అవసరమైతే నాడు-నేడు నిధుల నుంచి కేటాయించుకోమని ప్రభుత్వం సూచిస్తుంది. అసలు ఏ పాఠశాలలోనూ నాడు-నేడు నిధులు మిగల్లేదు. అవి చాలకే చాలా పాఠశాలల్లో నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయి. చాలా మంది హెచ్‌ఎంలు చివరి దశలో ఉన్న నిర్మాణాలు పూర్తి చేసేందుకు సొంత డబ్బు వెచ్చించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ బిల్లులు రాకపోతే తాము నష్టపోయినట్లేనని ఆవేదన చెందుతున్నారు.

రెవెన్యూశాఖ వ్యవహారం

గతంలో పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన అంశం పూర్తిగా రెవెన్యూ శాఖ చూసుకునేది. ఆ శాఖ ఆధ్వర్యంలోనే ప్రతి సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తారు. రెవెన్యూ శాఖ ఆదేశాల మేరకు ప్రతి తహసీల్దార్ తమ పరిధిలోని గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేసేవారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా రెయిలింగ్, ర్యాంపులు, ఏర్పాటు చేసేవారు. అంతేకాదు వేసవి కావడంతో ఫ్యాన్లు, వెలుతురు కోసం లైట్లు, మరుగుదొడ్లు వంటి వసతులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈసారి అందుకు భిన్నంగా విద్యాశాఖను ఏర్పాటు చేయాలని సూచించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఆదేశాలతో హెచ్‌ఎంలపై భారం మోపడం ఎంతవరకు సమంజసమని విద్యాశాఖ అధికారుల్లో చర్చ నడుస్తోంది.



సంగం పాఠశాలలో నిలిచిపోయిన అదనపు భవనాల నిర్మాణం

వైసీపీకి సీనియర్ల రాజీనామా

- వివరాలు 8లో..

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

రండి దర్శించండి తరించండి

శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానము

శింగరకొండ, అద్దంకి మండలం, బాపట్ల జిల్లా

69వ వార్షిక తిరునాళ్ళ మహోత్సవములు

(తేది.23-03-2024 నుండి 25-03-2024 వరకు)

స్వామియే స్వయముగా ఆవిర్భవించి క్షేత్ర మహిమలు కలిగిన దివ్యక్షేత్రము శింగరకొండ నందు

తేది.25-3-2024 సోమవారం ఉదయం 5గంటల నుండి స్వామి వారి దివ్యదర్శనము, సాయంత్రము గం॥6.00లకు రథోత్సవము. ప్రతిరోజు సాయంత్రము గం॥6.00 నుండి సాంస్కృతిక కార్యక్రమములు కలవు. భక్తులు విరివిగా ఈ మహోత్సవములో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావలసినదిగా కోరుచున్నాము. దేవస్థానములో జరుగు రాతి ముఖమండపము పునఃనిర్మాణమునకు మరియు వివిధ అభివృద్ధి పనులకు భక్తులు సహకరించి విరివిగా విరాళములు ఇచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరు.

పరోక్షముగా aptemples.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా E-Hundi, E-Donations మరియు అన్ని స్వామి వారిసేవలలో పాల్గొనవచ్చును.

పార్కింగ్ స్థలములు	ట్రాఫిక్ మళ్లింపు వివరాలు
1.అద్దంకి వైపు నుండి వచ్చు వాహనములకు కూకట్ల కన్వెన్షన్ హాల్ ప్రక్కనుండి 99 అడుగుల విగ్రహము వరకు	1. ఒంగోలు టు హైదరాబాద్ వయా మార్టూరు, చిలకలూరిపేట, నరసరావుపేట వైపు
2. నరసరావుపేట వైపు నుండి వచ్చు వాహనములకు చక్రాయపాలెం వైపు గల ఆర్చ్ గేట్ వద్ద	2. వినుకొండ నుండి వచ్చు వాహనాలు వయా సంతమాగులూరు క్రాస్ రోడ్, చిలకలూరిపేట వైపు
3. సింగరకొండపాలెం వైపు వచ్చు వాహనదారులు సింగరకొండపాలెం MPH School వద్ద.	3. కడప నుండి వచ్చు వాహనాలు వయా పొదిలి, చీమకుర్తి, ఒంగోలు వైపు
	4. అద్దంకి ట్రాఫిక్ మేదరమెట్ల పైలాన్ నుండి నేషనల్ హైవే వైపు

సదా స్వామి వారి సేవలో...

తల్లాప్రగడ సుభద్ర, సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి

శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానము శింగరకొండ అద్దంకి మండలం, బాపట్ల జిల్లా



తడారుతున్న గొంతుల

జలదాత వీపీఆర్

- ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో అందవేసిన చేయి
- నిరుపేదలకు పట్ల తండ్రి లాంటి వాత్సల్యం
- సేవల్లో దిట్ట.. అవార్డులకే వన్నెతెచ్చిన 'ప్రభాకరుడు'
- దేశ విదేశాల్లోనూ పేరుప్రతిష్టలు

నెల్లూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):

వీపీఆర్ ఫౌండేషన్‌తో సేవా కార్యక్రమాలు... గొంతెండుతున్న గ్రామాలకు నీటిశుద్ధి ప్లాంట్లు... పైసా ఖర్చు లేకుండా పేద విద్యార్థులకు ఉచితంగా ఉత్తమ విద్య అందించడం.... అంగరంగ వైభవంగా ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ... వీటన్నింటితోపాటు అన్నార్థులకు, అనాథ శరణాలయాలకు టక్కున గుర్తువచ్చే మూడక్షరాల పేరు వీపీఆర్ (వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి). జిల్లా ప్రజలకు వీపీఆర్ ఫౌండేషన్ అంటేనే ఒక గౌరవం. సాయం అందిస్తారన్న నమ్మకం. ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన పేరుతో స్థాపించిన ఈ ఫౌండేషన్ నెల్లూరు జిల్లాలో వందలాది గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. నిరుపేద పిల్లలకు ఉచితంగా ఉత్తమ విద్య అందించాలనే ధ్యేయంతో ప్రత్యేక పాఠశాలను నిర్వహిస్తోంది. దైవిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. ఆపదలో ఉన్న ఎంతోమందిని ఆదుకుంటోంది.





సమాజ సేవలో వీపీఆర్ ఫౌండేషన్ తనవంతు సాయం అందిస్తోంది. కరోనా సమయంలో ఈ ఫౌండేషన్ జిల్లా వ్యాప్తంగా లక్షలాదిగా శానిటైజర్ బాటిల్స్, మాస్కులు పంపిణీ చేసింది. 10 లీటర్ల సామర్థం కలిగిన 100 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్ మిషన్లను ఉచితంగా అందజేసింది. నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి, ఐసొలేషన్ కేంద్రాల్లో కరోనా బాధితులకు, వారి సహాయకులకు ఉచిత భోజన సదుపాయం కల్పించింది. ఇంకా ఏమి చేసిందంటే...

● సమాజానికి తన వంతు సాయం

- జయభారత్ ఆసుపత్రిలో పేదవారికి కోసం గుండె జబ్బుల విభాగంలో స్కానర్, కలర్ డాప్లర్ ఏర్పాటు
- నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి అధునిక సదుపాయాలతో కూడిన అంబులెన్స్ విరాళం
- స్వర్ణభారత్ ట్రస్టులో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విభాగంలో ఆపరేషన్ థియేటర్ నిర్మాణం, కృతిమ అవయవాల తయారీ కేంద్రంతో సహా పలు ప్రజోపయోగ కార్యక్రమాలకు ఆర్థిక సాయం
- భగవాన్ మహావీర్ వికలాంగ సహాయత సమితి తోడ్పాటుతో వందలాదిమంది కాళ్లు లేని వారికి జైపూర్ ఫుట్‌ను ఉచితంగా అమర్చడం
- పాఠశాలలకు, ఆసుపత్రులకు ఆహారాన్ని సరఫరా చేయడానికి అవసరమైన వాహనాన్ని ఇస్కాన్ ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఇస్కాన్ ప్రాంగణంలో గోశాల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు చేశారు.
- తనకు విద్యాబుద్ధులు నేర్పిన రిషివ్యాలీ స్కూలు అడ్మినిస్ట్రేటివ్ భవన నిర్మాణానికి తనవంతు సాయం అందించారు
- వెయ్యిమందికి పైగా మానసిక వికలాంగులకు అండగా నిలుస్తున్న తమిళనాడు స్పాస్టిక్ సొసైటీకి పలుసార్లు ఆర్థిక సాయం
- వాత్సల్య అనాథ శరణాలయానికి భవన నిర్మాణం కోసం ఆర్థిక సాయం. ప్రతి ఏటా అక్కడ నివసించే పిల్లలకు ఒక నెల పాటు భోజన ఖర్చు భరించడం
- మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకుడు గ్రోసు గోపాలయ్య నేతృత్వంలో నడుస్తున్న మాతా అన్నపూర్ణేశ్వరి వృద్ధాశ్రమంలో భవన నిర్మాణానికి ఆర్థిక సాయం.
- నెల్లూరులోని ప్రగతి చారిటీస్ నిర్వహణకు ప్రతి ఏటా ఆర్థిక సాయం
- నెల్లూరు పెన్నా తీరాన హిందూ శ్మశాన వాటికలో దహనశాల నిర్మాణం.
- జిల్లా క్రీడా మండలి ఆధ్వర్యంలో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్మించిన ఇండోర్ స్టేడియానికి ఆర్థిక సాయం.
- పోలీస్ పరేడ్ మైదానంలో బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణం
- నెల్లూరు రామూర్తినగర్ పురపాలక పాఠశాల భవన నిర్మాణానికి ఆర్థిక సాయం.
- స్లీపింగ్ చిల్డ్రన్ అరౌండ్ ది వరల్డ్ (ఎస్‌సీఏడబ్ల్యూ) వీపీఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 3వ తరగతి చదివే 2000 మంది పేదవిద్యార్థులకు బెడ్‌కిట్స్ పంపిణీ.

● తాగునీరు అందించిన జలదాత

వీపీఆర్ ఫౌండేషన్ అందిస్తున్న మరో మంచి పథకం అమృతధార. జిల్లాలో చాలా గ్రామాలు ఫ్లోరైడ్ నీటితో అల్లాడుతున్న విషయాన్ని గుర్తించిన ఆయన వాటిని అదుకోవడానికి నడుం బిగించారు. ఇప్పటికి వందకుపైగా ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేసి గ్రామీణులకు ఉచితంగా శుద్ధ జలాన్ని అందిస్తున్నారు. ఫ్లోరైడ్, టీడీఎస్, క్లోరైడ్ శాతం అధికంగా ఉన్న హైరిస్క్ గ్రామాలను ఎంపిక చేసుకొని ఆయా గ్రామాల్లో ఆర్‌వో ప్లాంట్లు స్థాపిస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 38 మండలాల్లో 101 ఆర్‌వో ప్లాంట్లను సొంత నిధులతో ఆయన ఏర్పాటు చేశారు. ఎంపీ నిధులతో మరో 14 ఆర్‌వో ప్లాంట్లను స్థాపించారు.ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేసి వదిలేయకుండా టెక్నికల్ నిర్వహణ కూడా వీపీఆర్ ఫౌండేషనే నిర్వహిస్తున్నది. సంఖ్యతో పని లేకుండా నెల్లూరు జిల్లా ప్రజలందరికీ శుద్ధిజలం అందించాలన్నది వీపీఆర్ ఆశయం.



● స్కూల్‌లో నేర్చుకున్న లక్షణాలను ఆచరిస్తూ..

తనకు విద్యనేర్పిన రిషివ్యాలీ స్కూలు నుంచి నేర్చుకున్న మంచితనం, మానవత్వం, దానగుణంతో వీపీఆర్ వ్యాపార రంగానికి సమాంతరంగా సేవామార్గాన్ని కూడా ఎంచుకున్నారు. తన ప్రతిభతో ఒక వైపు పారిశ్రామికవేత్తగా రాణిస్తూనే మరో వైపు తనపేరుతో స్థాపించిన వీపీఆర్ ట్రస్టు ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నారు. 2015లో పురుడుపోసుకున్న వీపీఆర్ ఫౌండేషన్ 8ఏళ్లుగా సమాజసేవలో ప్రసంశనీయమైన పాత్ర పోషిస్తోంది. వీపీఆర్ సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఫౌండేషన్ ఛైర్‌పర్సన్‌గా సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నారు.

● వీపీఆర్ విద్య

నిరుపేదలకు కార్పొరేట్ విద్య అందించాలన్న సంకల్పంతో పాఠశాల స్థాపించారు. 2016లో కనుపర్తిపాడు సమీపంలో ప్రారంభమైన ఈ పాఠశాల కార్పొరేట్ వసతులను మించిన అత్యున్నత ప్రమాణాలతో నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తోంది. తొలిఏడాది 99 మంది విద్యార్థులతో ప్రారంభించిన ఈ పాఠశాల గడచిన 9ఏళ్లలో ఎంతో మంది పేద పిల్లలకు ఉచిత విద్య అందించింది. ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులకు పుస్తకాలు, భోజనం, యూనిఫాం, వైద్య సదుపాయం, బస్సు సౌకర్యం అన్నీ కూడా ఉచితమే. పాఠ్యాంశాల బోధనకే కాకుండా వ్యక్తిత్వ వికాస బోధనకు ఈ స్కూలులో పెద్ద పీట వేస్తున్నారు. అనుభవజ్ఞులైన బోధనా సిబ్బంది, ల్యాబ్‌లు, విశాలమైన క్రీడామైదానంతో ఈ స్కూలు జిల్లాలోనే ఉత్తమ పాఠశాలగా గుర్తింపు పొందింది. ఈ స్కూలు పిల్లలు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రత్యేక శ్రద్ధ చూపడం విశేషం. తనకు ఎప్పుడు సమయం దొరికినా స్కూలుకు వెళ్లి పిల్లలతో గడపడానికి వీపీఆర్ ఆసక్తి చూపిస్తుంటారు. దీని బట్టి చూస్తే నిరుపేద పిల్లల పట్ల ఆయనకున్న అభిమానం ఎలాంటిదో అర్థం అవుతుంది.

● వీపీఆర్ వైద్యం

వీపీఆర్‌ఆర్ స్కూలు ఆవరణలోనే ఫౌండేషన్ ఉచిత ఆసుపత్రి నిర్వహిస్తోంది. ఈ ఆసుపత్రికి వెళితే డాక్టరుకు కన్సల్టేషన్ ఫీజు ఇవ్వాల్సిన అవసరం లేదు. పైగా ఎక్స్‌రే, ఈసీజీ, ఇతర ఆరోగ్య పరీక్షలు అన్ని ఉచితంగా చేస్తారు. మందులు కొనే స్థోమత లేని పేదలకు అవసరమైన మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు.





● వీపీఆర్ ఆధ్యాత్మికం

సేవా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ వీపీఆర్ ముందుంటారు. రాష్ట్రంలోని పలు ఆలయాలకు భారి విరాళాలు అందజేయడమే కాకుండా పెద్దఎత్తున దైవిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిరుమలలో అతిథి గృహం నిర్మించి శ్రీవారికి కానుకగా సమర్పించారు. 2015 నుంచి 2022 వరకు నెల్లూరులో జరిగిన శ్రీవెంకటేశ్వర వైభవోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి ఆలయ గాలిగోపుర నిర్మాణం, బంగారు కలశస్థాపన, కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ మహా కుంభాబిషేకం, బంగారు కలశస్థాపన, శ్రీశైలం దేవస్థానానికి బంగారు రథం బహూకరణ, భక్తుల కోసం ఉచిత వసతి గదుల నిర్మాణం, జిల్లాలోని రామతీర్థంలోని రాములవారి గుడికి పునఃనిర్మాణం, సూళ్లూరుపే చెంగాళమ్మ ఆలయ అభివృద్ధి, కుంభాభిషేకం, జొన్నవాడ కామాక్షితాయి ఆలయ అభివృద్ధికి బూరి విరాళాలు అందజేశారు. అల్లూరులో ప్రతి ఏటా పోలేరమ్మ జాతర, ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించే జగన్నాథ రథయాత్ర సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాలు, ప్రతి ఏటా కార్తీకమాసంలో లక్ష దీపోత్సవం కార్యక్రమానికి చేయూత అందించారు. షిర్డిసాయి బాబా నిజపాదుకలను నెల్లూరుకు తీసుకువచ్చి ప్రజలకు దర్శనభాగ్యం కల్పించారు.





● అందుకున్న పురస్కారాలు ఎన్నో..

- 2006లో ప్రపంచ ప్రఖ్యాత సంస్థ జెసీస్ ద్వారా ఉత్తమ వ్యాపారవేత్త పురస్కారం అదుకున్నారు
- 2008లో ప్రఖ్యాత వోల్వో సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించే అంతర్జాతీయ కేలండర్‌లో స్థానాన్ని సంపాదించుకున్న తొలి భారతీయుడిగా గుర్తింపు
- 2009లో బెజవాడ గోపాలరెడ్డి అవార్డు
- కొమస్టో అనే అంతర్జాతీయ భారీ వాహనాల సంస్థను దేశానికి పరిచయం చేయడమే కాకుండా, దక్షిణ భారతంలోనే ఆ సంస్థకు అతిపెద్ద ఖాతాదారునిగా గుర్తింపు పొందారు.
- 2018లో అమెరికా నాటా ద్వారా అత్యంత ప్రతిష్టాత్మకమైన జీవిత సాఫల్య అవార్డు అందుకున్నారు.
- ప్రముఖ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం చేతుల మీదుగా 2018లో సేవా భూషణ్ బిరుదు అందుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన సేవలకు అందని అవార్డు అంటూ లేదు.





రాజకీయాల్లో అరుదైన గుర్తింపు

వీపీఆర్ దంపతులు అనుసరిస్తున్న సేవా మార్గానికి రాజకీయ రంగంలోనూ అరుదైన గుర్తింపు లభించింది. సాదారణంగా పార్టీలో చేరికలు ఆ పార్టీ అధినేత నివాసం వద్దో, రాష్ట్ర పార్టీ కార్యాలయాల్లోనో జరుగుతాయి. కాని వీపీఆర్ దంపతులు తెలుగుదేశం పార్టీలో చేరిక సందర్భంగా ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్వయంగా నెల్లూరుకు వచ్చారు. వీపీఆర్ లాంటి వ్యక్తులను గౌరవించడం తన బాధ్యతగా గుర్తించి తానే స్వయంగా నెల్లూరుకు వచ్చినట్లు వేలాది మంది గుమికూడిన సభలో చంద్రబాబు ప్రకటించారు. రాజకీయ రంగంలో ప్రత్యేకించి తెలుగుదేశం పార్టీలో ఈ దంపతులకు పట్ల ఉన్న గౌరవాభిమానాలకు చంద్రబాబు వ్యాఖ్యలే నిదర్శనం. ఈ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీలో ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి టిక్కెట్లు కేటాయించిన కుటుంబాలు నాలుగే. చంద్రబాబు, యనమల, అచ్చెన్నాయుడు కుటుంబాలైతే ఆ అరుదైన అవకాశం దక్కిన నాల్గవ కుటుంబం వేమిరెడ్డి ప్రభారరెడ్డిది కావడం విశేషం. తెలుగుదేశం పార్టీ నుంచి నెల్లూరు పార్లమెంట్‌కు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి(వీపీఆర్) కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు పోటీ చేస్తున్నారు.



అనుమతి లేని సమావేశాలొద్దు



మద్యం దుకాణం పరిశీలిస్తున్న ఆర్వో మధులత

ఆత్మకూరు, మార్చి 23: ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నందున కల్యాణమండపాల్లో అనుమతి లేని రాజకీయ సమావేశాలు నిర్వహించరాదని ఆత్మకూరు ఆర్వో మధులత తెలిపారు. మద్యం దుకాణాలను పరిశీలించి బల్క్ ఆర్డర్‌పై మద్యం అమ్మవద్దని సూచించారు. పాన్‌బ్రోకర్‌లు బంగారం కుదువ పెట్టుకొని నగదు ఇవ్వొద్దని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

అనంతసాగరం, మార్చి 23: స్థానిక వ్యవసాయ సొసైటీ కార్యాలయంలో శనివారం అనంతసాగరం వ్యవసాధికారి శ్రీధర్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రంను ఏర్పాటు చేశారు. ధరల వివరాలను రైతులకు తెలియజేశారు.

కలువాయిలో 'బీఎస్ఎఫ్' కవాతు



కలువాయి, మార్చి 23: ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకుకోవాలని శనివారం కలువాయిలోని ప్రధాన వీధుల్లో బీఎస్ఎఫ్ దళాలు కవాతు నిర్వహించారు. వీరి వెంట రాపూరు సీఐ సుబ్రమణ్యం, కలువాయి ఎస్ఐ అయ్యప్ప ఉన్నారు.

వైభవంగా 16 రోజుల పండుగ



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి రూరల్, మార్చి 23: గండిపాళెం జలాశయం ఆవరణలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శనివారం 16రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించి 16రోజులు కావడంతో అర్చకులు లోకా ప్రసాద్‌శర్మ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు విశేష అలంకరణలు చేపట్టారు. భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు చేసి నైవేద్యం సమర్పించారు.

మోడల్ కోడ్ కండక్ట్ అధికారి తనిఖీ

ఉదయగిరి, మార్చి 23: జీ.చెరువుపల్లి, బండగానిపల్లి, చెర్లోపల్లి పంచాయతీల్లో శుక్రవారం మోడల్‌కోడ్ కండక్ట్ అధికారి దేవరకొండ ఈశ్వరమ్మ తనిఖీలు నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఎన్నికల నిబంధనలకు ప్రకారం ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, స్టిక్కర్లు తొలగింపుపై పరిశీలించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించరాదని హెచ్చరించారు. ఆమె వెంట కార్యదర్శులు చినబాబు, అంజనేయులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Atmakur ...

SCHEDULE

...

Perepi Venugopal, B.Com., B.L.,
Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259526

'లింగ నిర్ధారణ'కు పాల్పడితే చర్యలు



ఆత్మకూరు : స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డివిజనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్‌వీ సుధీర్‌కుమార్

ఆత్మకూరు, మార్చి 23: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని, ప్రభుత్వ నిబంధనలకు మేరకు స్కానింగ్ సెంటర్లను నిర్వహించాల్సి ఉందని డివిజనల్ ప్రోగామ్ ఆఫీసరు డాక్టర్ ఎన్‌వీ సుధీర్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన వైద్యులు దినకర్, అనూషతో కలిసి ఆత్మకూరులోని పలు స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. అవసరమైన మార్పులపై సూచనలిచ్చారు. రిపోర్టులను జిల్లా ఆరోగ్యశాఖాధికారికి పంపు తామన్నారు. స్కానింగ్ సెంటర్ల వద్ద ధరల పట్టిక, ప్రచార బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

ఉదయగిరి రూరల్: స్కానింగ్ తీసిన పిదప ఆడ, మగ అని లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని చాకలకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కె.మురళీధర్ అన్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి పెంచలయ్య ఆదేశాల మేరకు పట్టణంలోని వేణు, అనురాధ, శ్రీవిద్య ప్రైవేటు, ప్రభుత్వ వైద్యశాలల్లో స్కానింగ్ సెంటర్లను సిబ్బందితో కలిసి పరిశీలించారు. స్కానింగ్ చేసే వైద్యుల వివరాలు, విద్యార్హతలు, రిజిస్టర్, రెన్యువల్ ధ్రువపత్రాలు వివరాలతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య బోధకుడు కె.వెంకటసుబ్బయ్య, ఆరోగ్య సహాయకులు గురవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ఆత్మకూరు, మార్చి 23: స్థానిక గురుకుల విద్యాలయాల్లో 5,6,7,8 తరగతులు, జూనియర్, కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆత్మకూరు గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ టి.కామేశ్వరి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 25న ప్రవేశ అర్హత పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఉదయగిరి రూరల్ : గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గండిపాళెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జే.పుష్పరాజ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని, జిల్లా ముఖ్య కేంద్రాల్లో ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

సీతారామపురం: ఏపీ మోడల్‌స్కూల్‌లో 2024-2025 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ షేక్ ముజీబుర్ రెహమాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించి మార్చి 28నుంచి మే 22వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10వ తరగతి మార్కుల మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

నిబంధనల మేరకే మద్యం విక్రయాలు చేపట్టాలి

ఉదయగిరి రూరల్, మార్చి 23: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నిబంధనల మేరకే మద్యం విక్రయాలు చేపట్టాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మూడు ప్రభుత్వ మద్యం దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కోడ్ అమల్లో ఉన్నందున మద్యాన్ని నిబంధనల మేరకే అమ్మకాలు చేపట్టాలన్నారు. ఎవరైనా అధిక మద్యం కావాలని ఒత్తిడి చేస్తే వారి వివరాలు తెలిజేయాలన్నారు. రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. అలాగే ఫంక్షన్ హాల్, కుదవ అంగళ్లను తనిఖీ చేశారు. రాజకీయ పార్టీ నాయకుల సభలు, సమావేశాలకు అనుమతులు ఉంటేనే నిర్వహించుకునేందుకు ఇవ్వాలన్నారు. కోడ్ అమలుకు అందరూ సహకరించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఆర్వో నెహ్రూబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో ఇసుక రీచ్‌లకు అనుమతి లేదు



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధులత

సంగం, మార్చి 23: ఎన్నికల కోడ్ అమలుతో ఇసుక రీచ్‌లకు అనుమతి లేదని ఆత్మకూరు ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధులత తెలిపారు. శనివారం ఆమె పెన్నానదిలోని అధికారిక ఇసుక రీచ్‌ను పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇసుక తరలించకూడదని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం సంగంలో కల్యాణ మండపాలను పరిశీలించారు. కల్యాణ మండపాలల్లో ఎలాంటి రాజకీయ సమావేశాలు నిర్వహించరాదని నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఆర్ఐ ఆదినారాయణ, సిబ్బంది ఉన్నారు.

అనంతసాగరం: పడమటికంభంపాడు ఇసుకరీచ్‌లో నిబంధనలను అతిక్రమించి ఇసుక రవాణా జరుగుతోంది. శనివారం అనంతసాగరం రెవెన్యూ, ఆత్మకూరు సెబ్ అధికారులు ఈ రీచ్‌ను పరిశీలించారు. ఈ సమయంలో వాహనాలన్నీ వెళ్లిపోయాయి.

15 వరకు సోమశిలకు నీటి విడుదల



కలువాయి మండల సమవేశంలో పాల్గొన్న ప్రజా ప్రనిధులు, అధికారులు

కలువాయి, మార్చి 23: సోమశిల దక్షిణ కాలువ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పైర్లకు ఏప్రిల్ 15వరకు నీరిచ్చే ప్రయత్నం చేస్తామని సోమశిల ఏఈ మహేష్ తెలిపారు. మండల కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఈ సీజన్‌లో దక్షిణ కాలువకు సోమశిల నీటి నిర్వహణను సరిపోయినట్లు చేశారని ప్రాజెక్టు అధికారులను జెడ్పీటీసీ బి.అనిల్‌కుమార్‌రెడ్డి అభినందించారు. కోడ్ వచ్చే నాటికి మొదలుపెట్టిన అభివృద్ధి పనులు చేసుకోవచ్చుని, కొత్తగా పనులు చేసేందుకు వీలుండదని ఎంపీడీవో ప్రభాకర్ తెలిపా రు. సమావేశంలో శాఖల పరిధిలో జరుగుతున్న పనులను అధికారులు వివరించారు. ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ పంగా పెంచల నరసారెడ్డి, తహసీల్దారు సంజీవకుమారి పాల్గొన్నారు. మండల సమా వేశంలో చింతలపాళెం సర్పంచు కండే వెంకటసుబ్బమ్మ భర్త కండే కృష్ణయ్య, నూకనపల్లి సర్పంచు సుంకు మౌనిక భర్త సుంకు వెంకటకృష్ణయ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో దృష్టికి తీసుకుపోగా సభ్యులు కానివారు సమావేశంలో ఉంటే బయటకు వెళ్లిపోవాలని ముందే తాను హెచ్చరించినట్లు తెలిపారు.

టీబీ నివారణపై వైద్యఆరోగ్య సిబ్బంది ర్యాలీ



బిట్రగుంట: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బిట్రగుంట, మార్చి 23: బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీ పరిధిలో శనివారం డాక్టర్ జిహారిక ఆధ్వర్యంలో ప్రపంచ క్షయవ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సులోచన, ఎఫ్ఎస్ మేరీ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ పేటలో..

ఏఎస్ పేట: టీబీని పూర్తిగా నయం చేయవచ్చని ఏఎస్ పేట పీహెచ్‌సీ వైద్యులు సురేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన ప్రపంచ టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా గ్రామ విధుల్లో ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీలో టీబీ పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్రమం తప్పకుండా మందులు వాడకంతో వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో చిన్నయ్య, సూపర్‌వైజర్ రషీద్, ఎంపీహెచ్ఎస్ కుమారి, హెల్త్ అసిస్టెంట్లు రసూల్, శీను, రవూఫ్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.



ఏఎస్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

సీతారామపురం: వరల్డ్ టీబీడే నివారణను పురస్కరించుకొని సీతారామపురంలో వైద్యులు స్వప్న ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు స్వప్న మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా బరువు తగ్గుతున్నా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయుం చుకోవాలని కోరారు. టీబీ నిర్ధారణ జరిగితే మందులు ఉచితంగా పంపిణీ, ఫుడ్ బాస్కెట్స్, ప్రతినెలా రూ.500లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో మజీద్, పీహెచ్ఎన్ కృష్ణమ్మ, ఎంపీహెచ్ఎస్ రియాజ్, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంఎస్, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయ సలహాలకు బృందం ఏర్పాటు

ఉదయగిరి రూరల్, మార్చి 23: సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు న్యాయ సలహాలు అందించేందుకు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ సూచన మేరకు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు శనివారం టీడీపీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు తెలిపారు. బృం దంలో న్యాయవాదులు కల్లూరి తిరుపతయ్య, మనోరమ, సీహెచ్ రమేష్, ఎం.అశోక్, టీ.కిరణ్‌తో పాటు అనుబంధ సభ్యుడిగా నూతంగి తులసీని ఉంటారన్నారు. ఏ సమయంలోనైనా సరే సహాయ, సహకారాలు అందించేందుకు బృందం సిద్ధంగా ఉంటుందన్నారు. తనను నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికల బాధ్యతలు అప్పగించిన కాకర్ల సురేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హార్ట్ వార్మింగ్ ఎంటర్‌టైనర్



నెల్లూరు	-	రైన్ సినిమాస్
నెల్లూరు	-	పివిఆర్ ఐనాక్స్
నెల్లూరు	-	స్పైస్ సినిమాస్

PVR INOX LIMITED

సూపర్ హిట్...



కావలి	-	శ్రవంతి
కందుకూరు	-	యువరాజు
వింజమూరు	-	జనార్థన్ మహల్
గూడూరు	-	సప్తగిరి శ్రీనివాస
లింగసముద్రం	-	విజయలక్ష్మి

CONTACT 8374991228

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రోడ్డు మార్జిన్‌లో గుంత.. వాహనచోదకుల చింత



రాళ్లపాడు ప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలో కోతకు గురై గుంత ఏర్పడిన ఆర్అండ్‌బీ రోడ్డు

లింగసముద్రం, మార్చి 23: మండలంలోని తాతాహోటల్ నుంచి మొగిలిచెర్ల వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్ రాళ్లపాడు ప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలో కోతకు గురైంది.దీంతో గుంత ఏర్పడడంతో వాహనదారులు భయంతో ప్రయాణిస్తున్నారు. మార్జిన్‌లోని గుంతలో నుంచి మట్టి ఎక్కువగా కోసుకుపోవడంతో పక్కనే ఉన్న కల్వర్టు కింద గోడ పడిపోయింది.దీంతో కల్వర్టు శ్లాబు వేలాడుతూ ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై ప్రతినిత్యం అధిక సంఖ్యలో వాహనాలు వెళతుంటాయి. ప్రతి శని, ఆదివారాల్లో ఈ రోడ్డు మీదుగా మొగిలిచెర్లలోని దత్తాత్రేయస్వామి ఆలయానికి, మాలకొండకు అధికంగా భక్తులు వెళతుంటారు.సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైసీపీకి సీనియర్ల రాజీనామా

● టీడీపీలో చేరేందుకు ఇంటూరితో మంతనాలు

ఉలవపాడు, మార్చి 23: మండలంలోని వైసీపీ సీనియర్ నాయకులు ఆ పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ గెలుపుకోసం అహర్నిశలు కష్టపడ్డామని,అయినా తమను ఎమ్మెల్యే పట్టించుకోలేదని పేర్కొన్నారు. బుర్రా మధుసూదన్ కూడా స్థానిక ఎమ్మెల్యే అడుగుజాడల్లో నడుస్తూ తమను పూర్తిగా విస్మరించాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతలు చేపట్టి మూడు వారాలు అయినా కనీస పలకరింపులు లేవని వాపోయారు. గుర్తింపులేని పార్టీలో ఇమడలేక రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో శుక్రవారం రాత్రి ఉలవపాడులో వైసీపీ అసమ్మతి నేతలు సమావేశమై టీడీపీలో చేరేందుకు సమ్మతించారు. టీడీపీలోకి చేరనున్నవారిలో వైసీపీ సీనియర్ నాయకులు సుంకర చెంచురామిరెడ్డి, సూరం చిరంజీవిరెడ్డి, పులిచర్ల వెంకటసుబ్బారెడ్డి, అడపా వెంకట్రావు, తానికొండ రాజా, తోకల సుబ్బారావు, కూనం శ్రీనివాసులరెడ్డి తదితరులతోపాటు మరికొందరు ఉన్నారు.

దుర్మార్గపు ప్రభుత్వాన్ని సాగనంపాలి : సౌజన్య

కందుకూరు : పట్టణంలో ఏ ప్రాంతానికి వెళ్లినా జగన్మోహనరెడ్డి దుర్మార్గపు పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారని, ఈ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య కోరారు. పట్టణంలోని 6వ వార్డు విక్కిరాలపేట రోడ్డు, విజయబాలాజీ కల్యాణమండపం ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీచేసి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ అహ్మద్‌బాషా, షేక్ సలాం, తహరాబేగం, షాహిదా, మహబూబ్‌జానీ, నసీమా ఖరీమూన్, షేక్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరులో టీడీపీ ప్రచారం

కావలి : పట్టణంలోని ముసునూరు 14వ వార్డులో శనివారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నేతలు ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్‌పథకాల క్యాలెండర్లను, కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం సీఎంగా చంద్రబాబు నాయుడిని గెలిపించుకోవాలన్నారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కావలి ఎమ్మెల్యేగా కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు బొట్లగుంట శ్రీహరినాయుడు, రావినూతల వెంకటేశ్వర్లు, పోలిశెట్టి శ్రీనివాసులు కమ తం శ్రీను, మంద శేషయ్య, మంద శీనయ్య, మర్లపాటి శీనయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇంటూరి నాగేశ్వరరావుతో చర్చిస్తున్న ఉలవపాడు వైసీపీ అసమ్మతి నేతలు



కావలి : టేబుల్ క్యాలెండర్ అందచేస్తున్న టీడీపీ నేతలు



కందుకూరులో సౌజన్య ప్రచారం

నేడు కందుకూరుకు వీపీఆర్ రాక

కందుకూరు, మార్చి 23: నెల్లూరు ఎంపీగా పోటీచేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆదివారం కందుకూరులో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారని అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఆదివారం సాయంత్రం 4 గంటలకు పెద్దబజారులోని సీతారామ ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఆర్యవైశ్యులతో జరిగే ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు పామూరు రోడ్డులోని ఎస్వీఎస్ కల్యాణమండపంలో టీడీపీ శ్రేణులతో పరిచయ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం, మార్చి23: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఖాదర్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులకు ఈనెల 28 నుంచి మే 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 95537 55139 నంబరును సంప్రదించాలని తెలిపారు.

513 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, మార్చి 23: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 570 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 13కంపెనీల ప్రతినిధులు పాల్గొని 513బేళ్ల కొనుగోలు చేశారు. నోసేల్-8, నో బిడ్-34, సీఆర్-13, జంపింగ్‌లాట్స్-2 కారణాలతో 57బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.231, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.228.39గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

దగదర్తిలో స్వతంత్ర అభ్యర్థి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న స్వతంత్ర అభ్యర్థి సాల్మాన్‌రాజు

బిట్రగుంట, (దగదర్తి) : దగదర్తి మండల పరిధిలోని పలుగ్రామ పంచాయతీల్లో శనివారం కావలి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మాన్‌రాజు ప్రచారం చేశారు. ఓసిగుంటపాలెం, సవటపుత్రుడు, తడకలూరు, దగదర్తి, చెన్నూరు, సిద్ధారెడ్డిపాలెం, రంగసముద్రం, మనుబోలుపాడు, కామినేనిపాలెం గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లా యర్ కోవూరుబాబు, నక్కగిరి, కే నవీన్ కుమార్, సుబ్రహ్మణ్యం, కిరణకుమార్ పాల్గొన్నారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలి



స్టేషన్‌మాస్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వాకర్స్ సభ్యులు

బిట్రగుంట : రద్దు చేసిన చెన్నై-బిట్రగుంట- విజయవాడ మెమూ రైళ్లను పునరుద్ధించాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం బిట్రగుంట స్టేషన్‌మాస్టర్ మురళీధర్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. అనంతరం షేక్ నూరుద్దీన్, నూకసాని శ్రీనివాసులుయాదవ్, దాసరి సునీల్ తదితరులు మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటులో ఉండే మెమూ రైళ్లను రద్దుతో పలువురు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మెమే రైళ్లను త్వరగా పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో జై భీం అంబేడ్కర్ సేవాదళ్ అధ్యక్షుడు బత్తుల రవిచంద్ర, శశికుమార్, సత్యనారాయణచార్యులు, అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార వారోత్సవాలు

బిట్రగుంట : బోగోలు మండలం జేపీ గూడూరు సెక్టారు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. సూపర్‌వైజరు డీ సుప్రజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

కోడ్ ఉన్నా.. అమలు ఎక్కడ ?



అముదాలదిన్నెలో పార్టీ రంగులతో ఉన్న శిలాఫలకం

కావలి రూరల్, మార్చి23: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఆచరణలో మాత్రం అమలు జరగడం లేదు. కావలి మండలం ఆముదాలదిన్నెలో మురుగు నీటి కాలువ నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకానికి అధికార పార్టీ నేతలు తమ పార్టీ జెండా రంగులు వేశారు. నిబంధనల మేరకు పార్టీ రంగులు తొలగించాల్సి ఉన్నా శిలాఫలకానికి కాగితాలు అంటించిన అధికారులు రంగులు మాత్రం అలాగే వదిలేశారు. అధికారుల తీరును గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

అనుమతులతోనే సమావేశాల నిర్వహణ

కందుకూరు, మార్చి 23: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నేతలు ముందస్తు అనుమతులు లేకుండా కల్యాణ మండపాలు, ఇతర ప్రదేశాల్లో ఎలాంటి సమావేశాలు నిర్వహించటానికి లేదని, అలా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో, సబ్ కలెక్టరు జి. విద్యాధరి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని ఆమె పరిశీలించారు. మద్యం దుకాణంలోని రికార్డులను స్టాకు, విక్రయాల వివరాలను పరిశీలించిన ఆమె ఎవరికి కూడా పెద్దమొత్తంలో మద్యం విక్రయించరాదన్నారు. అలా ఎవరికైనా మద్యం అందజేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని స్పష్టంచేశారు. అలాగే పట్టణంలో పాన్‌బ్రోకర్ సర్టిఫికెట్ కలిగిన వారు, ఇతర కుదువ వ్యాపారులు పెద్దమొత్తంలో బంగారం కుదువ పెట్టుకుని ఎవరికైనా నగదు ఇవ్వవద్దన్నారు. అలా ఇచ్చిన వారిపై చర్యలు తప్పవని సబ్ కలెక్టరు స్పష్టం చేశారు.

దుకాణాల్లో అధికారుల తనిఖీ



మద్యం దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న కావలి ఈఆర్వో శీనానాయక్ తదితరులు

కావలి, మార్చి23 : సజావుగా ఎన్నికల నిర్వహణలో భాగంగా కావలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో శీనానాయక్ శనివారం పట్టణంలో తనిఖీలు చేపట్టారు. ముందుగా ఒంగోలు బస్టాండ్ ఆవరణలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తనిఖీ చేసి, అందులో ఉన్న రికార్డులను పరిశీలించారు. నిబంధనల మేరకే మద్యం విక్రయాలు జరుపుతున్నారా ? లేక వారిష్టానుసారం విక్రయిస్తున్నారా.. వచ్చిన స్టాకు, అమ్మకాలకు, నిల్వకు సరిపోయిందా ? లేదా.. అని పరిశీలించారు. అలాగే విజయలక్ష్మి పాన్‌బ్రోకర్స్, దేవిశ్రీ పాన్‌బ్రోకర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. తదుపరి బృందావనం హౌసింగ్ కాలనీలోని కల్యాణ మండపంలో వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఆర్వో, కావలి తహసీల్దార్ నగేష్, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కందుకూరు, మార్చి 23: భగత్ సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నేతలు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్ పోరాటస్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు పీ మాలకొండయ్య, బీ సురేష్‌బాబు, ఎస్కే హుస్సేన్, వై. ఆనంద్ మోహన్, బాలబ్రహ్మచారి, కోటేశ్వరరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

కావలిటౌన్ : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలో ఘననివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నలంద పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సీపీఎం కార్యాలయంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పలువురు నేతలు మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ నేతలు లోకేష్, వర్షిత్, భాను, డీవైఎఫ్ఐ నేతలు కృష్ణమోహన్, నరసింహ, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

చెంచుగానిపాలెంలో రక్తదానం శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కావలి, మార్చి23: స్థానిక శ్రీచైతన్య డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం కావలి రూరల్ మండలం చెంచుగానిపాలెంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం, రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్థులకు బీపీ, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పేరూరి వెంకటసాయి తేజ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.